14-7Pg1exHMNWJQE.qxd:14-7Pg1exHMNWJQE.qxd 01/01/01 10:20 AM Page 1

సమాలోచన
సమ సామాజికాంశాలపై విశ్లేషణ
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

గుంటూరు

: fb.com/vaartha Digital

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

14-7-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 163 పేజీలు: 12 వెల: 6.50

బీహార్ ఓటర్లలో అత్యధికులు బంగ్లా, నేపాల్ పౌరులు

9లో

రాజ్యసభకు మరో నలుగురు ప్రముఖులు

## విలక్షణ నటుడు, 'పద్మశ్రీ' కోట శ్రీనివాసరావు ఇక లేరు



దీర్ఘ అస్వస్థతతో హైదరాబాద్‌లో కన్నుమూత

నాలుగు దశాబ్దాలు పైగా సినిమా రంగంలో విశేష ఖ్యాతి

9 సార్లు నంది అవార్డులు సాధించిన అసాధారణ నటుడు

తమిళం, కన్నడం, హిందీ రంగాల్లోనూ గుర్తింపు

ప్రధాని మోడీ, తెలుగు సిఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డి, డి.సిఎం పవన్ సహా పలువురు ప్రముఖుల నివాళులు

అభిమానుల అశ్రుతర్పణం మధ్య ముగిసిన అంత్యక్రియలు



హైదరాబాద్‌లో కోట శ్రీనివాసరావు భౌతికకాయంవద్ద నివాళులర్పిస్తున్న సిఎం చంద్రబాబునాయుడు

**హైదరాబాద్ (పంజగుట్ట), జులై 13 (ప్రభాతవార్త):** విలక్షణ నటుడు, మాజీ శాసనసభ్యుడు కోట శ్రీనివాసరావు(83) ఆదివారం తెల్లవారుజామున ఫిలింనగర్ లోని తన నివాసంలో మృతిచెందారు. దీర్ఘ కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న కోట రెండు రోజుల క్రితమే 83వ పుట్టిన రోజు జరుపుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కంకిపాడులో జన్మించిన కోట శ్రీనివాస రావు 1978లో ప్రాణంఖరీదు సినిమాతో తన సినీప్రయాణాన్ని ప్రారంభించారు. నాలుగు దశాబ్ధాలకు పైగా సాగిన సినిమా కెరియర్‌లో ఆయన 750కి పైగా చిత్రాలలో నటించారు. తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషలలో >>2


# ఎపి అభివృద్ధిని ఆపలేరు

2027కు అమరావతి నిర్మాణం పూర్తి

ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు

పోలవరం ప్రాజెక్టు 2027కి పూర్తి

హెల్త్, ఎడ్యుకేషన్ హబ్‌గా అమరావతి: సిఎం చంద్రబాబు



**విజయవాడ,జులై 13,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రాభివృద్ధికి ఎవ్వరెన్ని అడ్డంకులు పెట్టేందుకు ప్రయత్నించిన వారు భంగపడాల్సిందేనని సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు.రాష్ట్ర సమగ్రాభివృద్ధిని ఎవ్వరు అడ్డుకోలేరన్నారు. సామాజిక మాధ్యమాలు వేదికగా ఆయన ప్రజలకు పలు అంశాలను వెల్లడించారు.ప్రజల సహకా రంతో, కేంద్ర ప్రభుత్వ మద్దతుతో, పక్కా ప్రణాళికతో అందరికీ అవకాశాలు సృష్టించేలా, రాష్ట్రానికి చోదక శక్తిగా నిలిచేలా ఫ్యూచర్ సిటీగా రాజధాని అమరావతిని నిర్మిస్తామని సిఎం చంద్రబాబు తెలిపారు.
అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధి సాధించి తమకు అండగా ఉన్న ప్రజల నమ్మకాన్ని నిలబెడతామని అన్నారు. పోలవరం ప్రాజెక్టు 2027 నాటికి పూర్తి చేస్తామన్నారు. రాష్ట్ర ప్రజలు, రాజధాని రైతుల పోరాటానికి ఫలితం లభించిందన్నారు. గత ప్రభుత్వంలో విధ్వంసానికి గురైన రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తామని ఎన్నికల ముందు చెప్పామని గుర్తు చేశారు. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ముందుకెళ్తున్నందున ఆర్థిక కష్టాలున్నా ఏడాది పరిపాలనలో వ్యవస్థలన్నింటిని దారిలో పెట్టామన్నారు.పెద్దఎత్తున అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టామన్నారు. తల్లికి వందనం అనుకున్నట్లుగానే ఎంత చదువుకునే పిల్లలు ఒక కుటుంబంలో చదువుకుంటుంటే వారికి ఇస్తున్నారు.ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు పథకం ప్రారంభిస్తున్నామన్నారు.వచ్చే జనవరి నాటికి అమరావతిలో క్వాంటం వ్యాలీ ప్రారంభవుతుందన్నారు. ఈ ఏడాది డిసెంబరు నాటికి పోలవరం డయాఫ్రం వాల్ పూర్తవుతుందన్నారు. ఇక ప్రాజెక్టును 2027 నాటికి పూర్తి చేస్తామని పునరుద్ఘాటించారు. ప్రపంచం మెచ్చే నగరంగా అమరావతిని తీర్చిదిద్దుతామని సీఎం చంద్రబాబు పునరుద్ఘాటించారు. దశాబ్దం క్రితం ప్రధాని మోడీ చేతుల మీదుగా అమరావతికి శంకుస్థాపన జరిగిందన్న ఆయన గత ఐదేళ్ల విధ్వంస పాలనలో నలిగిపోయిందన్నారు.
వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీ ఆక్సిజన్ అందించారని కొనియాడారు. మరికొన్ని రోజులు సహకారం అందిస్తే బలమైన ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రాన్ని తీర్చి దిద్దు తామని ధీమా వ్యక్తం చేశారు. అభివృద్ధి వికేంద్రీకరణ ఎన్డీయే విధానం కాబట్టే 2014 నుంచి కేంద్ర విద్యా సంస్థలు ఉత్తరాంధ్ర, కోస్తా, సీమ జిల్లాల్లో ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు.రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణం కూడా చేపడతామని ముఖ్యమంత్రి వివరించారు. విశాఖపట్నం ఆర్థిక రాజధానిగా, తిరుపతిని ఆధ్యాత్మిక నగరంగా తీర్చిదిద్దుతామని >>2

## 26 నుంచి ముఖ్యమంత్రి సింగపూర్ పర్యటన

రాష్ట్రానికి పెట్టుబడుల సమీకరణకై మంత్రులతో కలిసి పయనం

**విజయవాడ,జులై 13,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం సిఎం చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. అందులో భాగంగా ఎపి రాజధాని అమరావతితోపాటు వివిధ జిల్లాలు, తీర ప్రాంత అభివృద్ధి కోసం పటిష్టమైన చర్యలు చేపట్టింది. ఆ క్రమంలో సిఎం చంద్రబాబు, మంత్రులతోపాటు ఉన్నతాధికారుల బృందం జులై 26 నుంచి 30 వరకూ సింగపూర్‌లో పర్యటించనుంది. ఈ బృందంలో మంత్రులు నారా లోకేష్, పి.నారాయణ, టిజి భరత్‌తోపాటు ఉన్నతాధికారులు ఉన్నారు. సింగపూర్‌లోని రాజకీయ, వ్యాపార వర్గాలతో ఈ బృందం సమావేశం కానుంది. నగర ప్రణాళిక, నగర సుందరీకరణ, ఉద్యానవనాలు, ఓడరేవులు, మౌలిక వసతుల కల్పనతోపాటు భవిష్యత్ సాంకేతికతను అంది పుచ్చుకోవడం తదితర అంశాలపై చంద్రబాబు సారథ్యంలోని ఈ బృందం.. సింగపూర్‌లోని వివిధ రంగాల ప్రముఖలతో చర్చించనుంది.

## ఒక జిల్లా - ఒక ఉత్పత్తిలో ఎపికి 10 అవార్డులు

ఏడు చేనేత, హస్తకళలు, రెండు వ్యవసాయ ఉత్పత్తులకు పురస్కారాలు

అంతర్రాష్ట్ర విభాగంలో మరో అవార్డుకు ఎంపిక

ఆగస్టు 7 నుంచి నేతన్నలకు ఉచిత విద్యుత్

చేనేత, జౌళి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి సిసోడియా



చేనేత, జౌళి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి. సిసోడియా

**విజయవాడ,జూలై13,ప్రభాతవార్తప్రతినిధి:** ఒక జిల్లా ఒక ఉత్పత్తి (వన్ డిస్ట్రిక్ట్ - వన్ ప్రొడక్ట్ ఒడిఒపి) కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌కు పది ప్రతిష్టాత్మక జాతీయ అవార్డులు లభించాయని రాష్ట్ర ప్రభుత్వ చేనేత, జౌళి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి. సిసోడియా తెలిపారు. వీటిలో ఏడు అవార్డులు చేనేత మరియు హస్తకళా ఉత్పత్తులకు, రెండు వ్యవసాయ ఉత్పత్తులకు లభించాయి. మరో అవార్డు అంతరరాష్ట్ర విభాగంలో రాష్ట్రానికి దక్కింది. ఈ అవార్డులను సోమవారం న్యూఢిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించే కార్యక్రమంలో కేంద్ర మంత్రి పియూష్ గోయల్ అధికారికంగా ప్రకటించి, ప్రదానం చేయనున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలోని ప్రభుత్వ ప్రోత్సాహం, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత చేస్తున్న కృషికి ఈ అవార్డులు నిదర్శనమని సిసోడియా పేర్కొన్నారు. అవార్డు పొందిన చేనేత, హస్త కళా ఉత్పత్తుల్లో విజయనగరం జిల్లా బొబ్బిలి వీణ, అనకాపల్లి జిల్లాకు చెందిన ఎటికొప్పాక బొమ్మలు, కాకినాడజిల్లా పెద్దాపురం శారీస్, బాపట్ల జిల్లాలోని చీరాల శారీస్, తిరుపతి వెంకటగిరి శారీస్, పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం అల్లికలు, శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టు చీరలు ఉన్నట్లు తెలిపారు. వ్యవసాయ విభాగంలో గుంటూరు మిర్చి, శ్రీకాకుళం జీడిపప్పు అవార్డులు గెలుచుకున్నాయని చెప్పారు.ఇతర రాష్ట్రాలతో జరిగిన పోటీలో ఎపికి దక్కిన మరో అవార్డు వివరాలు సోమవారం నాటి కార్యక్రమంలోనే అధికారికంగా వెల్లడించనున్నట్లు చెప్పారు. ఆయా జిల్లాల కలెక్టర్లు, కళాకారులు ఇప్పటికే న్యూఢిల్లీకి చేరుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయి సంవత్సరం లోపే పది అవార్డులు రావడం రాష్ట్రానికి గౌరవంగా భావిస్తు >>2

## అమరావతిలో భూ కేటాయింపులు

కొత్తగా ఏడు సంస్థలకు 32.40 ఎకరాలు పంపిణి

**విజయవాడ,జూలై13,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతిలో పలు సంస్థలకు భూ కేటాయింపులు, గతంలో చేసిన మరికొన్ని సంస్థల కేటాయింపులను రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ సిఫార్సుల మేరకు పలు సంస్థలకు ప్రభుత్వం భూ కేటాయింపులు చేసింది. గతంలో భూములు కేటాయించిన ఆరు సంస్థలకు పలు సవరణలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే రాజధానిలో కొత్తగా ఏడు సంస్థలకు 32. 40 ఎకరాల భూములను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. ఆ క్రమంలో బిజెపి రాష్ట్ర కార్యాలయానికి 2 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించింది. 60 ఏళ్ల లీజు ప్రాతిపదికన పలు సంస్థలకు ఈ భూములు కేటాయించింది.
ఇక గెయిల్‌కు 0.40, అంబికాకు ఎకరా భూమి కేటాయింపులను రద్దు చేసింది. అందుకోసం తగిన చర్యలు తీసుకోవాలని సిఆర్‌డిఏ కమిషనర్‌ను ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. అలాగే వివిధ సంస్థలకు ఎపిసిఆర్డీఏ భూములు కేటాయింపుపై 18వ మంత్రి వర్గ ఉప సంఘం నిర్ణయాలకు పరిపాలన అనుమతులు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జిఓఎంఎస్ నెంబర్ 122 జారీని మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్ జారీ చేశారు. జూన్ 23వ తేదీన జరిగిన మంత్రి వర్గ ఉప సంఘం భూములు కేటాయింపు.. పున: పరిశీలన, కొత్తగా కేటాయింపు చేస్తూ పలు ప్రతిపాదనలు ప్రభుత్వానికి సమర్పించింది. ఈ ప్రతిపాదనలను జులై 5వ తేదీన జరిగిన 50 సిఆర్‌డిఏ అథారిటీ ముందు కమిషనర్ ఉంచారు. దీంతో సదరు ప్రతిపాదనలు ఆమోదిస్తున్నట్లు ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు.

## అమరావతిలో బిట్స్ పిలాని క్యాంపస్

రూ. 1000 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు: కుమారమంగళం బిర్లా

**విజయవాడ, జులై 13,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతిలో బిర్లా ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (బిట్స్), పిలానీ క్యాంపస్‌ను ఏర్పాటు చేయనున్నది.రూ.1,000 కోట్ల పెట్టుబడితో కొత్త క్యాంపస్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆ విశ్వవిద్యాలయ ఛాన్సలర్, బిర్లా గ్రూప్ చైర్‌పర్సన్ కుమార మంగళం బిర్లా తెలిపారు. ఆ మేరకు ఓ ప్రకటన విడుదల చేసారు. కొత్త ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్లస్ (ఎఐ+) క్యాంపస్ రెండు దశల్లో దాదాపు 7,000 మంది విద్యార్థులను >>2

## అన్నమయ్య జిల్లాలో ఘోర ప్రమాదం

లారీ బోల్తా: ఏడుగురు కార్మికులు మృతి

**కడప, జులై 13:** అన్నమయ్య జిల్లాలో ఘోర రోడ్డుప్రమాదం జరిగింది. రెడ్డిపల్లె చెరువుకట్టపై లారీ బోల్తాపడి ఏడుగురు మృతిచెందారు. మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. సంఘటనను గమనించిన స్థానికులు క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. కొందరుకూలీలు మామిడికాయలు కోసేందుకు వచ్చి పనిపూర్తి చేసుకుని కోసిన కాయలను మొత్తం లారీకి లోడ్‌చేసారు. ఇక వాటిని రైల్వే >>2

## వేదవర్సిటీలో అక్రమాలపై టిటిడి విజిలెన్స్ నివేదికలు!

వ్యవస్థాపక దినోత్సవం నిర్వహణతో వెలుగులోకి




**తిరుపతి, జులై 13ప్రభాతవార్తప్రతినిధి:** హిందూ ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానం వేదాల పరిరక్షణలో భాగంగా రెండు దశాబ్ధకాలం క్రిందట తిరుపతిలో శ్రీవేంకటేశ్వర వేదవిశ్వవిద్యాలయం స్థాపించింది. టిటిడి మానసపుత్రికగా నెలకొల్పిన ఈ వేదవిశ్వవిద్యాలయంలో పలు అక్రమాలపై ఇటీవల టిటిడి విజిలెన్స్ విభాగం విచారణచేసి నివేదికలు సిద్ధంచేసింది. గత ఐదేళ్లలో విశ్వవిద్యాలయంలో జరిగిన నియామకాలు, పాలనతీరుపై పలువురు ఆచార్యులు, అధ్యాపకుల నుండి ఆరోపణలు రావడంతో విజిలెన్స్ జోక్యం తప్పనిసరైంది. లోతుగా అధ్యయనం చేసిన విజిలెన్స్ విభాగం అక్రమాలను నివేదిక రూపంలో టిటిడి అధికారులకు అందజేసింది. రానున్న పాలకమండలి సమావేశంలో వేద విశ్వవిద్యాలయం పై చర్చించి మార్పులుచేర్పులు తీసుకునే దిశగా ఆలోచన చేస్తున్నారు. గత ఐదేళ్ల వైసిపి ప్రభుత్వంలో అప్పటి పాలకమండలి పెద్దల జోక్యంతో ఓ ఉన్నతాధికారి తీసుకున్న నిర్ణయాలతో జాతీయ విశ్వవిద్యాలయం (యూజిసి) నిబంధనలకు విరుద్ధంగా నోటిఫికేషన్ లేకుండా ఉపకులపతి పదవిని భర్తీచేయడం అప్పట్లోనే పెద్ద దుమారంరేగింది. అయితే అప్పటి టిటిడి పెద్దలు, ఓ అధికారి పెద్దగా పట్టించుకోకుండా వారికి అనుకూలమైన వ్యక్తిని నియమించారనేది ఇప్పుడు >>2

## బొబ్బిలి వీణకు అరుదైన గుర్తింపు



నేడు ఢిల్లీలో అవార్డును అందుకోనున్న కలెక్టర్

**బొబ్బిలి (విజయనగరం జిల్లా), జులై 13 ప్రభాతవార్త:** ఇప్పటికే దేశవిదేశాల్లో విశేష ప్రాచుర్యం పొందిన బొబ్బిలి వీణకు మరో అరుదైన గుర్తింపు లభించింది. ఒన్ డిస్ట్రిక్ట్... ఒన్ ప్రొడక్ట్ (ఒడిఒపి) బహుమతిక్రింద బొబ్బిలివీణ ఎంపికయ్యింది. ఒడిఒపి అవార్డుకు >>2

## అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.25 లక్షల సాయం

బిసి, మైనార్టీలకు రూ.20 లక్షలు

ఇబిసి, కాపులకు రూ.15 లక్షలు

**విజయవాడ, జులై13,ప్రభాతవార్త ప్రతినిధి:** విదేశాల్లో ఉన్నత విద్య చదివే విద్యార్థులకు ఆర్థిక చేయూతనందించేందుకు ప్రభుత్వం అంబేద్కర్ ఓవర్సీస్‌ను అమలులోకి తీసుకుని వస్తుంది. విదేశీ విద్యాపథకాన్ని అమల్లోకి తీసుకురానుంది. ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీ,ఈబిసి,కాపు వర్గాల్లోని ప్రతిభావంతులైన పేదల పిల్లలకు విదేశాల్లో ఉన్నత విద్య చదవాలనే కలను నెరవేర్చేలా ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు విదేశీ విద్య పథకాన్ని పునరుద్ధరించనున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో అధికారులు పథకం అమలుకు కసరత్తు ప్రారంభించారు. ముసాయిదా మార్గదర్శకాలను రూపొందించి ప్రభుత్వానికి నివేదించారు. ఎస్సీ,ఎస్టీ విద్యార్థులకు రూ.25 లక్షలు,బీసీ,మైనార్టీలకు రూ.20 లక్షలు,ఈబీసీ,కాపు విద్యార్థులకు రూ.15 లక్షల చొప్పున అదించాలని అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఎస్సీ,ఎస్టీ విద్యార్థులకు అదనంగా నిర్వహణ ఖర్చుల క్రింద రూ.5 లక్షలు ఇవ్వాలని సూచించారు. ఈ పథకానికి అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధిగా పేరు పెట్టనున్నారు. పిజి,పిహెచ్‌డీ,ఎంబీబీఎస్ కోర్సులకు ఈ పథకాన్ని అమలు చేసేలా ప్రతిపాదనలు పంపినట్లు తెలిసింది.2014-19 మధ్య టిడిపి ప్రభుత్వం అంబేద్కర్,ఎన్టీఆర్ పేర్ల మీద ఈ పథకాన్ని అమలుచేసింది. వైకాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ పథకంపై పలు ఆరోపణలు వచ్చాయి. పథకానికి ఉన్న అంబేద్కర్,ఎన్టీఆర్ పేర్లను తొలగించి జగనన్న అనే పేరును పెట్టినట్లు విమర్శలున్నాయి. ఆర్థికసాయం పెంచినట్లు చూపించి విద్యార్థుల సంఖ్య పెరగకుండా నిబంధనలు పెట్టి ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీలకు పథక లబ్ధి అందకుండా చేసింది. సబ్జెక్టుల వారీగా క్యూఎస్ ర్యాకింగ్ ప్రకారం టాప్-50 వర్సిటీల్లో ప్రవేశాలు పొందే వారికే సాయం అందేలా నిబంధన తెచ్చింది.

## పేర్ని నానిపై మరో కేసు నమోదు

**విజయవాడ,జూలై13,ప్రభాతవార్తప్రతినిధి:** వైఎస్సార్సీ కీలక నేత ,మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) పై విజయవాడలో ఆదివారం మరో కేసు నమోదైంది. విజయవాడ-2 టౌన్ పోలీస్ స్టేషన్‌లో పేర్ని నాని చేసిన వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలంటూ తెలుగుదేశం పార్టీ మైనార్టీ నాయకులు ఫతావుల్లా, ఆషాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పేర్ని నానిపై కేసు నమోదు చేసి పోలీస్ స్టేషన్‌కు తీసుకురావాలని మైనార్టీ నేతలు కోరారు. నాని తమ పార్టీ కార్యకర్తలపైన,నాయకులపైన అత్యంత అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేస్తున్నారని ఫిర్యాదు దారులు అభిమోగించారు.దీని వలన శాంతి భద్రతలకు భంగం కలిగిస్తున్నారని ఆరోపించారు.ఈ ఫిర్యాదుపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసారు.

14-7pg2exHMNWJQE.qxd:14-7pg2exHMNWJQE.qxd 01/01/01 10:22 AM Page 1





కోట శ్రీనివాసరావు భౌతిక కాయంవద్ద నివాళులర్పిస్తున్న చిరంజీవి



కోట శ్రీనివాసరావు భౌతిక కాయంవద్ద నివాళులర్పిస్తున్న డి.సిఎం పవన్ కల్యాణ్

# కోట శ్రీనివాసరావు ఇక లేరు

>> విలన్,కామెడీ, క్యారక్టర్ ఆర్టిస్ట్‌గా ఆయన చేసిన పాత్రలు ప్రేక్షకులను అలరించాయి. అహనాపెళ్ళంట,ప్రతిఘటన,ఖైదీనంబర్ 786,శివ,యమలీల,గబ్బర్‌సింగ్ లాంటి చిత్రాలలో ఆయన తన నటనతో ఆయా సినిమాలకే హైలెట్‌గా నిలిచారు.2015 సంవత్సరంలో భారత ప్రభుత్వం కోట ప్రతిభను గుర్తించి పద్మశ్రీ అవార్డు ప్రధానం చేసింది. అలాగే 9 నంది అవార్డులను ఆయన పొందారు.కోట నటనలో చూపిన నైపుణ్యం, పాత్రలలో సజీవత అభిమానులను ఎంతగానో ప్రభావితం చేసింది.రాజకీయ రంగంలో కూడా ఆయన తన విశిష్ట ముద్రను వేశారు.1999 నుంచి 2004 వరకు విజయవాడ ఈస్ట్ అసెంబ్లీ నియోజకవర్గం నుండి బిజెపి ఎమ్మెల్యేగా సేవలందించారు.

**టాలీవుడ్‌లో ఆయనో బ్రాండ్...**

కోట శ్రీనివాసరావు టాలీవుడ్‌లో నటనకు ఓ బ్రాండ్ అని చెప్పవచ్చు. నటించేవారు ఎంతమంది ఉన్నా నటనలో జీవించేవారిలో కోట కూడా ఒకరని చెప్పాలి. ఆయన తనకు ఇచ్చిన పాత్రలో నటించడమే కాకుండా జీవించేవారని పలువురు దర్శకులు వ్యాఖ్యానించారు. కెమరామెన్ గంగతో రాంబాబు సినిమాలో కోట శ్రీనివాసరావు పక్షవాతం వచ్చిన వాడిలా నటించిన విధానం చూసిన వారు ఎవరైనా షాక్ అవ్వాల్సిందే. ఎందుకంటే ఆయన ఆ పాత్రలో కనిపించిన విధానం అంత వాస్తవికంగా ఉంటుంది. నటించడంతో పాటు పాత్రలను బట్టి డైలాగ్ చెప్పే విధానం కోటకు ప్రత్యేక శైలి కలిగి ఉంటుంది. ఇవన్నీ కలిపే ఆయనను టాలీవుడ్‌లో ఒక విలక్షణ నటుడిగా నిలబెట్టాయి. తెలుగులో ఆయన చివరిగా 2023లో విడుదలైన సువర్ణ సుందరి అనే చిత్రంలో కనిపించారు. కోట శ్రీనివాసరావు తమిళంలో 30కి పైగాచిత్రాలలో నటించగా, హిందీలో 10, కన్నడంలో 8,మలయాళం,డక్కన్ భాషలో ఒక్కో చిత్రంలో నటించారు. అంతేకాదు కొన్ని చిత్రాలలో పాటలు పాడి ప్రేక్షకులను రంజింపజేశారు....

**ప్రముఖుల సంతాపం..**

కోట శ్రీనివాసరావు ఆకస్మిక మృతి పట్ల తెలుగు రాష్ట్రాలలోని పలువురు ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఎపి,తెలంగాణ సిఎంలు నారా చంద్రబాబునాయుడు, రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఇరు రాష్ట్రాలకు చెందిన కేబినెట్ మంత్రులతో పాటు సినీ ప్రముఖులు చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, వెంకటేష్, మోహన్‌బాబు, రాజేంద్రప్రసాద్‌తో పాటు సినీ రంగంయావత్తూ కోట భౌతిక కాయాన్ని దర్శించుకుని ఆయనతో తాము నటించిన సందర్భాలను గుర్తుకు చేసుకున్నారు. ప్రముఖ కమెడియన్ బ్రహ్మానందం అయితే కోట భౌతిక కాయాన్ని దర్శించుకుని తీవ్ర దుఖంలో మునిగిపోయారు. అక్కడే విలపిస్తూ చాలాసేపు మౌనంగా నిల్చుండిపోయారు.

**ఎపి సిఎం చంద్రబాబు ఘన నివాళి..**

కోట శ్రీనివాసరావు భౌతికకాయాన్ని ఎపి సిఎం చంద్రబాబునాయుడు సందర్శించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కోట చిత్ర పరిశ్రమకు చేసిన సేవలను కొనియాడారు.కోట శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు.

**పవన్ కల్యాణ్ ఘన నివాళి..**

ఎపి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ కోట శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కోట తన అన్న సినిమా ప్రాణం ఖరీదు సినిమాతో అరంగేట్రం చేసిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు.

**అభిమానులు, సన్నిహితులతో నిండిపోయిన ఫిలింనగర్..**

కోట శ్రీనివాసరావు మరణ వార్త ఆదివారం ఉదయం తెలియగానే ఆయన అభిమానులు, సన్నిహితులు, పరిశ్రమకులు చెందిన వారు ఉదయం నుంచే తండోపతండాలుగా ఆయన నివాసానికి చేరుకుని తీవ్ర విషాదంలో మునిగిపోయారు. లెజండరీ యాక్టర్ అంటూ సినీ ప్రముఖులు కీర్తిస్తూ ఆయన చేసిన మరుపురాని పాత్రలను గుర్తుకు చేసుకున్నారు. ముఖ్యంగా సినీ,రాజకీయ రంగాలకు చెందిన ప్రముఖులు చాలామంది స్వయంగా కోట భౌతిక కాయాన్ని సందర్శించుకుని చివరిసారిగా తమ అభిమాన నటుడుకి ఘన నివాళి అర్పించుకున్నారు. అభిమానులు, స్నేహితులు, కుటుంబ సభ్యుల అశ్రునయనాల మధ్య ఆదివారం సాయంత్రం కోట శ్రీనివాసరావు అంత్యక్రియలు మహాప్రస్థానంలో ముగిశాయి.

**విలక్షణ వ్యక్తిత్వం..సరదా మనిషి..వర్క్‌లో సిన్సియర్..**

కోట శ్రీనివాసరావుది విలక్షణ వ్యక్తిత్వంగా ఆయన మనసెరిగిన వారు చెబుతుంటారు.పనిలో ప్రత్యేక ధ్యాస, పనితర్వాతే ఏదైనా అనే మనిషి.సమయ పాలన, తోటి వారి పట్ల వాత్సల్యం..కాస్తంత సరదా మనిషి కూడా అని ఆయన సహచరులు చెబుతుంటారు. సెట్‌లో వచ్చాడంటే పాత్ర గురించి క్షుణ్ణంగా ఆకలింపు చేసుకుని తనదైన శైలిలో పాత్రను పండించడం ఆయనప్రత్యేకత. ఒకోసారి డైరక్టర్‌లు కూడా ఆయన నటనా చాతుర్యానికి అబ్బురపడేవారు. పాత్ర డిమాండ్‌ను బట్టి డైలాగ్ డెలివరీలో మేనరిజంను ఆయనే సెట్ చేసుకునేవారు. గత నాలుగు దశాబ్ధాలుగా విలనిజంలో కానీ, కామెడిని పండించడంలోకానీ, క్యారక్టర్ పరంగా ఆయనకు ఆయనే సాటిగా సినీ జీవితంలలో విరాజిల్లారు. ముఖ్యంగా కోట శ్రీనివాసరావు, బాబూమోహన్ కాంబినేషన్ తెలుగునాట ఇప్పటికీ ఆయాపాత్రలు చక్కర్లు కొడుతూనేఉన్నాయి. మామగారు సినిమాలో కోట, బాబూ మోహన్ జంట చేసిన కామెడీ ఎప్పటికీ మరుపురానిదృశ్యాలే. అతడు సినిమాలో హీరో మహేష్‌బాబుతో పొలిటికల్ కన్సషన్ లేదా అని చెప్పే డైలాగ్ అందరి మెదళ్లలో నానుతూ ఉంటుంది. అహనాపెళ్లంటలో ఆయన చేసిన పిసినారి పాత్ర ఎప్పటికీ అజరామరమే. అత్తకు యముడు అమ్మాయికి మొగుడు సినిమాలో అలనాటి నటి వాణిశ్రీతో కాంబినేషన్ అబ్బురపరిచే విధంగా ఉంటుంది. సీనియర్ హీరోలకు పోటీగా విలనిజాన్ని పండించి అందరిచేత శహభాష్ అనిపించుకున్నారు.సీనియర్‌ల పట్ల గౌరవం, తోటి నటుల పట్ల వాత్సల్యం ఆయనను మేటి నటుడిగానే కాకుండా అందరి వాడిగా నిలబెట్టిందని చెప్పవచ్చు.

**రాజకీయాల్లో రాణింపు...**

సినీ నటుడిగా విజయవంతంగా కెరీర్ సాగుతున్న సమయంలోనే రాజకీయాల్లో కూడా రాణించారు. పోటీచేసిన మొదటి ఎన్నికల్లోనే విజయవాడ నగరంలో పోటీచేసి విజయం సాధించారు. అయితే తర్వాత రాజకీయాలలో కొనసాగడం ఇష్టం లేక తనకిష్టమయిన సినీ రంగంలోనే కెరీర్‌ను కంటిన్యూ చేశారు. సినిమాలలో విలన్ పాత్రలు ఎక్కువగా చేసినా నిజ జీవితంలో మాత్రం విలువలకు కట్టుబడి ఉండేవారని ఆయన సన్నిహితులు చెబుతుంటారు. కొత్తవవారిని ప్రోత్సహించడంలో కానీ, పేద కళాకారులను ఆదుకోవడంలో కానీ ఆయన ఎపుడూ ముందుండేవారు. గుప్త దానాలకు ఆయన ఎక్కువగా ప్రాధాన్యం ఇచ్చేవారని ఆయన సన్నిహితులు చెబుతుంటారు. కొత్తగా సినిమాలు నిర్మించే నిర్మాతలకు సరైన సలహాలు ఇస్తూ నష్టపోకుండా సూచనలు ఇచ్చేవారని ఆయనను కడసారి చూడడానికి వచ్చిన పలువురు ప్రముఖులు చర్చించుకున్నారు. ఏది ఏమైనా కళామతల్లికి ఇష్టమైన మరో అద్భుత నటుడు సంపూర్ణ నటుడు కనుమరుగు కావడం తెలుగు తెలరకు తీరని లోటు అని చెప్పాలి.

# బొబ్బిలి వీణకు అరుదైన గుర్తింపు

>> రాష్ట్రం నుంచి 7 జిల్లాలకు చెందిన ఉత్పత్తులు ఎంపిక కాగా, బొబ్బిలికి చెందిన నమూనా వీణ ఎంపిక కావడం జిల్లాకు గర్వకారణంగా నిలిచింది. ఈ పురస్కారాన్ని అందుకునేందుకు జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఢిల్లీ వెళ్లారు. కొత్త ఢిల్లీ ప్రగతి మైదానంలోని భారత్ మండపంలో సోమవారం జరిగే కార్యక్రమంలో ఒడిఒపి అవార్డును కలెక్టర్ అందుకోనున్నారు.

**బొబ్బిలి వీణకు అంతర్జాతీయ గుర్తింపు:**

బొబ్బిలి వీణకు దేశవిదేశాల్లో ఎనలేని ఖ్యాతి ఉంది. బొబ్బిలి వీణ అని విస్తృతంగా పిలువబడే బొబ్బిలి నుండి వచ్చిన సాంప్రదాయ 'సరస్వతి వీణ' విలక్షణమైన స్వరాలకు ప్రసిద్ధి చెందింది. అలాగే సర్వస్వతి వీణను పోలి ఉండే చిన్నపాటి వీణను బహుమతిగా, జ్ఞాపికగా ఇవ్వడం ఏళ్ల తరబడి సంప్రదాయంగా వస్తోంది. దేశంలోనే కాకుండా అంతర్జాతీయ సమావేశాలు, సదస్సుల్లో సైతం బొబ్బిలి నమూనా వీణలను జ్ఞాపికలుగా ఇవ్వడం జరుగుతోంది. బొబ్బిలి వీణ బొమ్మలతో పోస్టల్ స్టాంపులు, నాణేలు కూడా ముద్రితమయ్యాయి. ఇతర రాష్ట్రాలకు సైతం బొబ్బిలి వీణలు ఎగుమతి అవుతున్నాయి. ఢిల్లీలో జరిగిన జి 20 సదస్సులో, విశాఖలో జరిగిన గ్లోబల్ సమ్మిట్‌లో సైతం బొబ్బిలి వీణ ప్రదర్శనలు జరిగాయి. అమెరికా మాజీ అధ్యక్షులు బిల్ క్లింటన్ ఈ వీణను చూసి ముచ్చట పడ్డారు. బొబ్బిలి వీణకు ఇప్పటికే మన కేంద్ర ప్రభుత్వం నుంచి భౌగోళిక గుర్తింపు కూడా లభించింది. బొబ్బిలి పట్టణానికి సమీపంలోని గొల్లపల్లి వీణల తయారీకి ప్రసిద్ధి చెందింది. వీణల తయారీ ఒక అరుదైన హస్త కళగా గుర్తింపు పొందింది. ఈ గ్రామంలోని దాదాపు 300 కుటుంబాలు గత 100 సంవత్సరాలకు పైగానే తమ జీవనోపాధి కోసం వీణల తయారీలో నిమగ్నమై ఉన్నాయి. బాడంగి మండలం వాడాడలో కూడా ప్రస్తుతం వీణలు తయారవుతున్నప్పటికీ, వాటికి కూడా బొబ్బిలి వీణలుగానే పరిగణిస్తున్నారు. వీటి తయారీకి పనస మరియు సంపంగి కలప చెక్కను ఉపయోగిస్తారు. వీణల తయారీకి కలప కొరతను నివారించేందుకు ఉత్తరాంధ్ర జిల్లాల్లో విస్తృతంగా పనస చెట్లను పెంచాలని ప్రభుత్వం ఇటీవలే నిర్ణయించింది. ఒడిఒపి క్రింద బొబ్బిలి వీణకు గుర్తింపు లభించడంతో, వీటి ఖ్యాతి మరింత ఇనుమడిస్తుందనడంలో సందేహం లేదు.

# అన్నమయ్య జిల్లాలో ఘోర ప్రమాదం

>> కోడూరుకు తీసుకెళ్లేందుకు బయలుదేరారు. ఈ క్రమంలో వారువెళుతున్న లారీ రెడ్డిపల్లె చెరువుకట్టపైకి రాగానే ఒక్కసారిగా అదుపుతప్పింది. దీనితోడ్రైవర్ నియంత్రణ కోల్పోయి లారీ బోల్తాపడింది. ఈ ప్రమాదంలో లారీలో ఉన్న ఏడుగురుకూలీలు అక్కడికక్కడే మృతిచెందారు. మరో 8 మంది కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. అయితేప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్నారు. గాయపడిన వారిని అంబులెన్స్ సాయంతో స్థానిక ఆసుపత్రికి తరలించారు. తర్వాతపోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాదస్థలాన్ని పరిశీలిస్తున్నారు. ప్రమాదానికిగల కారణాలపైదర్యాప్తుచేస్తున్నారు.

# అన్ని రైలు బోగీల్లో ఇక సిసి కెమెరాలు

## అరాచకాలకు చెక్

**న్యూఢిల్లీ,జూలై 13:** రైళ్లలో తరచూ జరుగుతున్న దొంగతనాలు, దోపిడీలు, అరాచకాలు, హింసాత్మక కార్యకలాపాలను అరికట్టేందుకు సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే ప్రయోగాత్మకంగా కొన్ని రైళ్లలో ఏర్పాటు చేసి పరీక్షించింది. ఆ ప్రయోగం విజయవంతం కావడంతో రైల్వే అన్ని కోచ్‌లలో సీసీటీవీ కెమెరాలను స్థాపించాలని నిర్ణయించింది. ఈ చర్య ప్రయాణికుల భద్రతను గణనీయంగా మెరుగుపరుస్తుందని రైల్వే శాఖ భావిస్తోంది. దోపిడీ దొంగలు, క్రిమినల్ గ్యాంగ్స్ అమాయక ప్రయాణికులను లక్ష ్యంగా చేసుకుని తరచుగా దోపిడీలకు పాల్పడుతున్న నేప థ్యంలో కెమేరాల ఏర్పాటు ఈ తరహా నేరాలను అదుపు చేస్తాయని భావిస్తోంది. ప్రయాణికుల గోప్యతను కాపాడేందుకు, సీసీటీవీ కెమెరాలను కోచ్‌లలోని సాధారణ కదలిక ప్రాంతాలైన ద్వారాల సమీపంలో ఏర్పాటు చేయనున్నట్టు రైల్వే శాఖ వెల్లడించింది. కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, ఆ శాఖ సహాయ మంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టు, లోకోమోటివ్‌లు, కోచ్‌లలో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు పురోగతిని సమీక్షించారు. ఈ సమావేశంలో రైల్వే బోర్డు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. 360డిగ్రీ కవరేజ్ నార్తర్న్ రైల్వే లోకో ఇంజన్లు, కోచ్‌లలో నిర్వహించిన ప్రయోగాలు విజయవంతమైనట్లు రైల్వే అధికారులు తెలిపారు. దీంతో కేంద్ర రైల్వేమంత్రి 74,000 కోచ్‌లు, 15,000 లోకోమోటివ్ (ఇంజన్) లలో సీసీటీవీ కెమెరాలను స్థాపించేందుకు ఆమోదం తెలిపారు. ప్రతి రైల్వే కోచ్‌లో 4 డోమ్ రకం సీసీటీవీ కెమెరాలు – ప్రతి ద్వారం వద్ద 2 కెమెరాలు , ప్రతి లోకోమోటివ్‌లో 6 కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. ఇందులో లోకోమోటివ్ ముందు, వెనుక రెండు వైపులా ఒక్కో కెమెరా, అలాగే ప్రతి క్యాబ్ ముందు వెనుక ఒక డోమ్ సిసిటీవీ కెమెరా, రెండు డెస్క్ మోంటెడ్ మైక్రోఫోన్‌లు ఉంటాయి.

# ఆగస్టు మొదటి వారంలో నీట్ స్టేట్ కౌన్సెలింగ్

## ఇప్పటికే 43,400 మంది స్టేట్ ర్యాంక్‌లను ప్రకటించిన తెలంగాణ హెల్త్ వర్సిటీ

**హైదరాబాద్, జులై 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో స్టేట్ నీట్ కౌన్సెలింగ్ ఆగస్టు మొదటి వారంలో ప్రారంభం కానుంది. ఈ నెల 21 నుంచి ఆలిండియా కోటా, డీమ్డ్ వర్సిటీలు, సెంట్రల్ యూనివర్సిటీలకు మొదటి విడత కౌన్సెలింగ్‌ను ప్రారంభించనున్నట్టు మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ(ఎంసిసి) ఇప్పటికే ప్రకటించిన నేపథ్యంలో.. ఆగస్టు మొదటి వారంలో స్టేట్ నీట్ కౌన్సెలింగ్ ప్రారంభించే అవకాశం ఉంది. అయితే రాష్ట్రాలకు చెందిన కౌన్సెలింగ్‌ను ఈ నెల 30 నుంచి ఆగస్టు 6 వరకు పూర్తి చేయాలని ఎంసిసి సూచించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని మెడిలక్ కాలేజీల్లో అడ్మిషన్ల కోసం కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను కాళోజీ నారాయణ రావు హెల్త్ యూనివర్సిటీ ఈ నెలాఖరులో ప్రకటించే అవకాశం ఉన్నట్టు తెలిసింది. ఎంబిబిఎస్, బిడిఎస్, బిఎస్‌సి నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశం కోసం నీట్ యూజీ-2025 కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ఎంసిసి ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నెల 21 నుంచి 30 వరకు ఆలిండియా కోటా, డీమ్డ్, సెంట్రల్ యూనివర్సిటీలు, రాష్ట్రం పరిధిలోని సీట్లలో చేరికకు సంబంధించిన మొదటి విడత కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ప్రకటించింది. మొత్తం మూడు రౌండ్లలో జరిగే నీట్ కౌన్సెలింగ్ ప్రక్రియ సెప్టెంబర్ 10వరకు కొనసాగనుంది. మొదటి విడత నీట్ స్టేట్ కౌన్సెలింగ్‌ను ఈ నెల 30 నుంచి ఆగస్టు 6 వరకు నిర్వ హిస్తారని ఎంపిసి ప్రకటించింది. మూడు రౌండ్ల నీట్ కౌన్సెలింగ్ సెప్టెంబర్ 18 వరకు కొనసాగనున్నట్టు ఎంసిపి షెడ్యూల్‌ను విడుదల చేసింది. సెప్టెంబర్ 1వ నుంచి ఎంబిబిఎస్ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభంకానున్నట్టు వెల్లడించింది. తెలంగాణ రాష్ట్రం నుంచి నీట్ యూజీ-2025 పరీక్షకి 70,258 మంది విద్యార్థులు హాజరు కాగా వారిలో 43,400 మంది అర్హత సాదించినట్లు ఇప్పటికే కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ ఈ నెల 10న ప్రకటించిన విషయం తెలిసిందే. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీలతోపాటు డీమ్డ్ యూనివర్సిటీ, కేంద్ర ప్రభుత్వ సంస్థలు కలిపి మొత్తం 64 మెడికల్ కాలేజీలున్నాయి. వాటిలో 34 రాష్ట్ర ప్రభుత్వ కాలేజీలు కాగా.. 28 ప్రైవేటు కాలేజీలు, మల్లారెడ్డి డీమ్డ్ యూనివర్సిటీ పేరిట 2 కాలేజీలు ఉండగా, ఈఎస్ఐ, బీబీనగర్ ఎయిమ్స్ కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి నవి ఉన్నాయి. ఈ కాలేజీలు అన్నింటిలో కలిపి 9,065 ఎంబిబిఎస్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. 34 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 4,080 సీట్లు ఉండగా.. వాటిలో 15 శాతం నేషనల్ పూల్ కోటా..అంటే 613 సీట్లు ఆలిండియా కోటా సీట్లుగా భర్తీ అవుతాయి. మిగిలిన 3,477 సీట్లు పూర్తిగా తెలంగాణ విద్యార్థులకే దక్కనున్నాయి. 26 ప్రైవేట్ కాలేజీల్లో 4,850 సీట్లు ఉన్నాయి. మల్లారెడ్డి యూనివర్సిటీకి చెందిన రెండు మెడికల్ కాలేజీలు అందులో ఒకటి మహిళా కాలేజ్‌గా కొనసాగుతోంది..రెండు కూడా డీమ్డ్‌యూనివర్సిటీ కేటగిరీలో కొనసాగుతున్నాయి. ఈ రెండుకళాశాలల్లో కలిపి 400సీట్లు ఉండగా, డీమ్డ్ యూనివర్సిటీ విభాగంలో కౌన్సెలింగ్ జరుగనుంది. ప్రైవేటు మెడికల్ కాలేజీల్లోని 4,850 సీట్లలో 50శాతం కన్వీనర్ కోటా తెలంగాణ విద్యార్థులకే దక్కుతాయి. మరో 50 శాతం సీట్లలో 35 శాతం సీట్లు బి కేటగిరి సీట్లు కాగా.. మరో 15 శాతం సీట్లు సి కేటగిరీలో ఎన్ఆర్ఐ కోటాలో భర్తీ చేస్తారు.

# పిలాని క్యాంపస్

>>చేర్చుకుంటుంద న్నారు. 2027 నాటికి ఇది పనిచేయడం ప్రారంభించే అవకాశం ఉందని బిర్లా చెప్పారు. 35 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ కొత్త క్యాంపస్, ఎఐ మెషిన్ లెర్నింగ్, ఇన్నోవేషన్ మరియు స్ట్రాటజీలో అండర్ గ్రాడ్యుయేట్, మాస్టర్స్ ప్రోగ్రామ్‌లను అందిస్తుంది. దీనితో పాటు, బిట్స్ పిలానీ మౌలిక సదుపాయాలను అప్‌గ్రేడ్ చేయడానికి, విశ్వవిద్యాలయం దీర్ఘకాలిక పరిశోధన, అభివృద్ధి సామర్థ్యాలను పెంచడానికి ..1,219 కోట్లు పెట్టుబడి పెట్టనుందని వైస్ ఛాన్సలర్ వి.రాంగోపాల్ రావు తెలిపారు.

### వారం - వర్జ్యం

14-07-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణ పక్షం
చవితి రా.11.58
ధనిష్ఠ ఉ.6.58
వర్జ్యం : మ.1.53-3.28
దు.మ.12.40-1.32, 2) మ.3.16-4.08
రాహుకాలం - ఉ.7.30-9.00

### వార్తాఫలం

**మేషం :** బంధువుల నుండి ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. ఉద్యోగాలకు స్వల్పధనలాభం పొందుతారు.

**వృషభం :** సంగీత, సాహిత్యాలపై ఆసక్తి చూపుతారు. మంచికి వెళితే చెడు ఎదురయ్యే అవకాశాలున్నాయి.

**మిథునం:** సంతానం నాకు నూతన విద్యా, ఉద్యోగావకాశాలు పొందుతారు.కుటుంబ సభ్యుల నుండి సహాయ సహకారాలు అందు కొంటారు.

**కర్కాటకం:** అనవసర వివాదాలు పోతాయి. శత్రువులు సమస్యలు సృష్టించినా అధిగమిస్తారు.

**సింహం:** ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. రుణబాధలు ఎక్కువై చికాకుపెడతాయి.

**కన్య :** దూరపు బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

**తుల :** మాటకు విలువ పెరుగుతుంది. కొత్త విద్యలపట్ల ఆసక్తి చూపుతారు.

**వృశ్చికం:** కుటుంబసభ్యులను కలిసి ఆనందంగా గడుపుతారు. దీర్ఘకాలిక సమస్యల నుండి బయటపడతారు.

**ధనుస్సు:** అనుకోని ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి. దీర్ఘకాలిక సమస్యల నుండి బయటపడతారు.

**మకరం:** ఆరోగ్య సమస్యలు ఎదురైన ఆత్మస్థైర్యంతో అధిగమిస్తారు. వాహనాలు, స్థలాలు కొనుగోలు యత్నాలు నిదానంగా సాగుతాయి.

**కుంభం:** శత్రువులు సైతం మిత్రులుగా మారుతారు. ఆస్తి వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. వాహనసౌఖ్యం.

**మీనం :** కొన్ని అపవాదులు భరించాల్సి వుంటుంది. ముఖ్యమైన పనులలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఎపి ప్రభుత్వం న్యాబ్సిడ్‌తో ఎంఒయు

**అమరావతి, జులై 13, ప్రభాతవార్త :** ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమక్షంలో ఏపి రాష్ట్ర రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఎపిసిఆర్డీఎ) ట్రాన్సాక్షన్ అడ్వైజరీ సర్వీసుల (టిఎఎస్) కోసం నేషనల్ బ్యాంక్ ఫర్ ఫైనాన్సింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్‌మెంట్ (న్యాబ్సిడ్)తో ఒక అవగాహన ఒప్పందంపై సంతకం చేసింది. స్ట్రాటజిక్ అడ్వైజర్‌గా పనిచేసే ఈ బ్యాంకు అమరావతి నగరాభివృద్ధి కోసం కీలకమైన విత్తన ప్రణాళిక రూపకల్పనలో ఏపిసిఆర్‌డికి మార్గనిర్దేశనం చేస్తుంది. విభిన్న మోడల్స్‌లో (ప్రైవేట్ పబ్లిక్ పార్టనర్‌షిప్పులు, పిపిపి సహా) అమలు చేయదగ్గ విధానాలను అంచనా వేసి పలు మౌలిక సదుపాయాల ప్రాజక్టులకు విత్తీయ వ్యూహాలను రూపొందించేందుకు సహాయం చేయనుంది.

# కాకాణికి ముగిసిన పోలీస్ కస్టడీ

**నెల్లూరు క్రైమ్, జూలై 13, ప్రభాతవార్త :** వరుస పోలీస్ కేసులు, కస్టడీలతో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఎన్నికల సమయంలో ముత్తుకూరు మండలం పంటపాలెం సమీపంలో మద్యం డంపును పట్టుకున్న కేసులో ముద్దాయిగా ఉన్న కాకాణిని రెండు రోజుల పోలీస్ కస్టడీకి న్యాయస్థానం అనుమతించింది. దీంతో శని ఆదివారాలలో ఎక్సైజ్ పోలీసులు కాకాణిని జిల్లా కేంద్ర కారాగారం నుండి కస్టడీలోకి తీసుకుని విచారించారు. ఆదివారం పోలీస్ శిక్షణా కేంద్రంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస నాయుడు కాకాణిని విచారించారు. అన్ని ప్రశ్నలకు తనకేమీ సంబంధం లేదంటూ మాజీ మంత్రి సమాధానం దాటవేసినట్లు తెలిసింది. పోలీసులు ఆధారాలు చూపించి ప్రశ్నించినప్పటికీ కాకాణి దానికి ఏమీ సంబంధం లేదని చెప్పారు.

# ఎపికి 10 అవార్డులు

>> న్నట్లు ఆయన అన్నారు.రాష్ట్రంలోని ప్రతి జిల్లాను ఒడిఒపి క్రింద గుర్తింపు పొందేలా సిఎం చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే కడప అరటి, చిత్తూరు టమాటా, అనంతపురం వేరుశెనగ వంటి ఉత్పత్తుల ఎంపిక కోసం కేంద్రం దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు. జిల్లా ఉత్పత్తులకు గుర్తింపు లభిస్తే స్థానిక పరిశ్రమలు అభివృద్ధి చెంది రైతులు, కార్మికులకు మద్దతు లభిస్తుందని చెప్పారు. ఈ అవార్డుల వలన చేనేత, హస్తకళా ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశాలు విస్తరించనున్నాయని సిసోడియా తెలిపారు. కళాకారులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు కూడా నిర్వహించే అవకాశం ఉంటుందని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహమే ఈ విజయాల వెనుక ఉందన్నారు.

ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని చేనేతలకు ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రారంభించబోతున్నట్లు ఆయన వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి సవిత మార్గనిర్దేశకత్వంలో హ్యాండ్‌లూమ్ మగ్గాలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్ మగ్గాలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇవ్వనున్నామని తెలిపారు. అదే రోజు త్రిఫ్ట్ ఫండ్ నిధులు కూడా విడుదల చేయనున్నట్లు చెప్పారు. ఇది ఎన్నికల సమయంలో సిఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఇచ్చిన హామీని సగౌరవంగా నెరవేర్చడమే అవుతుందన్నారు. చేనేత ఉత్పత్తుల విక్రయాలను మెరుగుపరచేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 97 ఆప్కో షోరూమ్‌ల సంఖ్యను పెంచే దిశగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా కూడా వస్త్రాల అమ్మకాలను చేపట్టామని, ఈ కార్యక్రమాల వల్ల నేతన్నలకు ఆర్థిక భద్రత లభించి, రాష్ట్రంలో చేనేత రంగం మరింత బలపడుతుందని సిసోడియా ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఎపి అభివృద్ధిని ఆపలేరు

>> తెలిపారు. అనకాపల్లిలో ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ దిగ్గజ కంపెనీలు లక్ష కోట్లతో, ఎరైన్‌కో రామాయపట్నంలో పెట్టుబడులు పెడుతున్నాయని అన్నారు. రాయలసీమను డిఫెన్స్, ఎలక్ట్రానిక్, ఆటోమొబైల్స్, డ్రోన్, శాటిలైట్ లాంఛింగ్, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో అభివృద్ధి చేస్తామని చంద్రబాబు పేర్కొన్నారు. విధ్వంస పాలన ముగిసి 2024 ఎన్నికల్లో కూటమి అధికారంలోకి వచ్చింది. ప్రజలు ఏకపక్షంగా ఇచ్చిన తీర్పుతో అమరావతి మళ్లీ ఊపిరి పోసుకుంది. ప్రజల ఆశీస్సులతో నాలుగోసారి సీఎం అయ్యాను. కానీ ఆర్థికపరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. వెంటిలేటర్‌పై ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను ఎలా బయటకు తీసుకురావాలన్న ఆలోచనలో ఉన్నప్పుడు కేంద్రం, వ్యక్తిగతంగా మోదీ ముందుకొచ్చి ఆపన్నహస్తం అందించారు. కేంద్రం సహకారంతో 10 నెలల్లో అమరావతిని గాడినపెట్టాం. ప్రపంచస్థాయి సంస్థల ఏర్పాటుతో అమరావతి హెల్త్, ఎడ్యుకేషన్ హబ్‌గా ఉండబోతోంది. రాజధానిలో 30 శాతం పచ్చదనం ఉండేలా ప్రణాళికలు రూపొందించాం. నవ నగరాలు.. భూగర్భంలోనే విద్యుత్ ఇతరత్రా పైపులు వెళ్లేలా డిజైన్ చేశాం. ఔటర్ రింగ్ రోడ్డు, ఇన్నర్ రింగ్ రోడ్డు.. గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేస్తున్నాం. అన్ని ప్రధాన నగరాలను అమరావతికి అనుసంధానం చేస్తాం. 5లక్షల మంది విద్యార్థులు అమరావతిలో చదువుకునేలా ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రధాని మోదీ ఇదే కోరారు. రాజధానిలో మంచి విద్యాసంస్థలను ఏర్పాటు చేసి భావి తరాలను తీర్చిదిద్దండని సూచన చేశారు. దాన్ని ఆచరణలో పెడుతున్నాం. ఇప్పటికే చాలా విద్యాసంస్థలు వచ్చాయి. త్వరలో బిట్స్ పిలానీ, ఎక్స్ఎల్ఆర్ఐ బిజినెస్ స్కూల్, గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్, రతన్‌టాటా ఇన్నొవేషన్ హబ్ ఏర్పాటు చేస్తున్నాం. జపాన్ మియావాకీని ఆదర్శంగా తీసుకుని రాజధానిని పచ్చదనంతో ఆహ్లాదంగా తీర్చిదిద్దుతాం.

**రాష్ట్రమంతా సస్యశ్యామలం కావాలనే లక్ష్యంతో పోలవరం బనకచర్ల అనుసంధాన ప్రాజెక్ట్ నిర్మాణం**

రాయలసీమతో సహా రాష్ట్రమంతా సస్యశ్యామలం కావాలంటే పోలవరం బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టును అనుకున్న లక్ష్యాలకు పూర్తి చేసుకోవాలని సిఎం చంద్రబాబు స్పష్టం చేసారు. ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం సైతం సానుకూలరీలో ఉందని సిఎం చంద్రబాబు అన్నారు. ఈ ప్రాజెక్ట కోసం జలహారతి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. పోలవరం కుడి ప్రధాన కాలువకు సమాంతరంగా మరో కాలువ తవ్వి నీరు పంపగలిగితే రాయలసీమకు ఉపయుక్తంగా ఉంటుందని చంద్రబాబు వెల్లడించారు. అది పోలవరంబనకచర్ల అనుసంధానంతోనే సాధ్యమవుతుందని తెలిపారు. ఈ ప్రాజెక్టును పూర్తిచేస్తే ఎపిలోని అత్యధిక ప్రాంతాలకు సమృద్ధిగా నీళ్లు అందుతాయని చెప్పారు. పోలవరం ప్రాజెక్టును అనుకున్న లక్ష్యానికి అనుగుణంగా పూర్తి చేస్తామన్నారు.ఈ ఏడాది డిసెంబర్ చివరినాటికి డయాఫ్రమ్ వాల్ పూర్తి చేస్తామన్నారు. 9 నెలల కాలంలోనే ప్రాజెక్టు మొత్తం మీద 6.11 శాతం పనులు జరిగాయి. జగన్ హయాం ఐదేళ్లలో మాత్రం 11.58 శాతం పనులు మాత్రమే చేశారు. కూటమి ప్రభుత్వంలో 9 నెలల్లోనే అందులో సగం పనులు పూర్తి చేసింది. ప్రధాన డ్యాంలో 3.80 శాతం భూసేకరణ, పునరావాసానికి సంబంధించి 2.56 శాతం మేర పురోగతి కనిపిస్తోంది. గతంలో చంద్రబాబు రూ.430 కోట్లతో డయాఫ్రమ్ వాల్ నిర్మిస్తే జగన్ విధ్వంసం చేశాడు. రూ.990 కోట్లతో కొత్త డయాఫ్రమ్ వాల్ పనులు మొదలుపెట్టాం. వర్షాకాలంలో సైతం పనులు జరిగేలా, ఎగువ కాపర్ డ్యామ్‌ను బలోపేతం చేయడానికి బట్రస్ డ్యామ్ మే నెలకల్లా పూర్తి చేస్తాం. డయాఫ్రమ్ వాల్ పూర్తయ్యే వరకు వేచి చూడకుండా సమాంతరంగా గ్యాప్1 వద్ద ఇసిఆర్ఎఫ్ డ్యామ్ నిర్మాణాన్ని ఏప్రిల్‌లో మొదలుపెట్టారు. ఇక పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్టును చేపట్టేందుకు జలహారతి కార్పొరేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కంపెనీల చట్టం కింద వంద శాతం ప్రత్యేక వాహక సంస్థగా జలహారతి కార్పొరేషన్ ఏర్పాటు కానుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఛైర్మన్‌గా జల హారతి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తూ ఆదేశాలు జారీచేశారు. వైస్ ఛైర్మన్‌గా మంత్రి నిమ్మల రామానాయుడు, సంస్థ సిఇఒగా జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఇతర అధికారులు ఉండనున్నారు. ఈ ప్రాజెక్టుకు రూ.80,112 కోట్ల వరకువెల్లడించారు. రూ.81,500 కోట్ల వ్యయమయ్యే ఈ ప్రాజెక్టుతో ఏపీ భవిష్యత్తే మారిపోతుందని చెప్పారు. మంత్రివర్గ సమావేశంలో దీనిపై సుదీర్ఘంగా చర్చించారు. వ్యయం అవుతుందని ప్రభుత్వం అంచనా వేస్తుంది.

**రాయలసీమకు నీరందించేలా చర్యలు:**

గోదావరి బేసిన్‌లో వృథాగా పోతున్న వరద జలాలను లోటు ఉన్న ప్రాంతాలకు తరలించేలా లింకు ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు.

# విజిలెన్స్ నివేదికలు!

>> గుప్పుమంది. వేదవిశ్వవిద్యాలయం ఉపకులపతిగా నియామకానికి వేదాధ్యయనం, ఆచార్యులుగా దశాబ్దకాలం అనుభవం ఉండాలి. అలాంటిది ఇవేమీ లేకుండానే ప్రస్తుతం ఆ పోస్టులో కొనసాగుతున్న ఆచార్యులు తనదైన రీతిలో ఇష్టానుసారంగా నియామకాలు చేపట్టారనేది వర్సిటీలో చర్చనీయాంశంగా మారింది. అంతా గత వైసిపి మయంగా మార్చేశారనేది ప్రధాన ఆరోపణ, దీనిపై ఇటీవల విచారణ చేపట్టిన విజిలెన్స్ విభాగం కూడా అందుకు సంబంధించి నివేదికలు రూపొందించింది. వైదిక విద్యల విషయంలో ఎన్ఇపి -2020 అమలుచేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని నివేదిక. దీని ఫలితంగా వేదవిద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. గత ఏడాది ఎన్నికల సమయంలో అప్పటి వైసిపి మద్దతుదారులతో వేదవిశ్వవిద్యాలయం అకడమిక్ కౌన్సిల్‌ను నియమించి వారంతా వైసిపికి మద్దతుపలికేలా విశ్వ విద్యాలయంలో ఓ ఉన్నతాధికారి మార్గం సుగమం చేశారనేది నిఘా విభాగం నిగ్గుతేల్చింది. అధ్యాపకుల పదోన్నతుల్లోనూ రాజకీయజోక్యం సిఫార్సులతో చేపట్టారనేది ప్రధాన ఆరోపణ. కొందరు వేదపండితులకు వ్యక్తిగత గురుకులాలలకు టిటిడి నిధులను కేటాయించిన అంశాన్ని కూడా విజిలెన్స్ గుర్తించింది. శనివారం రోజు జరిగిన వేదవిశ్వవిద్యాలయం వ్యవస్థాపక దినోత్సవానికి వర్సిటీ ఉన్నతాధికారి గైర్హాజరవ దంతో ఇప్పుడు ఈ ఆరోపణలకు బలంచేకూర్చేలా మారింది.

# అన్నమయ్య ప్రాజెక్టును పరిశీలించిన నిపుణుల బృందం

## ప్రభుత్వ అనుమతితో త్వరలో పునర్నిర్మాణం

**రాజంపేట, జూలై 13, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉమ్మడి కడప జిల్లాలోని అన్నమయ్య ప్రాజెక్టును నిపుణుల బృందం ఆదివారం పరిశీలించింది. గత రెండు రోజులుగా అన్నమయ్య ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర వివరాలను నిపుణుల కమిటీ పరిశీలించింది. ఒక్క రోజంతా ప్రాజెక్టుకు సంబంధించిన డిజైన్‌లు, సాంకేతిక వివరాలు, భూ గర్భంలో నేల స్వభావం, ప్రాజెక్టు గేట్ డిజైన్‌లు ఇప్పటివరకు అన్నమయ్య ప్రాజెక్టుకు వచ్చిన వరద నీటి పరిస్థితి ఈ సంధర్భంగా చోటు చేసుకున్న పరిణామాలను ప్రాజెక్టు అధికారులను అడిగి తీసుకోవడమే కాకుండా దానికి సంబంధించిన పత్రాలను, వివరాలను పరిశీలించింది. ప్రభుత్వం నియమించిన డిజైన్ ఎక్స్‌పర్ట్, పోలవరం చీఫ్ ఇంజనీర్ రమేష్‌కుమార్, హైడ్రో మెకానికల్ ఎక్స్‌పర్ట్ కె.సత్యనారాయణ జీయాలజిస్ట్ ఎం.రాజు, సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్(సీడీఓ) చీఫ్ ఇంజనీర్ విజయభాస్కర్, కడప జిల్లా జల వనరుల శాఖ చీఫ్ ఇంజనీర్ శ్రీరామ చంద్రమూర్తి ఆదివారం అన్నమయ్య ప్రాజెక్టును పరిశీలించడం జరిగింది. ఎర్త్ డ్యాం కొట్టుకుపోయిన ప్రాంతాన్ని వారు పరిశీలించారు. అనంతరం స్పిల్‌వే ని పరిశీలించారు. స్పిల్ వే ప్రక్కన ప్రారంభమైన మట్టికట్ట ప్రాంతాన్ని పరిశీలించారు. అలాగే ప్రాజెక్టు కుడివైపున కొండ ప్రాంతాన్ని పరిశీలించారు. ఎర్త్ డ్యాం కొట్టుకుపోయిన నదీ మధ్యలో ప్రాంతాన్ని పరిశీలించారు. అంతే కాకుండా రాక్ ఫిల్ డ్యాం నిర్మాణానికి సంబంధించిన ప్రక్రియను చేపడితే ఎలా ఉంటుందో పరిశీలించారు. అనంతరం చీఫ్ ఇంజనీర్ శ్రీరామ చంద్రమూర్తి మీడియాతో మాట్లాడుతూ నిపుణుల కమిటీ ప్రాజెక్టును క్షుణ్ణంగా పరిశీలించిందన్నారు. ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని తీసుకుందన్నారు. జియోలాజికల్ హైడ్రాలిక్ రాక్‌సాయల్‌తో పాటు వివిధ అంశాలను చర్చించడం జరిగిందన్నారు. నిపుణుల కమిటీ నివేదిక సిద్ధం చేసిన తర్వాత ప్రభుత్వానికి పంపుతుందన్నారు. ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిన వెంటనే ప్రాజెక్టు పునర్నిర్మాణ పనులను ప్రారంభిస్తామని ఆయన పేర్కొన్నారు. అంతకుముందు నిపుణుల బృందాన్ని అన్నమయ్య జిల్లా టీడీపీ జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్ రాజు కలిశారు. ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రభుత్వం నియమించిన నిపుణుల కమిటీ వెంటనే ప్రాజెక్టును పరిశీలించడం సంతోషంగా ఉందన్నారు. సీఎం ఆదేశాల మేరకు అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణ పనులు ప్రారంభించేందుకు యుద్ధ ప్రాతిపదికన పనులు జరుగుతున్నాయనిఅన్నారు. అందులో భాగంగానే నిపణుల బృందం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖ ఎస్‌ఈ అబ్దు సమీ, ఈఈలు జయచంద్రా రెడ్డి, రవికిరణ్, ఏఈలు గురుమోహన్ తదితరులు పాల్గొన్నారు.


ఆదివారం అన్నమయ్య ప్రాజెక్టు స్పిల్‌వే ను పరిశీలిస్తున్న నిపుణుల బృందం, మీడియాతో మాట్లాడుతున్న చీఫ్ ఇంజనీర్ శ్రీరామ చంద్రమూర్తి

## చంద్రబాబు ఆధ్వర్యంలో పోలీసు రాజ్యం: సజ్జల

**విజయవాడ జులై 13 ప్రభాతవార్త ప్రతినిధి:** చంద్రబాబు ఆధ్వర్యంలో పోలీసు రాజ్యం నడుస్తోందని వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి ఆరోపించారు. జగన్ మోహన్ రెడ్డి ఇప్పటి వరకూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయలేదు. జగన్ పర్యటనకు వచ్చినప్పుడల్లా వందల్లో కేసులు నమోదు చేస్తున్నారు. మామిడి యార్డు మూసివేశారు. చంద్రబాబు ఆధ్వర్యంలో పోలీసు రాజ్యం నడుస్తుందని ఆరోపించారు. ఎన్నికల్లో తీర్పు ఇవ్వాల్సింది ప్రజలే అందుకే ప్రజలకు చెబుతున్నాం చంద్రబాబు దుర్మార్గంగా అణచి వేసే ప్రయత్నం చేస్తున్నారు. మానసికంగా వేదిస్తున్నారు. ప్రభుత్వం సమస్యలు పరిష్కరిస్తే జగన్ ఎందుకు బయటకొస్తారని సజ్జల ప్రశ్నించారు. తమపార్టీకి చెందిన సర్పంచ్ నాగమల్లేశ్వరావుపై దాడి చేసారన్నారు. ఆయన కోలుకుంటారని ఆశిస్తున్నాను అని తెలిపారు. ఇది రాజకీయపరమైన హత్యాయత్నం సీసీ కెమెరా విజువల్స్ భయానకరంగా ఉన్నాయి. అంబటి మురళిపైనే కేసు నమోదు చేశారు. రెచ్చగొట్టిన ధూళిపాళ్లపై కేసు పెట్టలేదు అని మండిపడ్డారు.

# తిరుమలేశుని బ్రహ్మోత్సవ ఏర్పాట్లు షురూ

**తిరుమల,జూలై 13ప్రభాతవార్తప్రతినిధి:** ఏడు కొండల శ్రీవేంకటేశ్వరస్వామికి సెప్టెంబర్ 23 నుండి మొదలుకానున్న సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలకు తిరుమలలో ఏర్పాట్లు మొదలయ్యాయి. తొమ్మిదిరోజులుపాటు జరిగే దేవుని ఉత్సవాలకు దేశవిదేశాల ఉండి అశేషంగా భక్తులు తరలివస్తారనే ముందుచూపుతో అన్ని విధాలా అవసరమైన ఏర్పాట్లు, సౌకర్యాలు, గ్యాలరీలు నిర్మాణం, మాఢవీధుల్లో ఎండకు. వానకు రక్షణగా చలువపందిళ్ళు, జర్మన్‌షెడ్లు వేసేందుకు ఇంజనీరింగ్ పనులు ఆదివారం మొదలయ్యాయి. తొలుత ఉత్తరమాఢవీధినుండి ఈ పనులు శ్రీకారంచుట్టారు. ఈ ఏడాది సాలకట్ల బ్రహ్మోత్సవాలుమాత్రమే జరగను న్నాయి. ఈ వాహనసేవలను భక్తుల మధ్య జరిపించేందుకు తిరుమలతిరుపతి దేవస్థానం సిద్ధమవుతోంది. ఆలయం పరిసరాలు ,మాఢవీ ధుల్లో గ్యాలరీలు, ఇనుప పైపులతో నింపేస్తు న్నారు. ఈ పనులు మెల్లగా నెలన్నరరోజులు పటిష్టంగా సాగనున్నాయి.బ్రహ్మోత్సవాలకు ముందే ఆణివార ఆస్థానంకూడా వస్తుండటంతో తిరుమల భద్రత పరంగా సిద్ధమైంది. తిరుమలకొండపై ప్రతిరోజూ ఉత్సవాలు, సేవలే.బ్రహ్మోత్సవాలకు కొండను సర్వాం గసుందరంగా ముస్తాబుచేసే పనులు ఆరంభమ య్యాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సెప్టెంబర్ 24నుండి తొమ్మిదిరోజులు ఆలయమాఢ వీధుల్లో వివిధ రకాల వాహనసేవల్లో స్వామివారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. మాఢవీధుల్లో గ్యాలరీలు ఏర్పాటుచేసే పనులు ఇంజనీరింగ్ చేపడుతోంది.



ఫ్లోర్‌పెయిటింగ్‌లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టరు లక్ష్మీశ, పెయింటింగ్ వేస్తున్న కలెక్టర్

# కృష్ణమ్మ తీరాన కుంచెతో కోటి భావాలు

## ఉత్సాహంగా ఫ్లోర్ పెయింటింగ్, డ్రాయింగ్ పోటీలు: స్వయంగా పాల్గొన్న కలెక్టర్

**విజయవాడ,జూలై13,ప్రభాతవార్తప్రతినిధి:** సామాజిక అంశాలపై ఆయా రంగాల్లో ప్రతిభావంతులైన కళాకారులకు అవగాహన ఉండాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ వ్యాఖ్యానించారు. యువత సైతం కళరంగంలో రాణించాలన్నారు. ప్రతి మనిషిలో సృజనాత్మకత ఉంటుందన్నారు. అది బయటకు రావాలంటే ఆయా అంశాలపై పోటీలు నిర్వహించాలన్నారు. జిల్లా అధికార యంత్రాంగం, విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం హరిత బెరం పార్కు కృష్ణా తీరంలో జరిగిన ఫ్లోర్ పెయింటింగ్, డ్రాయింగ్ పోటీల్లో 300 మందికి పైగా యువత, చిన్నారులు పాల్గొని తమ కళా ప్రతిభను ప్రదర్శించారు. స్వర్ణాంధ్ర విజన్ 2047, పీ4 (ప్రభుత్వ, ప్రైవేటు, ప్రజా భాగస్వామ్యం) విధానం, సే నో టు సింగిల్ యూజ్ ప్లాస్టిక్, స్వచ్ఛాంధ్ర, సేవ్ వాటర్, రెడ్యూస్‌రీయూజ్‌రీసైకిల్, హరితాంధ్ర అంశాల్లో వేసిన వర్ణ చిత్రాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కొత్త శోభను సంతరించుకున్న కృష్ణా తీరం స్ఫూర్తి వైబ్రెంట్ విజయవాడకు తొలి అడుగు అని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పేర్కొన్నారు. కేంద్రం ప్రకటించిన స్వచ్ఛ సర్వేక్షణ్2024 పురస్కారాల్లో విజయవాడ నగరం సూపర్ స్వచ్ఛతా లీగ్ అవార్డును గెలుచుకున్నందుకు నగర ప్రజలకు, నగరపాలక సంస్థ అధికారులు సిబ్బందికి అభినందనలు తెలియజేస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్‌ఎం మాట్లాడుతూ చిన్నారులు, యువత పర్యావరణం, జల వనరులు, కాలుష్య దుష్పరిణామాలు తదితర అంశాలపై అవగాహన పెంచుకునేందుకు ఇలాంటి పోటీలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. పెయింటింగ్, డ్రాయింగ్ పోటీల విజేతలకు కలెక్టర్ లక్ష్మీశ కమిషనర్ ధ్యానచంద్ర బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు. ఫ్లోర్ పెయింటింగ్ విభాగంలో స్వర్ణాంధ్ర విజన్ సేవ్ వాటర్ పెయింటింగ్‌తో జి.తనూజ మొదటిస్థానంలో నిలిచి రూ. 10వేల నగదు బహుమతితో పాటు జ్ఞాపిక, ప్రశం సాపత్రాన్ని అందుకుంది. ద్వితీయ బహుమతి (రూ.7,500)ని పి.యామినీ విశాల, తృతీయ బహుమతి (రూ. 5,000)ను వి.జశ్వంతి, నాలుగో బహుమతి (రూ. 3,000)ని ఎం.సురేష్ పొందారు. ఫ్లోర్ పెయింటింగ్‌లో ఎల్.శ్వేత, పి.రచన, వి.అనురాధ, కె.హవీలా జెన్నీ, బి.రోహితలు ప్రోత్సాహక బహుమతులు అందుకున్నారు. డ్రాయింగ్ పోటీల్లో ఎంఎస్ వైష్ణవ్య తొలి బహుమతి అందుకోగా రెండు, మూడు, నాలుగో స్థానాల్లో రాహిల్ జయాన్, జి.భావ్యశ్రీ , లక్ష్మీ జైన్ నిలిచారు. టి.క్రిష్, జి.ఇషికా కృష్ణన్, జి.ఆధ్వి, సాక్షం సుతార్, రామిరెడ్డి జశ్వితలు ప్రోత్సాహక బహుతులు అందుకున్నారు. పోటీలకు కళానిపుణులు పి.చిదంబరేశ్వరరావు, కళాసాగర్, పి.రమేష్, సంతోష్ కుమార్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ డా. డి.చంద్రశేఖర్, ఏపీటీడీసీ డివిజనల్ మేనేజర్ పి.కృష్ణచైతన్య, అమరావతి బోటింగ్ క్లబ్ సీఈవో తరుణ్ కాకాని, జిల్లా టూరిజం అధికారి ఎ.శిల్ప, ఆయుష్ అధికారి డా. రత్నప్రియదర్శిని తదితంలు పాల్గొన్నారు.



## కుట్రలు,కుతంత్రాలు తప్ప జగన్‌కు మరో పనిలేదు: మంత్రి కొల్లు రవీంద్ర

**విజయవాడ,జూలై13,ప్రభాతవార్తప్రతినిధి:** నిత్యం కుట్రలు కుతంత్రాలు తప్ప జగన్,ఆయన అనుచరులకు మరో పనిలేదని ఏపీ మంత్రి కొల్లు రవీంద్ర వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో శాంతి భద్రత విఘాతం కలిగించేదిశలో వారి ఆలోచనలు సాగుతున్నాయన్నారు. రాష్ట్రంలో విధ్వంసం సృష్టించాలనే దుర్మార్గపు ఆలోచనలు వైసీపీ పార్టీవన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, మాజీ మంత్రి పేర్నినానిపై మంత్రి కొల్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ మహిళను అడ్డం పెట్టుకుని ఆ ప్రాంతంలో కుట్రకు పేర్నినాని పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఆదివారం అమరావతిలోని టీడీపీ కార్యాలయంలో మంత్రి కొల్లు రవీంద్ర మీడియాతో మాట్లాడారు. కృష్ణా జిల్లా జెడ్పీ చైర్ పర్సన్ ఉప్పల హారిక కారును వదిలేశామని తెలిపారు. తర్వాత ఆమె కావాలని వెనక్కి వచ్చి పోలీసులపై, తెలుగుదేశం నాయకుల గురించి అభ్యంతరకరంగా మాట్లాడారని స్థానికులే చెబుతున్నారని అన్నారు. జగన్, పేర్ని నాని లాంటి నెత్తుటి రాజకీయాలు చేసే వ్యక్తులకు రాజకీయాల్లో ఉండే అర్హత లేదని మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు.

## సమస్యల సాధనకు ఐక్యంగా పోరాడాలి

### సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు

**విజయవాడ,జూలై13,ప్రభాతవార్తప్రతినిధి:** లోకో రన్నింగ్ స్టాఫ్ సమస్యల సాధనకు ఐక్యంగా పోరాడాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు పిలుపునిచ్చారు. ఆల్ ఇండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ (ఎఐఎల్ఆర్ఎస్ఎ) సికింద్రాబాద్ డివిజన్ విజయవాడ బ్రాంచ్ 6వ ద్వైవార్షిక మహాసభ విజయవాడలో జరిగింది. విజయవాడ బ్రాంచ్ అధ్యక్షులుగా అధ్యక్షులుగా కె రమేష్, కార్యదర్శిగా కె రాజేష్‌కుమార్‌తోపాటు మరో 40 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ మహాసభలో నర్సింగరావు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం రైల్వేలతో సహా అన్ని ప్రభుత్వరంగసంస్థలను ప్రైవేటీకరిస్తూ కార్పొరేట్ సంస్థలకు అధిక లాభాలు గడించడానికి తోడ్పడుతోందన్నారు. ప్రస్తుతం రైల్వేలో ఖాళీగా ఉన్న 3 లక్షల పోస్టులు భర్తీ చేయకుండా, ఉన్నవారిపై పని భారం, ముఖ్యంగా లోకో రన్నింగ్‌లో ఉన్న ఖాళీ పోస్టులు భర్తీ చేయడం లేదన్నారు. ఎఐఎల్ఆర్ఎస్ఎ మాజీ ప్రధాన కార్యదర్శి ఎస్ గురుమూర్తి, సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు వివిఎల్ నరసింహులు, జివిలూ, ఎల్ఆర్ఎస్ఎ నాయకులు కె. రామకృష్ణ, ఎం వెంకటేషన్, సుధీర్ మాట్లాడారు.

# ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ పాలసీ మార్గదర్శకాలు

**విజయవాడ,జూలై13,ప్రభాతవార్తప్రతినిధి:** 4.2 లక్షల కోట్ల ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి ఉద్దేశంగా ఏపీలో ఎలక్ట్రానిక్స్ మాన్యుఫాక్చరింగ్ పాలసీ రూపకల్పన చేశారు.ఇప్పటికే అమలులోకి వచ్చిన ఈ పాలసీకి సంబంధించి ఏపీ ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ పాలసీ 4.0,2024-29 మార్గదర్శకాలను రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకుని వచ్చింది. ఈ రంగంలో 10 బిలియన్ యూఎస్ డాలర్ల విలువైన పెట్టుబడులు ఆకర్షించాలని నిర్ణయించారు.అన్ని కేటగిరీల ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్లకు వందశాతం స్టాంపు డ్యూటీ మినహాయింపు ఇచ్చారు. కల్పించిన ఉద్యోగాల ఆధారంగా ఒక్కో ఉద్యోగికి నెలకు 4 వేల నుంచి 6 వేల వరకూ ఐదేళ్ల పాటు ప్రోత్సాహకం ఇవ్వనున్నారు. అన్ని కేటగిరీల్లోని ఎలక్ట్రానిక్ పరిశ్రమలకు ఐదేళ్ల పాటు యూనిట్ విద్యుత్‌ను రూ.1కే సరఫరా చేయాలని నిర్ణయించారు. కేంద్ర ఐటీ, ఎలక్ట్రా నిక్స్ మంత్రిత్వ శాఖ మంజూరు చేసిన ఎలక్ట్రానిక్స్ తయారీ క్లస్టర్‌ను కడప జిల్లా కొప్పర్తిలో ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. వైఎస్ఆర్ ఈఎంసీగా దీన్ని ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం 380.5కోట్ల రూపాయలను బుధవా రం మంజూరుచేసింది. ఈ క్లస్టర్ ఏర్పాటు కోసం కేంద్ర ఐటీశాఖ ఇప్పటికే అనుమతులు మం జూరు చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సం యుక్తంగా ఈ క్లస్టర్‌ను ఏర్పాటు చేయను న్నాయి. అలాగే కొప్పర్తిలోని ఎలక్ట్రానిక్స్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్‌కు పెట్టుబడులు ఆహ్వానించేలా ప్రత్యేక ప్రోత్సాహకాలు ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. గ్రీన్ కేటగిరీలోని ఎలక్ట్రానిక్ పరిశ్రమలకు తనిఖీలు ఉండవని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఆరెంజ్, రెడ్ కేటగిరీకి ఇది వర్తించదని పరిశ్రమల శాఖ వెల్లడించింది. భూమి లీజును 33 ఏళ్ల నుంచి 99 ఏళ్లకు పొడిగించుకునే అవకాశం కల్పించటంతో పాటు అవసరమైతే భూమిని కొనుగోలు చేసేందుకూ వీలుందని ఉత్తర్వుల్లో పేర్కొంది. మరో వైపు వందశాతం స్టాంపు డ్యూటీ రీయింబర్స్‌మెంట్ కల్పించాలని నిర్ణయించినట్టు ప్రభుత్వం తెలిపింది. 20 శాతం మేర పెట్టుబడి రాయితీ కూడా ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్ లో ఉంటుందని స్పష్టం చేసింది. 250 కోట్లకు మించి పెట్టుబడులు పెట్టే మొబైల్ ఉత్పత్తి పరిశ్రమలకు మెగా స్టేటస్ ఇస్తామని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఏపీ ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ పాలసీ పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలువిశాఖ, తిరుపతి , నెల్లూరు, కడప, అనంతపురంలలో ఎలక్ట్రానిక్ మాన్యు ఫ్యాక్చరింగ్ క్లస్టర్స్ ఉత్పత్తికి అనువుగా ఉన్నట్టు అధికారులు స్పష్టం చేశారు. నైపుణ్యమున్న మానవ వనరులు, అనుకూలమైన ప్రభుత్వ విధానాలు ఈ రంగంలో పెట్టుబడులకు అనుకూలమని వెల్లడించారు. ఏపీలోని లాజిస్టిక్స్ నెట్‌వర్క్‌తో పాటు విశాఖ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో ఎలక్ట్రానిక్స్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు అనువుగా ఉన్నట్టు తెలిపారు.


ఈ రంగంలో వచ్చే పెట్టుబడులు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలను ఆకర్షించ నున్నట్టు ప్రభుత్వం తెలిపింది. కేటగిరీల వారీగా ఈ రంగంలో పెట్టుబడుల ఆధారంగా ప్రోత్సాహకాలు ప్రకటిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

## హత్యాయత్నానికి ప్రయత్నించిన వారే సైకోలు: పేర్ని నాని

**విజయవాడ. జులై 13 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆడవాళ్ళ మీద దాడి చేయడం అంటే సైకో పరిపాలన కాదా అని మాజీమంత్రి పేర్నినాని ప్రశ్నించారు.కృష్ణా జిల్లా గుడివాడలో టీడీపీ-వైసీపీ పోటా పోటీ సభలు పెట్టడంతో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో మచిలీపట్నంలో మాజీ మంత్రి పేర్ని నానిని పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా పేర్నినాని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై తీవ్రంగా మండిపడ్డారు. స్థానిక జెడ్పీ చైర్ పర్సన్ ఉప్పాల హారిక మీద జరిగిన దాడిని ఖండిస్తున్నాం. వినలేని విధంగా జెడ్పీ చైర్ పర్సన్ ఉప్పల హారికను పచ్చి బూతులు తిట్టారని పేర్కొన్నారు. హారికకు రక్షణ కల్పించాల్సిన పోలీసులు కారు దిగమని ఒత్తిడి చేశారు. కారు నుంచి కిందకు దింపి చంపేయాలి అనుకున్నారా అని ప్రశ్నించారు. గుడివాడలో పోలీసులు ఘోరంగా పని చేస్తున్నారు. పోలీసులు అంటే ధైర్యం ఇవ్వాలి కానీ చంపేయడానికి రౌడీ మూకలకు అండగా ఉంటే ఎవరికి చెప్పుకోవాలని పేర్నినాని అడిగారు. ఉప్పల హారిక మీద దాడి చేసి, గాయపర్చిన వారిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

## కోట శ్రీనివాసరావుకు రాయలసీమ రంగస్థలి నివాళి

**తిరుపతి,జూలై 13ప్రభాతవార్తప్రతినిధి:** విలక్షణనటుడు కోటా శ్రీనివాసరావు మృతి తెలుగుసినీపరిశ్రమకు తీరని లోటని బిజెపి మాజీకార్యవర్గ సభ్యుడు, రాయలసీమరంగస్థలి కళాసంస్థ చైర్మన్ గుండాల గోపీనాధరెడ్డి అన్నారు. కోటా చిత్రపటానికి రాయల సీమ రంగస్థలి కార్యాలయంలో పుష్పాంజలి ఘటించారు. కోటా గతంలో బిజెపి ఎమ్మెల్యేగా పనిచేశారన్నారు. తొలితరం సినీనాయకుల దగ్గర నుండి నేటితరం యువనటుల వరకు అందరితో పనిచేసిన కోట శ్రీనివాసరావు తెలుగుప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉంటారని అన్నారు. రాయలసీమ రంగస్థలి కళాకారులు ఒఎన్‌రాజా, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, కస్పా పద్మనాభం, చంగల్‌రాయలు, జెజిరెడ్డి నివాళులర్పించారు.



# తిరుమల సమాచారం

## రేపు కోయిల్ ఆళ్వార్‌తిరుమంజనం

### ఎల్లుండి ఆణివార ఆస్థానం, నేడు, రేపు విఐపి దర్శనాల సిఫార్సులకు బ్రేక్



**తిరుమల,జులై 13 ప్రభాతవార్తప్రతినిధి:** ఆపద మొక్కులవాడు ఏడుకొండల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం (ఎల్లుండి) ఆణివార ఆస్థానం జరగనుండటంతో రేపు మంగళవారం ఆలయ శుద్ధి నిర్వహించనున్నారు.మంగళవారం ఉదయం 6గంటల నుంచి 11గంటల వరకు పరమపవిత్రంగా, ఒక యజ్ఞంలా నిర్వహిస్తారు. ఆలయంలోపల ఆనందనిలయం నుంచి బంగారువాకిలి, వెండివాకిలి, మహాద్వారం వరకు ఆలయంలోపల ఉప ఆలయాలు, ఆలయ ప్రాంగణం పూజాసామాగ్రి తదితర వస్తువులను సుగంధద్రవ్యాలు నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గంధంపొడి, కుంకుమ, కిచిలీగడ్డ తదితర వాటితో కలగలిపిన నీటితో శుద్ధిచేస్తారు. ఆ సమయంలో స్వామివారి మూల విరాట్టును శ్వేత వస్త్రంతో పూర్తిగా కప్పి ఉంచుతారు. ఏడాదిలో నాలుగుదఫాలుగా కోయిల్ ఆళ్వార్‌తిరుమంజనం చేపడతారు. ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవాలు, ఉగాది ఆస్థానం, వైకుంఠ ఏకాదశి ముందు మంగళవారాలు ఆలయ శుద్ధి జరుగుతుంది. బుధవారం ఆణివార ఆస్థానం వేడుకలు ఆలయంలో బంగారువాకిలిలో నిర్వహిస్తారు. మంగళవారం అష్టదళపాదపద్మారాధన సేవరద్దుచేశారు.కాగా 15వ తేదీ, 16వతేదీ విఐపి బ్రేక్ దర్శనాలు రద్దయ్యాయి.

## తిరుమలలో వరుస సెలవుల రద్దీ



**తిరుమల,జులై 13ప్రభాతవార్తప్రతినిధి:** వరుసగా మూడురోజులు సెలవులు రావడంతో వారాంతంతో తిరుమల కొండ భక్తులతో కిటకిటలాడుతోంది. ఆదివారం ఉదయానికి భక్తుల క్యూలైన్లు ఆక్టోపస్ భవనం వద్దకు చేరాయి. సాధారణ సర్వదర్శనం కోసం భక్తులు భారీగా చేరుకొంటుడటంతో వెలుపల క్యూలైన్లలోనే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు.ఆదివారం ఉదయానికి భక్తులతో ఎటుచూసినా జనసంద్రంగా మారింది. ఉదయం 5గంటలకు వైకుంఠం-1,2లో కంపార్టుమెంట్లు నిండిపోయాయి. నారాయణగిరి ఉద్యానవనాల్లోని షెడ్లు నిండాయి. సర్వదర్శనానికి భక్తులు 24గంటలు నిరీక్షిస్తున్నారు. సాయంత్రానికి మరింతగా భక్తుల రద్దీ పెరగడంతో 26,27గంటలు పట్టేసమయం మారింది. తిరుమల క్యూలైన్లలో ఉన్న భక్తులకు వైకుంఠం కంపార్టుమెంట్లలోని భక్తులకు శ్రీవారిసేవకులు నిరంతరాయంగా అన్నప్రసాదాలు, టీ,మజ్జిగ ,పాలు ,తాగునీరు పంపిణీచేస్తున్నారు. ఆలయంలో త్వరగా క్యూలైన్లు కదిలేలా టిటిడి అడిషనల్ ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాధం సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు. సాయంత్రంవరకు 50వేలమంది భక్తులు మహాలఘులో దర్శనం చేసుకున్నారు.


మఠంలో చాతుర్మాసదీక్షపూజలు చేస్తున్న జీయంగార్లు, ఆలయంలోనికి ఆహ్వానం

## శాస్త్రోక్తంగా జీయర్ల చాతుర్మాస్య దీక్ష

**తిరుమల,జులై 13పభాతవార్తప్రతినిధి:** వైష్ణవ సంప్రదాయకర్త రామానుజాచార్యుల పారంపర్యంలో చాతుర్మాసదీక్ష విశేషమైందని టిటిడి పెద్దజీయంగార్లు తెలిపారు. ఆషాడ శుద్ధ ఏకాదశిన శ్రీమహావిష్ణువు యోగనిద్రలోకి వెళ్ళి తిరిగి కార్తీక శుద్ధ ఏకాదశిన మేల్కొంటారు. ఈ నాలుగునెలల కాలాన్ని చాతుర్మాస్యం అంటారన్నారు. చాతుర్మాస్యదీక్షలో భాగంగా ఆదివారం ఉదయం తిరుమలలోని పెద్దజీయర్‌స్వామి మఠంలో కలశస్థాపన, కలశపూజ, విశ్వక్సేనారాధన, మేధినపూజ, మృత్సంగ్రహణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తరువాత పుట్టమన్ను సేకరించి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం చాతుర్మాస సంకల్పం స్వీకరించారు. అక్కడ నుండి పెద్దజీయర్‌స్వామి మఠం వద్దనుండి చిన్నజీయంగారు,శిష్యబృందంతో కలసి మంగళ వాయిద్యాల నడుమ బయలుదేరి తొలుత వరాహస్వామి బాలాలయాన్ని సందర్శించారు. అక్కడనుండి దేవదేవుని ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ మహాద్వారం వద్ద టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు దంపతులు, టిటిడి ఇఒ జె.శ్యామలరావు దంపతులు,అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ,ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాధం,అర్చకులు సంప్రదాయంగా స్వాగతం పలికారు. శ్రీవారి దర్శనానంతరం పెద్దజీయర్‌కు మేల్‌ఛాట్‌వస్త్రాన్ని,చిన్నజీయర్‌కు నూలువస్త్రాన్ని బహుకరించారు. అనంతరం టిటిడి ఛైర్మన్, ఇఒ,అదనపు ఇఒలను జీయంగార్లు శాలువతో సన్మానించారు. శ్రావణ, భాద్రపద, ఆశ్వయుజ ,కార్తీక పవిత్ర మాసాలలో ఆచార్య పురుషులు స్నాన,జప,హోమ,వ్రత దానాదులను నిర్వహించడం ఆనవాయితీ. ఈ కార్యక్రమాల్లో ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ, జీయంగార్లు పాల్గొన్నారు.

## స్వామి ఆశీస్సులతో శుభాలు కలగాలి: మంత్రి గొట్టిపాటి

**తిరుమల,జులై 13ప్రభాతవార్తప్రతినిధి:** అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు తిరుమల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో తెలుగుప్రజలు సంతోషంగా ఉండాలని దేవుని ప్రార్థించినట్లు రాష్ట్రమంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ఆదివారం ఉదయం అనుచరులు,కుటుంబంతో కలసి తిరుమలకు చేరుకున్నారు.ఉదయం విఐపి బ్రేక్‌లో వేంకటేశ్వరస్వామిని దర్శించుకు న్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.



## శ్రీవారి సేవలో న్యాయమూర్తులు



**తిరుమల,జూలై13ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామిని ఆదివారం ఉదయం పలువురు న్యాయమూర్తులు దర్శించుకున్నారు. ఉదయం విఐపి బ్రేక్ దర్శనాల సమయంలో హైకోర్టు మాజీ న్యాయమూర్తి ఏవి శేషాద్రి దంపతులు, హైకోర్టు రిజిస్ట్రార్ జస్టిస్ కమలాకర్‌రెడ్డి కటుంబం,గుజరాత్ హైకోర్టు న్యాయ మూర్తి జస్టిస్ ఎస్ఎన్ సంజయ్‌గౌడ, జ్యోతిషపండితుడు మాచిరాజు వేణుగోపాల్ తదితరులు స్వామి వారిని దర్శించుకున్నారు. వేదపండితులు వేదాశీర్వచనంచేశారు. టిటిడి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## భక్తులకు సకల సౌకర్యాలతో పిఎసి-5

### చివరిదశ పనులు తనిఖీచేసిన టిటిడి ఇఒ,అదనపు ఇఒ

**తిరుమల,జూలై 13ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలకు వస్తున్న భక్తుల సంఖ్య రోజురోజుకూ రెట్టింపవుతున్న సమయంలో వసతి సదుపాయం కల్పించే విషయంలో యాత్రికుల వసతి సముదాయం(పిఎసి-5) నిర్మాణపనులను మరింత వేగంగా పూర్తిచేయాలని టిటిడి ఇఒ జె.శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి అధికారులను ఆదేశించారు. పిఎసి 5 వద్ద పరిశుభ్రతకు ప్రాధాన్యత నివ్వాలన్నారు. ఈ పనులు చివరిదశలో ఉండటంతో వాటన్నిటినీ ఇఒ,అదనపు ఇఒ పరిశీలించారు. భక్తులకు మరింత సులభంగా వసతి కల్పించేందుకు పిఎసి5 అందుబాటులోకి రానుంది. డార్మిటరీలు, లాకర్లు, అన్నప్రసాదం డైనింగ్ హాళ్ళు, టాయిలెట్లు,డిస్పెన్షరీ, పెద్దకల్యాణకట్ట,వేడినీళ్ళ సౌకర్యం తదితర వాటిని పరిశీలించారు.



వార్త

తమ పూర్వీకులందరూ సాధించిన ఘన విజయాలను గురించి గర్వపడని వారు, ముందు తరాల వారు తమని గుర్తించగల ఏ కార్యాన్నీ సాధించలేరు.

-మెకాలే

# యుక్తాయుక్త విచక్షణే సత్తా!

ఒంట్లో సత్తువ, జవసత్వాలు ఉండి ఆలోచనానుభవాలు పుష్కలంగా ఉంటే వయసుతో పనేముంది అనే ధోరణి ఇప్పుడున్న పెద్దతరానిది. సామాజికంగా ఇలాంటి కారణాలకు పెద్దపీటవేసినా, రాజకీయంగా చూస్తే 75 యేళ్లయ్యేసరికి రాజకీయాలు వదిలేసినా వదిలేయకపోయినా తమ వారసులకు చోటివ్వాలనే ఉద్దేశ్యం ఒకటి బలంగా వేళ్లూనుకుంటోంది. అందుకేనేమో ఎన్టీఆర్ పిలుపుతో 1983లో అనుకోకుండా సేవాదృక్పథంతో రాజకీయాల్లోకి వచ్చి 7,8 సార్లు ఎమ్మెల్యేలుగా ఎన్నికైనవారు, రాజకీయ పదవులు అనుభవించిన వారు సైతం దీపముండగానే ఇల్లుచక్కదిద్దుకోవాలన్న యోచనతో 2019,2024 ఎన్నికల్లో తమ వారసులచే రంగ ప్రవేశం చేయించారు. యువతకు పట్టం కట్టాలనే ధోరణితో తమ కుటుంబ వారసుల్నే రాజకీయ వారసులుగా నిలబెట్టి కనీసం సగంమంది రిటైరయ్యారు. ఇందులో వారి స్వార్థం లేదని చెప్పలేం. కొంత మందికి ముదిమి మీద కొచ్చిన ప్రజాదరణను బట్టి రాజకీయ పదవుల్లో కొనసాగుతున్నారు. వారికొన్ని చోట్ల వృద్ధతరం అధికారం చెలాయిస్తే వారి వారసులు సమాంతరంగా రాజకీయాల్లో ఓనమాలు దిద్దుకుంటున్నారు. ఏమైతేనేమిలే యువత రాజకీయాల్లోకి వచ్చి ప్రజాసేవలో భాగస్వాములు కావడం స్వాగతించదగినదే. కాగా రాజకీయాల్లో ఎంతకాలం ఉండాలనే దానిపై వయసు అడ్డురాదన్నది చరిత్ర చెబుతోంది. అదే ఇన్నాళ్లూ చూస్తున్నాము. కుటుంబ వ్యవహారాల్లో సాధారణంగా పిల్లలు పెరిగి పెద్దవారై యోగ్యులుగా ఉన్నప్పుడే కుటుంబ వ్యవహారాల్లో నుంచి రిటైరై బాధ్యతలను వాటికప్పగించడం మనం చూస్తూనే ఉన్నాం. రాజకీయాల్లో వయో అర్హత గురించి పెద్దగా పట్టింపు లేమీ లేవు. కానీ తాజాగా ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ నాగపూర్‌లో జరిగిన ఓ సామూహిక కార్యక్రమంలో 75 యేళ్లు అయ్యాక రాజకీయాలను వదిలిపెట్టాల్సిన ఆవశ్యకతను ప్రతిపాదించారు. ఆయన భారతీయజనతా పార్టీని వెనకుండి నడిపించే ఆర్. ఎస్. ఎస్ అధినేత కనుక ఆయన మాట ఇప్పుడు చెల్లుబాటయ్యే పరిస్థితి కనబడుతోంది. ఆయనకెలాగో త్వరలో 75 ఏళ్లు నిండుతోంది. కనుక తన రిటైర్‌మెంట్ గురించే మాట్లాడారా! లేక బిజెపికి చెందిన భారత ప్రధాని నరేంద్రమోడీని ఉద్దేశించి మాట్లాడారా? తెలియక బిజెపి తలపట్టుకు కూర్చొంది. అంటే భారతీయ జనతాపార్టీలో ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ వ్యాఖ్యలు పెద్ద దుమారాన్నే లేవనెత్తాయి. అవే ఆర్ఎస్ఎస్ నిర్దేశికత్వం అయితే నరేంద్రమోడీ సెప్టెంబరు నెలలో రాజకీయాల నుంచి తప్పుకోవాల్సి ఉంటుందనే సంకేతాలు పంపినట్లుగానే భావించాలి. ప్రస్తుత భారత రాజకీయాల్లో కానీ, పాలక వర్గంలో కానీ, నరేంద్రమోడీకి మించిన చరిస్మా ఉన్న నాయకులెవరూ లేరు. అయితే భారతీయ జనతా పార్టీ రాజ్యాంగంలో పదవీ విరమణ వయోపరిమితి నిబంధన ఏదీ లేనందున 2029వరకు నరేంద్రమోడీయే ప్రధానిగా కొనసాగుతారని కార్యకర్తలు ఘంటాపథంగా చెబుతున్నారు. అయినా ఏదో ఒక ప్రయత్నం చాపకింద నీరులా జరిగే తీరుతుంది. ప్రస్తుత వ్యాఖ్యలు ఎంత దూరం తీసుకెళ్తాయో తెలియదుకానీ రాజకీయాలను ఒక్క కుదుపు కుదుపుతాయి. ప్రజాస్వామ్య దేశాలలో రాజకీయ రంగంలో 75 ఏళ్లు దాటిన తర్వాత కూడా ఎన్నికవుతూ లేదా నియమిత పదవుల్లో కొనసాగడం సర్వసాధారణం. ఏ రాజకీయ పార్టీలోనూ, పదవులు నిర్వహించే విషయంలో గరిష్ట వయో పరిమితి అంటూ ఏమీలేదు. ప్రపంచ వ్యాప్త, రాజకీయధోరణుల్లో వృద్ధనేతలకు మినహాయింపు లభించిన సందర్భాలు లేవు. వారికి సుదీర్ఘ అనుభవం, ప్రజల్లో ఆదరణ ఉన్న రీత్యా వారిని పక్కకు తప్పించలేని పరిస్థితి. వృద్ధాప్యంలోనూ వారు చురుకైన నాయకత్వ పటిమను కనపరిచారు. జాతీయస్థాయిలో ఎన్సీపీ నాయకత్వం వహిస్తున్న శరద్‌పవర్, కాంగ్రెస్ పార్టీ అధినేత్రిగా పార్టీని విజయవంతంగా నడిపి రెండు టర్మ్‌లు పార్టీని అధికారంలోకి తెచ్చిన సోనియాగాంధీ, కేంద్ర మంత్రిగా పనిచేసిన ఎం.వి రాజశేఖరమూర్తి వంటివారు ఎందరో జాతీయ రాజకీయాల్ని ప్రభావితం చేసినవారే. ప్రాశ్చాత్య దేశాల్లోనూ రాజకీయాలకు వయసుతో పని లేకుండాపోయింది. నిన్నగాక మొన్న అమెరికాను ఏలిన జోబైడెన్ 80వ ఏటవరకు పదవిలోనే ఉన్నారు.అమెరికా సామ్రాజ్యాధిపతిగా మంచి నిర్ణయాలు తీసుకున్నారనే పేరుంది. ప్రపంచంలో అత్యధిక వయస్సులో పదవిలో ఉన్ననాయకుడిగా రికార్డు సృష్టించిన మలేషియా ప్రధాని 80 యేళ్ల వయసులో తొలిసారి ప్రధాని అయ్యారు.మరోసారి కూడా ఆయన పదవిని దక్కించుకున్నారు. ఇలాంటి సందర్భాలను బట్టి పరిపాలనా సత్తా, ప్రజాదరణ ఉన్నంతకాలం ఎవరైనా పదవిలో కొనసాగవచ్చుననే దృష్టాంతరాలు చరిత్రలో కనపడుతున్నాయి. కాగా దేశ కాలమాన పరిస్థితులకు తోడుగా రాజకీయ ఆకాంక్షలకు వీలుగా వృద్ధ రాజకీయ నాయకులు 75కి తొలగి యువతకు చోటివ్వాలనే తలంపులకు ఎవరైనా ఓటెయ్యాల్సిందే. ఇప్పుడా ఆలోచనలు రాజకీయ నేతల మెదళ్లను తొలచడాన్ని ఆహ్వానించాల్సిందే. రాజకీయ వైకుంఠపాళిలో చిన్న వయసులో రాజకీయాల్లోకి వచ్చిన యువత సైతం పరిపాలనానుభవం కలిగిన సీనియర్ల దగ్గర పని చేయడంవల్ల వారిలో రాజకీయకాంక్షతోపాటు రాజ్యకాంక్ష కూడా ఇనుమడిస్తుంది. ఇందువల్ల ప్రజాపాలన సౌభాగ్యక రంగా, అభివృద్ధి పథంలో నడిపించే అనుభవం సాధించగలుగుతారు.తాజాగా సీనియర్ రాజకీయ నేతలే యువతను రాజకీయాల్లోకి ఆహ్వానిస్తున్నారు. దేశ సంక్షేమానికి శుభప్రదం కాగలదు.

జీవితంలో ప్రతి నిముషాన్నీ వ్యర్థం చేయక ఉపయోగించుకో. లేకుంటే నీవు వృథా చేసిన కాలం నీ అదృష్టాన్ని తారుమారు చేయగలదు.



నెపోలియన్

ఒక పనిని ఎందుకు తప్పుగా చేశారో తెలియచేయడానికి పట్టే కాలం కంటే ఆ పనిని తిరిగి సరిగ్గా చేయడానికి తక్కువ సమయం పడుతుంది.



లాంగ్‌ఫెలో

# ప్రపంచశాంతికి పరిష్కారం ఉందా?

ప్రజాస్వామ్యాన్ని గట్టిగా ఆచరించే ఏదేశ నాయకుడైనా నమ్మిన సిద్ధాంతం కోసం మొదట్లో ఒక్కడి గానే నడవాల్సిన పరిస్థితిని అవగాహన చేసుకొని ఆచర ణలో దిగకతప్పదు. అలాంటి నాయకత్వం ఇతరులలో ఇతర దేశాలలో స్ఫూర్తిని కలుగచేస్తుందన్న నగ్నసత్యాన్ని చరిత్ర చెబుతున్నది. కారల్‌మార్క్స్ చెప్పినట్లు నాయకత్వం 'వాక్యూమ్'లో ఏర్పడదు. నాయకులు మనుషులుగానే చరిత్రను సృష్టిస్తారు. అయితే వారిష్టంవొచ్చినట్లు సృష్టిం చరు. పూర్వాపరాలు పరిగణనలోకి తీసుకొని నాయకులను తయారు చేస్తూ పరిస్థితులకు అనుగుణంగా పరిష్కారాలు కనుక్కొంటారు. ప్రస్తుత పరిస్థితులలో ఏ దేశం ఇందుకు అనుగుణంగా మూడవ ప్రపంచయుద్ధం అంచుల్లో ఉన్న మానవత్వాన్ని రక్షిస్తూ ప్రపంచాన్ని శాంతిమార్గానికి మళ్లిస్తుందో అలాంటి రాజకీయ నాయకులు ఏవిధంగా ఉద్భవి స్తారో చెప్పటం నడుస్తున్న చరిత్రకే సాధ్యం.తక్షణ కర్త వ్యం ప్రపంచ శాంతికి పునరుద్ధరణ ప్రయత్నాలు చేయటమే.



రావులపాటి సీతారాం రావు

ప్రపంచ రాజకీయ రంగంలో నైతికత కొరవడిందా? ఆ విషయాన్ని హెచ్చరించడానికి నైతిక నాయకత్వ పటిమ కలిగినవారే కరువయ్యారా? ప్రపంచంలోని దేశ నాయకులు అందరూ క్షణకాలం తమ తమ బరువు బాధ్యతలను పక్కన పెట్టాల్సిన అవసరం లేకుండానే, నెమరువేసుకోవాల్సిన అత్యంత ప్రాముఖ్యత కలిగిన విషయాన్ని ఎందుకు దాటేస్తున్నారు? భారతదేశం మాటకొస్తే మన నాయకులు ముఖ్యంగా అధికారంలో ఉన్న వారు, తమ దేశానికి వున్న నేపథ్యంలో తప్పక గాఢంగా పరిశీలించాల్సిన అవసరం ఏర్పడిందన్న మాట విజ్ఞులు గమనంలోకి తీసుకోక తప్పటం లేదు. మహాత్మాగాంధీ దేశ స్వాతంత్ర్యానికి పునాదులు వేసినప్పుడు కూడా బ్రిటిష్ ప్రభుత్వం పట్ల మాట మీరలేదు! హక్కుల కోసం పోరాడుతూ సత్యాగ్రహం చేసారు కానీ, ఆగ్రహంతో దూషణ పదజాలాన్ని కూడా వాడలేదు! ఎవరైనా హద్దులు మీరినప్పుడు నైతికంగా నాయకత్వం వహిస్తూ పరిధులు దాటనివ్వలేదు. జవహార్‌లాల్‌నెహ్రూ, వల్లభాయ్ పటేల్ లాంటి వారు బ్రిటిష్ వారు పాలన వదులుకొని స్వాతంత్ర్యం ఇచ్చి వెళ్లిన తర్వాత ప్రభుత్వంలో ఉన్నవాళ్లు,ప్రపంచానికి నైతిక నాయకత్వాన్ని ఇవ్వగలిగారు. అలీన విధానంతో ఏది మంచో ఏది చెడో స్పష్టంగా చెప్పగలిగారు. కాశ్మీర్ విషయంలో దేశానికి కొంత ఇబ్బంది కలిగినా పాకిస్థాన్‌ను సాటివారిగానే చూశారు కానీ పదిమందిలో ఆదేశ పరువును తీయలేదు. అంతటి మహోన్నత వారసత్వానికి ప్రతినిధిగా ఉన్న భారత్ ఇప్పుడున్న సంకట పరిస్థితులలో నైతిక నాయకత్వం వహిస్తూ మార్గదర్శకత్వం వహించాల్సిన అవసరం ఏర్పడిందేమో అన్న విషయాన్ని ఆలోచించటం బాధ్యత అని అనుకోవటంలో తప్పులేదేమో! భారతదేశం ఆర్థికంగా అగ్రగాముల్లో ఒకటిగా ఎదిగింది. అణు సంపద కలిగిన దేశంగా గుర్తింపబడుతున్నది. జన సంపదలో అంటే జనాభా విషయంలో అగ్రస్థానంలో ఉన్నది. దక్షిణ ఆసియా దేశాల్లో ప్రముఖ దేశంగా ప్రవర్తిల్లుతున్నది. ఇండియన్ సబ్‌కాంటినెంట్‌గా కూడా వర్ధిల్లుతున్నది. అలాంటి పరిస్థితుల్లో ప్రపంచ దేశాలను దారి తప్పనివ్వకుండా చూసే కనీస బాధ్యతను భుజాల మీద ఎత్తుకోలేదా? భారత్ కాకపోతే మరే దేశం ఆ బరువును ప్రపంచ శ్రేయస్సు దృష్ట్యామోయాలి? ఆలోచించాల్సిన విషయంగా విజ్ఞులు దౌత్య నిపుణులు, అంతర్జాతీయంగా ప్రముఖంగా ఆలోచించగల నేర్పరులు, దృష్టి పెట్టాల్సిన అవశ్యకత ఏర్పడిందేమో? భారత్ స్నేహదేశాలను వదులుకోకుండానే నేర్పుగా ప్రముఖ దేశాలలో విస్తరిల్లుతున్న మితిమీరిన అనైతికతనూ, బాధ్యతారాహిత్యాన్ని కట్టడి చేయడానికి సాహించటం తప్పేమీలేదేమో? స్పష్టంగా ఆలోచనా పరిధిని పెంచుకుంటే ప్రస్తుత పరిస్థితులలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, ప్రజాస్వామ్యబద్ధంగా ఎంపిక కాబడి, నియంతృత్వ ధోరణిలో ప్రపంచాన్నంతటినీ



శాసించే ప్రయత్నానికి పూనుకున్నారు. దానిని నిలువరించటానికి కొన్ని దేశాలు యుద్ధపరంగా కాకుండా, నైతిక పరివర్తనను తెచ్చే విధంగా కొంతలో కొంత బాధ్యత తీసుకోవాల్సిన అవసరం, ప్రపంచశాంతి దృష్ట్యా ఏర్పడిందని ఒప్పుకోకతప్పదు. గ్లోబల్ సంఘర్షణలు పెరుగుతూ ప్రజాస్వామ్యం సన్నగిల్లుతున్న ఈ తరుణంలో రాజకీయ నాయకత్వం ఈ పరిస్థితిని సరిదిద్దాల్సిన అవసరం ఏర్పడింది. ప్రపంచ దేశాల నాయకులు వారి ఖ్యాతిని అనైతికంగానైనా సరే పెంచుకోటానికి శృతి మించి వ్యవహరిస్తున్నారు. అగ్రదేశాలుగా ప్రపంచ శాంతిని దెబ్బతీస్తూ హిట్లర్, ముస్సోలినీలను జ్ఞప్తికి తెచ్చే విధంగా యుద్ధ ప్రణాళికలను స్వలాభం కోసం ముందుకు తేవడం అత్యంత హేయంగా కొన్ని దేశాలైనా భావించకతప్పదు. పహల్గాం సంఘటనను యు.యన్ సెక్యూరిటీ కౌన్సిల్ ఎందుకు ఖండించలేకపోతున్నది? పాకిస్థాన్ నైతిక బాధ్యతను చైనా తప్పుడు మార్గాన్ని ఎందుకు తప్పుపట్టలేకపోతున్నది. బంగ్లాదేశ్‌లోని ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందన్న సంగతిని అగ్రదేశాలు ఎందుకు గుర్తించలేకపోతున్నాయి. తగు చర్యలు ఎందుకు తీసుకోలేకపోతున్నాయి. రష్యా-ఉక్రెయిన్‌ల మధ్య గొడవలనుఅమెరికా కేవలం గనుల సంపాదన కోసం కాకుండా న్యాయపరిధిలో తప్పుచేసిన వారిని మాటవరసకైనా ఎందుకు హెచ్చరించలేకపోతున్నది? ట్రంప్ హెచ్చరికలు విలువలేని మాటలుగా ప్రపంచ దేశాలు రాజకీయంగా తీసిపారేసే స్థితి దాపురించటం ఎంత విషాదకరం? అధినాయకత్వం కోసం డోనాల్డ్ ట్రంప్ టారిఫ్ హెచ్చుతగ్గుల విధానాన్ని పావుగా వాడటం ఇంతకుమునుపు ప్రజాస్వామ్యం పాటించే ఏ దేశమైనా, ఏ రాజకీయ నాయకుడైనా పాటించడం జరిగిందా? ఉక్రెయిన్, గాజా, ఇజ్రాయిల్, ఇరాన్ సంఘర్షణలు పెచ్చరిల్లటానికి కారణం ప్రపంచ దేశాలలోని మానవత్వం కనుమరుగు కావటంవల్లనే అన్న కనీస నైతికాలోచన ప్రపంచ దేశాల నాయకులుగా చెప్పుకొనేవారు ఎందుకు పరిగణనలోకి తీసుకోవటం లేదన్నదే మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. ప్రపంచ చరిత్రను అవలోకనం చేసుకొని కొన్ని పాఠాలు నేర్చుకొని తదనుగుణంగా ఆచరించే చర్యలను కొందరు రాజకీయ నాయకులైనా తలపెట్టకతప్పదు. అంతర్జాతీయ న్యాయపరిధిలోనే, సమిష్టి ఆలోచనలతో ఈ సమస్యలకు పరిష్కారం కనుక్కోవటానికి కొందరు అగ్రదేశాల నాయకులైనా ముందుకు రాకతప్పదు. ప్రజాస్వామ్యాన్ని గట్టిగా ఆచరించే ఏదేశ నాయకుడైనా నమ్మిన సిద్ధాంతం కోసం మొదట్లో ఒక్కడిగానే నడవాల్సిన పరిస్థితిని అవగాహన చేసుకొని ఆచరణలో దిగకతప్పదు. అలాంటి నాయకత్వం ఇతరులలో ఇతర దేశాలలో స్ఫూర్తిని కలుగచేస్తుందన్న నగ్నసత్యాన్ని చరిత్ర చెబుతున్నది. కారల్‌మార్క్స్ చెప్పినట్లు నాయకత్వం 'వాక్యూమ్'లో ఏర్పడదు. నాయకులు మనుషులుగానే చరిత్రను సృష్టిస్తారు. అయితే వారిష్టంవొచ్చినట్లు సృష్టించరు. పూర్వాపరాలు పరిగణనలోకి తీసుకొని నాయకులను తయారు చేస్తూ పరిస్థితులకు అనుగుణంగా పరిష్కారాలు కనుక్కొంటారు. ప్రస్తుత పరిస్థితులలో ఏ దేశం ఇందుకు అనుగుణంగా మూడవ ప్రపంచయుద్ధం అంచుల్లో ఉన్న మానవత్వాన్ని రక్షిస్తూ ప్రపంచాన్ని శాంతిమార్గానికి మళ్లిస్తుందో అలాంటి రాజకీయ నాయకులు ఏవిధంగా ఉద్భవిస్తారో చెప్పటం నడుస్తున్న చరిత్రకే సాధ్యం.తక్షణ కర్త వ్యం ప్రపంచ శాంతికి పునరుద్ధరణ ప్రయత్నాలు చేయటమే. ●

# రైతులకు శాపంగా మారుతున్న నకిలీ విత్తనాలు

జి. అజయ్ కుమార్

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. రైతులు తమ పొలాలను సిద్ధం చేసుకుంటూ, నాణ్యమైన విత్తనాల కోసం ఫెర్టిలైజర్ షాపులు, విత్తన విక్రయ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. కానీ రైతులు నమ్మి కొనుగోలు చేస్తున్న విత్తనాలన్నీ నాణ్యమైనవేనా? వ్యవసాయంలో విత్తనం పాత్ర అమూల్యమైనది. ఒక రైతు వ్యవసాయం లాభసాటిగా ఉండాలంటే, మొదటి మెట్టు నాణ్యమైన విత్తనం ఎంపికే. విత్తన నాణ్యతపైనే పంట దిగుబడిఇ, రైతు ఆదాయం అన్నీ ఆధారపడతాయి. కానీ ఇటీవల కాలంలో నకిలీ విత్తనాల మాఫియా వ్యవసాయాన్ని భూతంగా మింగేస్తోంది. కొందరు వ్యాపార లాభాల కోసం రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని నకిలీ విత్తనాలను విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. ఇటీవల సూర్యాపేట, వరంగల్, షాద్‌నగర్, ఆత్మకూర్‌లలో వ్యవసాయ అధికారులు, పోలీసులు జరిపిన సోదాల్లో లక్షల విలువైన నకిలీ పత్తి విత్తనాలు దొరికాయి, ప్రతి సంవత్సర ఇలాంటి సంఘటనలు కోకొల్లలుగా జరుగుతున్నాయి. ఎటువంటి ప్రమాణాలు లేకుండా సరఫరా అవుతున్న ఈ విత్తనాలు నాటిన తర్వాత మొలకే రావడం లేదు.మొలక వచ్చినా సరైన దిగుబడి రావడం లేదు.చివరికి రైతులకు దిగుబడి నష్టం,అప్పులభారంతో పాటు మానసిక ఆందోళనతో చివరికి ఆత్మహత్య చేసుకునే పరిస్థితికి చేరుకున్నాడు. ప్రభుత్వాలు ఎన్ని చర్యలు తీసుకున్నా ఈ నకిలీ దందా యధాతథంగా కొనసాగుతూనే ఉంది. నకిలీ విత్తనం అనగా నిజమైన రకం కాని విత్తనం, లేదా ఉద్దేశించిన విత్తన రకానికి సరిపోలని విత్తనం, లేదా ధ్రువీకరణ పొందని విత్తనం. ఇవి సాధారణంగా ప్రభుత్వం గుర్తించిన విత్తన ధ్రువీకరణ సంస్థల ధ్రువీకరణ లేకుండా ఉత్పత్తి చేయబడతాయి. నకిలీ విత్తనాలను రెండు రకాలుగా గుర్తించవచ్చు ఒకటి పంట వేయకముందు రెండోది పంట వేసిన తర్వాత. ఒకవేళ పంటవేయకముందు రైతు నకిలీ విత్తనాలను గుర్తించి అవగాహన కలిగి ఉన్నట్లయితే ఆర్థికంగా నష్టపోకుండా ఉండవచ్చు. అదేవిధంగా పంట వేసిన తర్వాత గుర్తిస్తే ఆర్థికంగా అధికంగా నష్టపోవాల్సి ఉంటుంది. కాబట్టి రైతులు విత్తనం వేసే ముందే ఈ విత్తనాలు నకిలీవా లేదా నిజమైన విత్తనాల అని తేడా




లు గుర్తించి పరీక్షించుకొని విత్తనం నాటు కోవాలి. వ్యవసాయ ఉత్పత్తిలో విత్తనాల పాత్ర ఎంతో కీలకం. కానీ మార్కెట్లో నకిలీ విత్తనాల చెలామణి రైతుల నమ్మకాన్ని నాశనం చేస్తోంది. ఈ నేపథ్యంలో ప్రతి రైతు తన భూమిలో విత్తనం వేయక ముందు కొన్ని ముఖ్యమైన అంశాలను పరిశీలించడం అవసరం.అనుమతులు కలిగిన డీలర్ల నుంచే విత్తనాలు కొనండి, ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొందిన లేదా లైసెన్స్ కలిగిన డీలర్ల దగ్గర మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి. అక్రమ వ్యాపారులకు దూరంగా ఉండాలి. ధృవీకరించబడిన కంపెనీల విత్తనాలకే మొగ్గు చూపాలి. విత్తన ధృవీకరణ సంస్థల నుండి లైసెన్సు పొందిన కంపెనీల విత్తనాలనే కొనాలి. ప్యాకెట్‌పై "హోలోగ్రామ్" ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించాలి. మొత్తం పెట్టుబడి ఆదా చేస్తుందని తక్కువ ధరలో అమ్మే ముఠాలను నమ్మి మోసపోవద్దు. సాధారణంగా నకిలీ విత్తనాలు చాలా తక్కువ ధరకే అమ్ముతారు. విత్తనాలు కొనుగోలు చేసిన వెంటనే రసీదు తీసుకోవాలి. సమస్య ఏర్పడితే ఇది న్యాయంగా నిదర్శనంగా ఉపయోగపడుతుంది.ప్యాకెట్ వెనక ట్యాగ్ లేదా స్టిక్కర్‌ను చూసి గుర్తించాలి. ప్రైవేట్ కంపెనీల విత్తన సంచుల వెనుక భాగంలో ఉండే పచ్చ రంగు ట్యాగ్ (ట్రూత్ ఫుల్ లేబుల్డ్ ) లేదా నీలిట్యాగ్ (సర్టిఫైడ్ సీడ్) ఆధారంగా విత్తనాన్ని గుర్తించాలి. మిరప, ప్రత్తి విత్తనాలపై ముఖ్యంగా పచ్చట్యాగ్ ఉండేలా చూస్తారు. ట్యాగ్‌పై లైసెన్స్, లాట్ నెంబర్, క్యూ ర్ కోడ్ వుంటేనే నమ్మకం విత్తన ట్యాగ్ పై కంపెనీ లైసెన్స్ నెంబర్, లాట్ నెంబర్, క్యూ ర్ కోడ్, ప్యాకింగ్ తేదీ మరియు చెల్లుబాటు గల తేదీలు ముద్రించబడి ఉండాలి. ఇవి లేనివాటిని కొనొద్దు. మొలక శాతం, జన్యు శాతం వంటి ప్రమాణాలు తప్పక చూడాలి.ప్రతి విత్తన సంచిలో మొలక శాతం 80 కంటే ఎక్కువ, జన్యు శాతం 98 కంటే ఎక్కువ, ఇతర పదార్థాలు 2 కన్నా తక్కువగా ఉండాలి. ప్యాకెట్‌పై ఇవి ముద్రించి ఉండాలి. బీటీ విత్తనాల గుర్తింపు – జి ఈ ఏ సి నంబర్ తప్పనిసరి. ప్రత్తి విత్తనాల విషయంలో జి ఈ ఏసి (జెనెటిక్ ఇంజనీరింగ్ అప్రైసల్ కమిటీ) ద్వారా మంజూరైన నంబర్ ఉన్న విత్తనాలకే మొగ్గు చూపాలి. ఇది బీటీ విత్తనం అని గుర్తించేందుకు ప్రధాన ఆధారం. ఈ సూచనలు పాటిస్తే రైతులు నకిలీ విత్తనాల వలలో పడకుండా, నమ్మకమైన విత్తనాలతో మంచి దిగుబడులు సాధించవచ్చు. ఎప్పుడూ మోసపోతే ముద్రా పత్రాలద్వారాన్యాయపరంగా ఫిర్యాదు చేయడాన్ని రైతులు మర్చిపోకూడదు. ●

# దేశాన్ని మింగుతున్న మానవ విపత్తు 'మత్తు'

రామ కిష్టయ్య సంగన భట్ల

గంజాయి అనే మత్తు పదార్థం ఈ కాలంలో దేశాన్ని మానవీయ విపత్తుగా ముప్పతిప్పలు పెడుతోంది. గ్రామీణం గానీ, పట్టణం గానీ, పాఠశాలలైనా, కళాశాలలైనా, యువతీ యువకులైనా తేడా లేకుండా ఈ మత్తు మహమ్మారి వేగంగా విస్తరిస్తోంది. ఇది కేవలం ఒక మానసిక వ్యసనం కాదు. శారీరక ఆరోగ్యాన్ని, కుటుంబ పరిమితిని, సామాజిక సమతుల్యతను, ఆర్థిక స్థిరత్వాన్ని నాశనం చేసే భయంకరమైన వ్యాధిగా రూపుదిద్దుకుంది. గంజాయి అనేది గంజి మొక్క నుండి వచ్చే మత్తు పదార్థం. దీనిలో ప్రధానంగా ఉండే క్రియాశీల పదార్థం టెట్రా హైడ్రో. కానబినాల్, ఇది మెదడులోని స్వభావాన్ని ప్రభావితం చేస్తూ తాత్కాలిక ఆనందానుభూతిని కలిగించగలదు. అయితే దీర్ఘ కాల వాడకం వల్ల మానసిక అస్థిరత, భ్రమలు, నిస్పృహ, బహుళ వ్యక్తిత్వ లక్షణాలు, ఆందోళన, విపరీత భావోద్వేగాలు తలెత్తుతాయి. ఆరోగ్యపరంగా ఊపిరితిత్తుల సమస్యలు, గుండె వేగం పెరగడం, జీర్ణక్రియ మందగించడం వంటి శారీరక దుష్ప్రభావాలు కలుగుతాయి. 2021లో అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ రూపొందించిన డ్రగ్ వినియోగంపై జాతీయ సర్వే ప్రకారం దేశంలో సుమారు 3.1 కోట్ల మంది కనీసం ఒక్కసారి గంజాయి వాడినట్లు తేలింది. ఇందులో దాదాపు 70 లక్షల మంది గంజాయికి బానిసలుగా మారిన వారే. పట్టణాల్లో మాత్రమే కాదు, గ్రామీణ ప్రాంతాల్లో కూడా గంజాయి వినియోగం వేగంగా పెరుగుతోంది. ముఖ్యంగా 15 నుండి 35ఏళ్ల మధ్య వయస్సు కల యువత దీనికి బలవుతున్నారు. గంజాయి వినియోగానికి ప్రధాన కారణాలలో ఒకటి – సులభ లభ్యత. దేశంలోని ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, ఒడిశా, ఆంధ్ర ప్రదేశ్‌ల ఏజెన్సీ ప్రాంతాలలో విస్తృతంగా సాగవుతోంది. అక్కడి నుండి ఇది దేశవ్యాప్తంగా అక్రమంగా రవాణా అవుతోంది. ముంబయి, ఢిల్లీ, హైదరాబాద్, బెంగళూరు వంటి మెట్రో నగరాల్లో కళాశాలలు, పబ్‌లు, పార్టీలు గంజాయి విక్రయాలకు కేంద్రాలుగా మారిపోయాయి. యువతలో స్నేహితుల ఒత్తిడి, సరదా ప్రయోగం అనే పేరుతో మొదలై, వ్యసనంగా మారుతోంది. నిరుద్యోగం, కుటుంబ కలహాలు, ప్రేమ విఫలాలు వంటి మానసిక ఒత్తిళ్లు కూడా గంజాయి వైపు నెట్టేస్తున్నాయి. అంతేకాదు గంజాయి హానికరం కాదు, ఇది ఆయుర్వేద మందు" అనే తప్పుడు ప్రచారాలు కూడా యువతను ఈ మత్తులోకి తొక్కిస్తున్నారు. ఈ మత్తు పదార్థం ప్రభావం కేవలం వ్యక్తిగత స్థాయిలో కాకుండా కుటుంబానికి, సమాజానికి తీవ్రంగా విస్తరిస్తోంది. గంజాయి వాడకం వల్ల పాఠశాల విద్యార్థులలో చదువుపై ఆసక్తి తగ్గిపోతోంది. తరచుగా గైర్హాజరు అవుతూ చివరికి చదువు మానేస్తున్నారు. జ్ఞాపకశక్తి తగ్గిపోవడం, ఏకాగ్రత కోల్పోవడం, మానసిక స్థిరత్వం కోల్పోవడం వలన ఉద్యోగ అవకాశాలపై కూడా తీవ్ర ప్రభావం



పడుతోంది. నేరాల శాతం పెరుగుతోంది. గంజాయి కొనుగోలుకు డబ్బుల కోసం దొంగతనాలు, దాడులు వంటి నేరాలకు పాల్పడే అవకాశాలు కూడా పెరిగాయి. డ్రగ్ ఆధారిత నేరాల శాతం గత ఐదేళ్లలో 32 శాతం మేర పెరిగిందన్నది ప్రభుత్వ గణాంకాలే చెబుతున్న నిజం. ఇటు తెలంగాణలో 2023లో మాత్రమే గంజాయి అక్రమ రవాణా కేసులు 850కి పైగా నమోదయ్యాయి. హైదరాబాదు, రంగారెడ్డి ప్రాంతాల్లోనే దాదాపు 220 కేసులు చోటుచేసుకున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ, అల్లూరి సీతారామరాజు, పాడేరు, ముంపు ప్రాంతాల్లో గంజాయి సాగు కొనసాగుతూనే ఉంది. ఏజెన్సీ ప్రాంతాల్లో సుమారు 1,500 ఎకరాల గంజాయి సాగు గుర్తించబడి నాశనం చేయబడినట్లు నివేదికలు చెబుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్ని ఎదుర్కొనటానికి కేంద్ర ప్రభుత్వం 1985లో మాదక ద్రవ్యాలు మానసిక ప్రభావ పదార్థాల చట్టాన్ని తీసుకువచ్చింది. దీని ప్రకారం గంజాయి సాగు, నిల్వ,రవాణా, విక్రయం, వినియోగం నేరంగా పరిగణించబడుతుంది. కేంద్ర స్థాయిలో నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో, రాష్ట్రాల్లో పోలీసు శాఖలు, ఎక్సైజ్ శాఖలు గంజాయి వ్యాపారాన్ని అరికట్టేందుకు కృషి చేస్తున్నాయి. డ్రోన్‌ల ద్వారా పర్యవేక్షణ, సరిహద్దుల్లో తనిఖీలు, రహస్య సమాచార మాధ్యమాల ద్వారా గంజాయి వాణిజ్యాన్ని గుర్తించి నిర్వీర్యం చేస్తున్నారు. పాఠశాల స్థాయిలో అవగాహన సదస్సులు, కళాశాలల వద్ద డ్రగ్ నిరోధక శిబిరాలు నిర్వహించడం మొదలు పెట్టారు. 2025 నాటికి మత్తు పదార్థాల వినియోగాన్ని 50 శాతం తగ్గించాలన్న లక్ష్యంతో కేంద్రం 'దేశీయ మత్తు నియంత్రణ చర్యల కార్యాచరణ పథకం'ను చేపట్టింది. ఇందులో అవగాహన కార్యక్రమాలు, పునరావాస కేంద్రాల ఏర్పాటు, మానసిక చికిత్సలు, కుటుంబాల సహకారం వంటి అంశాలను మేళవించారు. కొన్ని రాష్ట్రాలు పాఠశాలల పాఠ్యాంశాలలో డ్రగ్స్‌హానిపై ప్రత్యేక అధ్యాయాలు ప్రవేశపెట్టాయి. అయితే ఈ చర్యలు సరిపోవు.సమాజం మొత్తం దీన్ని ఒక జాతీయ సంక్షోభంగా గుర్తించాలి. ప్రతీ పాఠశాల, కళాశాల, కుటుంబంలో ఈ విషయంపై చర్చ, చైతన్యం అవసరం. యువత మానసిక ఒత్తిళ్లకు గురికాకుండా ఉండేందుకు వారికి మానసిక ఆరోగ్య మార్గదర్శకత అవసరం. ఉపాధి అవకాశాలు పెంచాలి. సినిమా, టెలివిజన్, సోషల్ మీడియా వంటి వేదికల్లో గంజాయివాడకాన్ని ప్రోత్సహించే దృశ్యాలను నియంత్రించాలి. నిత్యజీవితంలో ప్రతి ఒక్కరికీ ఈ పోరాటంలో భాగస్వామ్యం ఉండాలి. గంజాయి మహమ్మారి మన దేశ యువతను బలి తీసుకుంటోంది. అది కేవలం ఒక మత్తు పదార్థం కాదు – అది ఒక భవిష్యత్ హంతక మార్గం. ఈ మత్తు మాయను అంత మొందించాలి. ప్రభుత్వాలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, మానసిక నిపుణులు, సమాజ సేవా సంస్థలు,యువతీ, యువకులు – అందరూ చేతులు కలిపి పని చేయాలి. అంతేకాదు, మానవతా దృష్టితో ఈ వ్యసనాన్ని ఔషధ చికిత్స, పునరావాసం, బోధన, శిక్షణ, క్రమశిక్షణ అనే అంశాలుగా అర్థం చేసుకుని ముందుకెళ్లాలి. మన దేశం ఆరోగ్యంగా ఉండాలంటే మన యువత ఆరోగ్యంగా ఉండాలి. యువత చేతులు సృష్టి కర్తలుగా ఎదగాలి. మత్తు పదార్థాలకు బాని సలుగా కాక యువతను గంజాయి సంకెళ్ల నుండి విముక్తి చేయాలంటే – చైతన్యంతో, శక్తితో, స్ఫూర్తితో ప్రతి ఒక్క రూ ఒక అడుగు ముందుకు వేయాలి. అప్పుడు గంజాయి రహిత భారతం సాధ్యమే. అప్పుడు మన దేశ భవిష్యత్తు వెలుగులవైపు ప్రయాణిస్తుంది. ●

# ప్రజావాక్కు



## ఉపాధ్యాయులకు బోధనేతర పనులు వద్దు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు గత నెలరోజులుగా అనేక బోధనేతర పనులతో ఒత్తిడికి గురవుతున్నారు.యోగాంధ్ర కార్యక్రమం, విద్యాకిట్ల పంపిణీ, మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వహణ తదితర పనులలో నిమగ్నం కావడంతో బోధనకుకుంటుపడుతున్నది. ప్రస్తుతం ఉపాధ్యాయులు విద్యార్థులకు ఇవ్వబడిన సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్లవివరాలను యాప్‌లో పొందుపరిచి విద్యార్థులు లేదా వారితల్లిదండ్రులచే బయోమెట్రిక్ వేయవలసిందిగా విద్యాశాఖ సూచిస్తోంది. కానీ పాఠశాలలో బయోమెట్రిక్ డివైస్ లేకపోవడం వాటి వినియోగం గురించి ఎటువంటి అవగాహనఉపాధ్యాయులకు లేకపోవడంతో మరింత ఆలస్యం అయ్యే అవకాశంఉంది. ఉపాధ్యాయులకు ఈ బోధనేతర పనులు వద్దని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

- వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా

## ఆధిపత్య ధోరణి వీలుపడదు

ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధంలో ఆధిపత్య కోణం ఉందనేది కాదనలేని వాస్తవం. ఐతే ఇరాన్‌ను న్యూక్లియర్ బాంబ్ తయారు చేయకుండా ఆపాలి అని అమెరికా నాయకత్వం మార్పుచేసి తమ చెప్పుచేతల్లో పెట్టుకోవ్వాని ఇజ్రాయెల్ ప్రయత్నించి విఫలం అయింది. ఇప్పుడు కనపడుతున్న వాస్తవం ఏమిటి ఇరాన్ తన న్యూక్లియర్ ప్రయోగాన్ని ఆపలేదు సరికదా అది అలాగే కొనసాగిస్తోంది అంటే ఆధిపత్యధోరణి ఇక ఎంతమాత్రం వీలు పడదు అనే కదా అర్థం. ఇక అమెరికా ఒక విఫల నాయకత్వం అయ్యాక చైనా ఆ స్థానం ఆక్రమించాలి అని చూసినా అది సాధ్యపడలేదు.అసలు ఎందుకు ఈరావణ కాష్టం అంటే అమెరికా ఆయు ధాలను అమ్ముకోవాలి.

- భారత అవినాష్, జనగామ

## నూతన విద్యాసంస్కరణలు అవసరం

ప్రతి విద్యాసంస్థలలో ప్రార్థన సమయంలో ఒక లెక్చరర్, ఒక టీచర్ రోజురోజుకు ఒక అంశంపై అవగాహన కల్పించాలి. జనరల్ నాలెడ్జ్ క్విజ్ ముఖ్య విషయం చెప్పాలి. విద్యార్థులవిద్యాభివృద్ధికి విజ్ఞానంఅభివృద్ధి చెందుతుంది. ఈ కార్యక్రమం తెలంగాణ రాష్ట్రప్రభుత్వం తరఫున అమలుచేయాలి. నూతన విద్యా సంస్కరణలు ప్రవేశపెట్టాలి.

- రాపాక రవీందర్, జనగాం

## భద్రత కల్పించాలి

నేడు మన దేశంలో మధ్యతరగతి ప్రజలకు తక్కువ ఖర్చుతో ఇళ్లను, పేదలకు ఉచితంగా ఇళ్లను అందించాల్సిన అవసరం అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకుంది.అభివృద్ధి చెందుతున్న దేశంగా భారతదేశం 100కుటుంబాలకు సురక్షిత నివాసం కల్పించడంలో ముందడుగు వేయాలి. ప్రస్తుతం మధ్యతరగతి ప్రజలు తమ ఆదాయానికి అనుగుణంగా ఇళ్లను కొనుగోలు చేయడం చాలా కష్టంగా మారింది.రియల్ ఎస్టేట్ ధరలు పెరుగుతుండటంతో, తక్కువ వడ్డీ రుణాలు, సబ్సిడీలు, ప్రభుత్వ భూములపై అపార్ట్‌మెంట్లు నిర్మించడం వంటి చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం ప్రత్యేకంగా మధ్యతరగతి ప్రజల కోసం సబ్సిడీ హౌసింగ్‌స్కీమ్‌లు ప్రవేశపెట్టాలి.ఇక బడుగు, బలహీన వర్గాలకు ఉచితంగా ఇళ్లు నిర్మించి ఇవ్వడం ద్వారా వారి జీవితాల్లో స్థిరత, భద్రత కల్పించవచ్చు.

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

## అవినీతి రాజకీయాలు

రాజకీయం అంటే ఒక పవిత్ర వ్యాసాగం. కానీ నేడు రాజకీయం అంటే చీ అనే కాడికి వచ్చింది.నేడు రాజకీయం ప్రక్షాళన చేయాలంటే ఉన్నత విద్యావంతులైన యువతకే సాధ్యం! ముఖ్యంగా నేటి రాజకీయాలలో నీతి, నైతిక విలువలు అనేవి పూర్తిగా అడుగంటిపోయాయి. ఒకవేళ చదువుకున్న యువతకు నేటి రాజకీయాలలో అవకాశం వస్తున్న అది బహు స్వల్పమే అంటే నూటికి కేవలం30శాతం మాత్రమే.అదేమీ దురదృష్టమోగాని ఎక్కువగా నేటిదేశ, రాష్ట్ర రాజకీయాలను అవినీతి మకిలి అంటినవారు, దౌర్జన్యకారులు, ప్రజల ఆస్తులను కొల్లగొట్టే దుర్మార్గపు వ్యవహారశైలి వున్నవారే శాసిస్తుండటం ఈ ప్రజాస్వామ్యానికి సంబంధించి అత్యంత బాధాకరమైన,ఆందోళన కలిగించే విషయం.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాలపల్లి జిల్లా

## భయాన్ని పోగొట్టాలి

ఈ మధ్య కాలంలోజాతీయ, అంతర్జాతీయంగా విమాన ప్రమాదాలుభయాన్ని, ఆశ్చర్యాన్ని కల్గిస్తున్నవి. యాంత్రిక, సాంకేతిక వ్యవస్థ ఎంత గొప్పగా ఉన్నప్పటికి సిబ్బందిలో ఏ వ్యక్తి అయినా వారి తనిఖీ అనివార్యం. కేవలం ఉన్నత సాంకేతికత ఒక్కటే ప్రమాదాలను ఆపలేదు. ప్రతి చిన్న విషయం కాస్త నిర్లక్ష్యం లేకపొరపాటు జరిగితే కోట్ల ధనం, ప్రాణాలు, పోతాయి. నడిపే పైలెట్ మన ప్రాణాలకు అత్యవసర వైద్యుడు.

-బొల్లోజు మేఘనాధం, విశాఖపట్నం

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# గుంటూరు వార్త

## తెనాలి బస్సులతో విసుకు చెందుతున్న ప్రయాణికులు

**తెనాలి, జులై 13 (ప్రభాతవార్త) :** తెనాలి డివిజన్‌లో తెనాలి నుండి పలు ప్రాంతాలకు వెళ్ళే ఆర్టీసి బస్సులు ఎక్కడిక్కడ మొరాయిస్తూ, ప్రయాణికులకు విసుగు పుట్టిస్తున్నాయి. పాతకాలం నాటి ఈ బస్సుల్లో ప్రయాణించా లంటే ప్రయాస పడవలసి వస్తుంది. కొన్ని బస్సులు మార్గం మధ్యలోనే చెడిపోయి, ప్రయాణికులను అర్ధంత రంగా దింపేసి, మరో బస్సుల్లో ప్రయాణించాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ సంఘటన శనివారం వార్త రూరల్ రూరల్ కెమెరాకు చిక్కింది. ఇలా ఎంతకాలం నెట్టుకు రావాలని, ప్రయాణికులు వాపోతున్నారు. డివిజన్ స్థాయిలో కొల్లిపర, గాజుల్లంక, తిప్పలకట్ట, కొత్తూరులంక, తదితర ప్రాంతాలకు డొక్కు బస్సులే శరణ్య మయ్యాయి. ఇప్పటికైనా తెనాలికి కొత్త బస్సులు ఏర్పాటు చేయాలని ప్రజానీకం కోరుతున్నారు.



## ఐఐటీలో సీట్లు సాధించిన కాకాని జెడ్పీ పాఠశాల విద్యార్థులు

నరసరావుపేట, జూలై 13 ప్రభాతవార్త : మండలంలోని కాకాని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఐఐటిలో సీట్లు సాధించారు. భారత స్కౌట్స్ విభాగంలో రాష్ట్రంలోనే ఒకే పాఠశాల నుండి ఏకంగా మూడు సీట్లను కాకాని జెడ్పీ పాఠశాల సాధించింది. మొత్తంగా ఐఐటీలో ఎనిమిది సీట్లను పాఠశాల దక్కించుకుంది. పల్నాడు జిల్లాలోనే ఒకే పాఠశాల నుండి ఎనిమిది మంది ఐఐటి సీట్లు సాధించడం కూడా మరో రికార్డు. సీట్లు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.



## రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

### మంత్రి నాదెండ్ల మనోహర్

**తెనాలి, జులై 13 (ప్రభాతవార్త) :** రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో ముప్పై మంది రైతులకు షుమారుగా నాలుగున్నర లక్షల రూపాయల సబ్సిడీతో కూడిన వ్యవసాయ యంత్రాలు, పనిముట్లు అందించారు. అలాగే ఒక్కొక్కదానికి ఎనిమిదిలక్షల రూపాయల సబ్సిడీతో మండలంలో మూడు డ్రోన్లు మంజూరు చేసి లబ్ధిదారులకు అందించారు. అనంతరం మార్కెట్ యార్డు ప్రాంగణంలోని స్టాల్స్‌ను పరిశీలించారు. ప్రభుత్వ పథకాలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని, కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ రైతులకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అంతే కాకుండా రైతు సంక్షేమానికి ఎల్లప్పుడూ తాను అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సురేష్, పలువురు యార్డు సిబ్బందితో పాటు పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు.



## బాపట్లతో కోటకు అనుబంధం

**బాపట్ల, జులై13, ప్రభాతవార్త:** ప్రముఖ సినీనటుడు కోట శ్రీనివాసరావుకు బాపట్ల తో మంచి అనుబంధం ఉంది. రంగస్థలాన రవళించిన ఎందరో ఈ ప్రాంత కళాకారులతో కలిసి పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది. బాపట్ల కు చెందిన ప్రముఖ రంగస్థల, సినీ నటుడు కెఎస్‌టి సాయితో కోట శ్రీనివాసరావుకు ఎంతో సాన్నిహిత్య ఉంది. కె.ఎస్.టి సాయి శిష్యరికంలో అనేక నాటకాల్లో కోట శ్రీనివాసరావు నటించారు. కేఎస్‌టి సాయి, కోట శ్రీనివాసరావులు వయసులో ఇంచుమించు సమానమే అయినా వీరిద్దరి మధ్య గురు శిష్యుల బంధం కొన్ని దశాబ్దాలుగా కొనసాగుతూ వచ్చింది. కీలకమైన నాటక ప్రక్రియ ప్రస్తావన వచ్చిన ప్రతి సందర్భంలో కోటా శ్రీనివాసరావు కెఎస్‌టి సాయిని సంప్రదించేవారు. అలా వారిద్దరి మధ్య బంధం బలంగా ఏర్పడింది. బాపట్ల కు అనేక సందర్భాల్లో కోట మధురకవి సభా సామ్రాట్ డాక్టర్ కె వి ఎస్ ఆచార్య. రాష్ట్రంలోని ఎన్నో నాటక కళాపరిషత్తులకు వ్యాఖ్యాతగా వ్యవహరించే వారు కెవిఎస్ ఆచార్య. అనేక సందర్భాల్లో కోట శ్రీనివాసరావు ఆచార్యతో కలిసేవారు. ఆచార్యసభా నిర్వహణ కోటా శ్రీనివాసరావుకు ఎంతగానో ఆకట్టుకునేది. ఈ సీమలో మరొక గురువును సంపాదించుకున్నారు ఆ రోజుల్లో కోట శ్రీనివాసరావు. ఇలా బాపట్ల తో ఆయనకు అనుబంధం ఏర్పడింది. కె ఎస్ టి సాయి, కెవిఎస్ ఆచార్య వంటి అద్భుత కళాకారులు ఉన్న బాపట్ల సీమ తనకు ఒక విధంగా కళారంగాన అద్భుతంగా రాణించేందుకు దోహద పడిందని చాలా సందర్భాలలో చెప్పుకొచ్చారు కోట శ్రీనివాసరావు. కోట శ్రీనివాసరావు సోదరుడు కోట శంకర్ రావు బాపట్ల కోన పరిషత్ లో జరిగిన నాటకాల పోటీల్లో పాల్గొన్నారు. ఒక నాటకంలో



బాపట్లలో జరిగిన కళాపరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న కోట శ్రీనివాసరావు (ఫైల్ ఫోటో)

శ్రీనివాసరావు విచ్చేశారు. కె ఎస్ టి సాయి కోటా శ్రీనివాసరావుల మధ్య సుదీర్ఘమైన సంభాషణలు జరిగేవి. ఇదే ప్రాంతానికి చెందిన స్వర్గీయ కేవీఎస్ ఆచార్యకు కోట శ్రీనివాసరావు అత్మీయ అనుబంధం ఉంది. కళాభారతి వార్షికోత్సవ వేడుకలకు, ప్రముఖ రంగస్థల ఘనాపాటి కొర్రపాటి గంగాధర్ రావు జయంతి కార్యక్రమానికి కోట శ్రీనివాసరావు బాపట్ల విచ్చేశారు. రంగస్థల రంగాన బాపట్ల చరిత్ర సువర్ణాక్షరాలతో లిఖించబడిందని ఎన్నో సందర్భాల్లో ఈ ప్రాంతం గురించి కోట శ్రీనివాసరావు వ్యాఖ్యానించారు. ఈ ప్రాంతంలో పుట్టిన కళాకారులు రంగస్థలాన జాతీయ స్థాయిలో రాణించటం ఎంతో గర్వంగా ఉందని కొనియాడారు. కోట శ్రీనివాసరావు. అటువంటి కళాకారుల నడయాడిన గడ్డమీద నిలబడి మాట్లాడటం తన పూర్వజన్మ సుకృతంగా చెప్పుకొచ్చారు కోట. ఈ ప్రాంత వాసి కెఎస్‌టి సాయి లాంటి వారి శిష్యరికంలో ఉండటం తనకు ఎంతో గర్వకారణంగా ఉందని పలుసందర్భాలలో ఆయన తెలిపారు. పాతికేళ్ల క్రితం అక్కినేని నాగేశ్వరరావు 67 వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్ లో జరిగిన ఒక కార్యక్రమంలో అక్కినేని నాగేశ్వరరావు చేతుల మీదుగా కె ఎస్ టి సాయి ఉత్తమ నటుడు అవార్డు అందుకున్నారు. ఆ కార్యక్రమంలో కోట శ్రీనివాసరావు స్వయంగా పాల్గొని తన గురువైన సాయిని అభినందించి ఆశీస్సులు అందుకున్నారు. బాపట్ల గురించి చెప్పుకోవాలంటే మరొక అణిముత్యం కూడా ఆయన పాత్రను పోషించారు. మూడుసార్లు కోట శ్రీనివాసరావు బాపట్ల కు వచ్చారు. నిత్యం తన గురువులతో కోట శ్రీనివాసరావు ఫోన్లో సంభాషిస్తూ ఉండేవారు. స్వర్గీయ కోన ప్రభాకర్ రావు ను కోట శ్రీనివాసరావు ఎంతో అభిమానించేవారు. విభిన్న రంగాల్లో ఆయన ప్రతిభను చూసి ఎంతగానో మెచ్చుకునేవారు కోట శ్రీనివాసరావు. కోన పరిషత్ నాటకాల్లో పాల్గొన్న ప్రతి సందర్భంలోనూ కోన ప్రభాకర్ రావు కీర్తిని కొనియాడే వారు కోట శ్రీనివాసరావు. ఆయన మృతి సినీ రంగానికి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి విచారం వ్యక్తం చేశారు. బాపట్ల రైలుపేటలోని కోట వారి వీధిలో సినీ నటుడు కోట శ్రీనివాసరావుకు అనేకమంది బంధుగణం ఉండేది. చందోలు బండ్లమ్మ దేవస్థానం కార్యనిర్వహణ అధికారిగా ఉన్న ఘంటసాల నరసింహమూర్తి అమరావతి సమీపంలోని తన స్వగ్రామం చాపపాడులో ఏర్పాటు చేసిన గుడి నిర్మాణానికి ఆ రోజుల్లో కోట శ్రీనివాసరావు ఐదువేల రూపాయలు విరాళంగా అందజేశారు. అనాటి సినీ నటుడు బాలయ్యతో కలిసి దేవాలయానికి వచ్చిన కోట శ్రీనివాసరావు అక్కడ జరుగుతున్న నిర్మాణానికి తన వంతు చేయూతను అందజేశారు. ఇది ఒక మధురమైన ఘట్టంగా ఘంటసాల నరసింహమూర్తి నెమరు వేసుకున్నారు. ఆయన మృతి దిగ్భ్రాంతికి గురిచేసిందని అన్నారు.

## నగరంలో వేగవంతంగా అభివృద్ధి పనులు : నగర మేయర్

గుంటూరు తూర్పు, జులై 13 (ప్రభాతవార్త) : కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక నగరంలో అభివృద్ధి పనులు వేగ వంతంగా జరుగుతున్నాయని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. ఆదివారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని 42వ డివిజన్లో 53.00లక్షలతో నవభారత్ నగర్ నందు సిసి డ్రైన్లు నిర్మించుటకు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో ప్రజావసరాల దృష్టిలో పెట్టుకుని స్థానిక ఎమ్మెల్యే పలు అభివృద్ధి పనులు చేయడానికి కృషి చేస్తున్నారన్నారు. డివిజన్‌ల వారీగా మౌలిక వసతుల కల్పనలో స్థానిక ప్రజాప్రతినిధులు ప్రతిపాదనలను పరిగణలోకి తీసుకుని అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం గుంటూరు నగరంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక గుంటూరు నగరంతో పాటు నగరంలో విలీన గ్రామాల్లో కూడా అభివృద్ధి పనులు పార్టీలకతీతంగా ప్రాధాన్యతాక్రమంలో నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ల సహకారంతో గుంటూరు నగరాభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వారి అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో త్రాగునీటి సమస్య లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకున్నామని, ప్రధానంగా నగరంలో పారిశుద్ధ్య సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. నగరంలో చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు ప్రజారోగ్య అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. నగరం రాజధానిలో భాగంగా ఉన్నందున నగరాన్ని శుభ్రంగా ఉంచాలన్నారు. అభివృద్ధి పనులు చేస్తున్న గుత్తేదార్లు పనులను నిర్ధేశిత సమయంలో నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్లు వేములపల్లి శ్రీరామ్‌ప్రసాద్, ఈరంటి వరప్రసాద్, నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది, స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.



## చరిత్ర కలిగిన పాఠశాలలను కాపాడుకోవాలి : ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

### ఘనంగా ఓరియంటల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వజ్రోత్సవాలు

**నరసరావుపేట, జూలై 13 ప్రభాతవార్త :** రామకృష్ణ ఓరియంటల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అన్నారు. ఆదివారం పాఠశాల వజ్రోత్సవాల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో చరిత్ర కలిగిన పాఠశాల ఎందరో జీవితాలకు వెలుగు చూపిందన్నారు. పల్నాడు జిల్లాలోనే ఏకైక సంస్కృత పాఠశాలగా పేరొందిందన్నారు. పాఠశాల అభివృద్ధి కోసం పూర్వ విద్యార్థులు చేస్తున్న కృషి, పట్టుదల ఎంతో సంతోషమన్నారు. అదే విధంగా తనకు, పాఠశాలకు ఎంతో అవినావభావ సంబంధం ఉందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అన్నారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ చదువుకున్న విద్యార్థులు పాఠశాల గౌరవాన్ని పెంచారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు కపలవాయి విజయ్‌కుమార్, యార్డు ఛైర్మన్ పూనాటి శ్రీనివాసరావు, మాజీ మున్సిపల్ ఛైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా, హెచ్ఎం బి.సత్యనారాయణసింగ్, వివిధ ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో పూర్వ విద్యార్థులు హాజరయ్యారు.




## ప్రజా సమస్యల పరిష్కార వేదికను ప్రజలు సద్వినియోగించుకోవాలి : బాపట్ల జిల్లా కలెక్టర్

**బాపట్ల, జులై13, ప్రభాతవార్త:** ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం కలెక్టర్ కార్యాలయం లో జరుగుతుందని ఆయన తెలియజేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మరియు రెవిన్యూ డివిజనల్ అధికారి కార్యాలయాల్లో మరియు తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రజలు అర్జీలను ఇవ్వవచ్చు నని ఆయన తెలియజేశారు. అర్జీదారులు మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసు కోవచ్చని ఆయన తెలియజేశారు. ప్రజా సమస్యలపరిష్కార వేదిక కార్యక్రమం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు జరుగుతుందని ఆయన తెలియజేశారు. అలాగే వారి అర్జీలు నమోదు చేసిన అర్జీల యొక్క స్థితికి సంబంధించి సమాచారం తెలుసు కోవడానికి1100 నేరుగా కాల్ చేయవచ్చునని ఆయన తెలియజేశారు.




## ఎన్నికల్లో అబద్ధపు హామీలిచ్చి ప్రజలకు వెన్నుపోటు : మంగళగిరి వైకాపా ఇంచార్జ్ దొంతి రెడ్డి వేమారెడ్డి

మంగళగిరి, జూలై 13, ప్రభాతవార్త :ఎన్నికల్లో టిడిపి కూటమి అబద్ధపు హామీలిచ్చి.. ప్రజలను వెన్నుపోటు పొడిచిందని వైసిపి మంగళగిరి ఇంచార్జ్ దొంతి రెడ్డి వేమారెడ్డి విమర్శించారు. ఆదివారం గుంటూరు జిల్లా మంగళగిరి ఆత్మకూరు బైపాస్ రోడ్డు నందుగల వైసీపీ పార్టీ కార్యాలయంలో రూరల్ అధ్యక్షుడు నాలి వెంకటకృష్ణ ఆధ్వర్యంలో వెన్నుపోటు దినాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ వేమారెడ్డి మాట్లాడుతూ2014 ఎన్నికల్లో ఇదే చంద్రబాబు అమలు సాధ్యం కాని హామీలను ప్రకటించి గద్దెనెక్కగా, 2019 ఎన్నికల్లో ప్రజలు గద్దె దించారన్నారు. గతంలో చేసిన పొరపాట్లు మరల చేయరనే ఉద్దేశంతో ప్రజలు ఓట్లేసి గెలిపిస్తే, మళ్లీ పాత తరహాలో కూటమి ప్రభుత్వం నమ్మించి ప్రజలను మోసగించిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎన్నికలకు ముందు వాలంటీర్లకు రూ.10వేలు ఇస్తామని చెప్పి నమ్మించి మోసం చేశారని విమర్శించారు. ఇంటింటికి రేషన్ పంపిణీ చేసిన వాహనాలను రద్దు చేశారని, నిరుద్యోగ భృతి ఇవ్వలేదని చెప్పారు. 20 లక్షల మందికి ఉద్యోగాలిస్తామని, మహిళలకు రూ.1500 ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ సూపర్ సిక్స్ తో సహా 143 హామీలతో ప్రజలను నమ్మించి మోసం చేసి అధికారంలోకి వచ్చిన కూటమీ ప్రభుత్వం ఏడాది అవుతున్న ఒక్క హామిని కూడా అమలు చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలకు తమ నిరంకుశ, అరాచక విధానాలను పరిచయం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు నియోజకవర్గ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.




## ప్రజా సేవకుడు జీవీ జన్మదిన వేడుకలు నేడు

**వినుకొండ, జులై13, ప్రభాతవార్త:** పేద ప్రజలకు సేవ చేయడంలోనే నిజమైన ఆనందం ఉందని నమ్మి శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ స్థాపించి గత 25 ఏళ్లుగా వినుకొండ నియోజవర్గంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు 61వ జన్మదిన వేడుకలు నేడు ఘనంగా జరుపుకోనున్నారు. వినుకొండ నియోజకవర్గ ప్రజలతో ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులుకు వీడదీయలేని సంబంధాలు ఉన్నాయి. పార్టీలతో సంబంధం లేకుండా తన వద్దకు సాయం కోసం వచ్చే ప్రతి ఒక్కరికి పని చేస్తారనే మంచి పేరు పొందారు. గత 25 ఏళ్లుగా శివశక్తి ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. వినుకొండ ప్రాంతాన్ని అంధత ్వరహిత నియోజకవర్గంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో నియోజకవర్గంలోని ప్రతి మండలంలో ఉచిత కంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వేల మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించారు. పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలని శివశక్తి ఫౌండేషన్ ద్వారా ఉపకార వేతనాలు ఇతరిత్రా సహాయ, సహకారాలు అందించారు. అగ్ని ప్రమాదం జరిగి నిరాశ్రయులైన కుటుంబాలకు నిత్యవసర సరుకులు ఆర్థిక సాయం అందించి వారికి అండగా నిలిచారు. ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరినీ ఆదుకునే నిస్వార్థ సేవకుడు జీ.వీ ఆంజనేయులు మరిన్ని సేవా కార్యక్రమాలు చేసి నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపించాలని ప్రజలు కోరుకుంటున్నారు.





## నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**గుంటూరు తూర్పు, జులై 13 (ప్రభాతవార్త) :** ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు సోమవారం రెండు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమీషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ఉదయం 9.30నుంచి 10.30గంటల వరకు ఛాంబర్‌లో డయల్ యువర్ కమీషనర్ కార్యక్రమం ఉంటుందన్నారు. 10.30గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక జరుగుతుందని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.






# రాష్ట్రంలో ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదిగేందుకు పి-4 పథకం

**నరసరావుపేట, జూలై 13 ప్రభాతవార్త :** రాష్ట్రంలో ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదిగేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన పి-4 పథకం ఎంతగానో దోహదపడు తుందని తెలుగుదేశంపార్టీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు శౌరయ్య అన్నారు. ఆదివారం ఆయన స్థానిక కార్యాలయంలో మాట్లాడారు. 2029 నాటికి రాష్ట్రంలో పేద కుటుంబం లేకుండా చేయాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్వహిస్తున్న ఎన్నో కార్యక్రమాల్లో కీలకమైనటు వంటి పథకం పి-4 అన్నారు. పబ్లిక్, ప్రైవేట్, పీపుల్స్ పార్టనర్ షిప్స్ తో గ్రామాలలోనూ, వార్డులలో నూ పేద కుటుంబాలను గుర్తించడం, వారికి అవసం మైన చేయూతను ఇవ్వడం, దశలవారీగా వారు ఎదిగేందుకు ఆర్థిక సహకారం అందించడం లక్ష్యమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 15 లక్షల బంగారు కుటుంబాలను బయటకు తీసుకు



రావడమే ఈ కార్యక్రమ లక్ష్యమని తెలియజేశారు. ఇప్పటికే రెండు లక్షల కుటుంబాలను అధికారికంగా గుర్తించడం, 20 వేల కుటుంబాలు వారికి చేయూతనిచ్చే విధంగా అనుసంధానం చేసే కార్యక్రమం ప్రారంభమైంద న్నారు. వ్యాపార వేత్తలు, అంతర్జాతీయస్థాయి సంస్థలు, కార్పోరేట్‌లు ముఖ్యవ ంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపుకు ముందుకు వస్తున్నారని, కూటమి ప్రభుత్వంపై, ముఖ్య మంత్రి పాలనపై వారికి ఉన్న విశ్వాసం గొప్పదని టిడిపి రాష్ట్ర కార్యదర్శి నాగోతు శౌరయ్య పేర్కొన్నారు.

## విజయవంతమైన సాయికృష్ణ మల్టీస్పెషాలిటీ హాస్పటల్ ఉచిత వైద్య శిబిరం

**నకరికల్లు, జూలై 13 ప్రభాతవార్త :** సత్తెనపల్లి నియోజకవర్గం ముప్పాళ్ళ మండలం దమ్మాలపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సాయికృష్ణ మల్టీ స్పెషాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంత మైంది. వివరాలను హాస్పటల్ ఎం.డి. డాక్టర్ సింగరాజు సాయికృష్ణ తెలియజేశారు. వైద్య శిబిరంలో దమ్మాలపాడు పరిసర గ్రామాల ప్రజలు 370 మందికి పైగా వైద్య పరీక్షలను చేయించుకున్నారు. వారికి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు.



బిపి, షుగర్, ఇసిజి, 2డిఎకో, ఊపిరితిత్తుల సామర్థ్యం తెలిపే పరీక్షలను వైద్యులు నిర్వ హించారు. డాక్టర్ సింగరాజు సాయికృష్ణతో పాటు డాక్టర్ సింగ రాజు విద్య, డాక్టర్ ఎ.శివప్రసాద్, డాక్టర్ ఎం.ఎల్.వి .సాయికృష్ణా రెడ్డిలు వైద్యసేవలను అందజేశారు. గ్రామ పెద్దలు శిరిగిరి గోపాలరావు, శిరిగిరి పవన్‌కుమార్, రాజు, శిలార్, మహీపతి బాబు తదితరులు పాల్గొన్నారు.

## కంప్యూటర్ ఉచిత శిక్షణ శిబిరాన్ని సద్వినియోగపరచుకోండి

### డాక్టర్ కొల్లా రాజ మోహన్ రావు

పెదనందిపాడు జూలై 13. (ప్రభాతవార్త) గ్రంధాలయాలు ఆధునిక సామాజిక దేవా లయాలని అవి విజ్ఞాన బాండా గారాలని. గ్రంథాలయ పటణ0 మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అంది పుచ్చుకోవడానికి కంప్యూటర్ ఉపాధ్యాయులు సిద్ధాబత్తుని



వల్ల మానసిక ఉల్లాసం మేధస్సు పెరుగుతుందని ప్రపంచ జ్ఞానం పొందవచ్చని. కామ్రేడ్ కొల్లా వెంకయ్య మెమోరియల్ గ్రంథాలయ వ్యవస్థాపకులు డాక్టర్ కొల్లా రాజమోహన్రావు అన్నారు. ఆదివారం పెద నందిపాడు కొల్లా వెంకయ్య గ్రంథాలయంలో గత కొన్నాళ్లుగా జరుగుతున్న ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులలో ఇప్పటివరకు రెండు బ్యాచీలు శిక్షణ పూర్తి చేసుకుని సర్టిఫికెట్లు అందుకోగా. నేడు శిక్షణ పూర్తయిన మూడు నాలుగు బ్యాచీల విద్యార్థులకు నల్లమడ రైతు సంఘం అధ్యక్షులు డాక్టర్ కొల్లా రాజమోహన్రావు. డాక్టర్ కొల్లా అనిత. మక్కెన జవహర్ రాణి. ఈదర భ్రమరాంబ. లావు చౌదేశ్వరి . గేరా మోహన్ రావులు సర్టిఫికెట్స్ అందజేశారు. అనంతరం రాజమోహన్రావు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు ఔత్సాహికలకు. తమ గ్రంథాలయంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ ఏర్పాటు చేశామని దీనితోపాటు గ్రంథాల యంలో సుమారు 15 వేలు దాకా వివిధ రకాల పుస్తకాలు ఏర్పాటు చేశామన్నారు. ఇంకా గ్రంథాల యంలో సౌకర్యాలు మెరుగుపరి చేందుకు కృషి చేస్తామన్నారు. విద్యార్థులు ప్రజలు ఈ అవకాశాన్నిసద్వినియోగపరచుకోవాలన్నారు. తమ గ్రంథాలయంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ పొందగోరు వారు పూర్తి వివరాలకుఈ ఫోన్ నెంబర్ 7780729517 లో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో కొల్లా వెంకయ్య చౌదరి . బోడావుల హనుమంతరావు. కొల్లా వాసు. లైబ్రేరియన్ నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## గుండిమెడలో సుపరిపాలనలో తొలి అడుగు

తాడేపల్లి,జూలై 13,ప్రభాతవార్త : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తన పాలనను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని టిడిపి తాడేపల్లి మండల మాజీ అధ్యక్షులు కొమ్మారెడ్డి కిరణ్ అన్నారు.ఆదివారం మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని గుండిమెడలో మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో టిడిపి తాడేపల్లి మండల మాజీ అధ్యక్షులు కొమ్మారెడ్డి కిరణ్ ఆధ్వర్యంలో "సుపరిపాలనలో తొలి అడుగు" పేరుతో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా కొమ్మారెడ్డి కిరణ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో ఏడాది కాలంగా కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు నేరుగా వివరించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న సూపర్ 6 హామీల పురోగతిని ప్రజలకు వివరించినట్లు తెలిపారు.సంక్షేమ పథకాల అమలు,కీలక ప్రాజెక్టుల వివరాలను, నియోజకవర్గాల్లో జరిగిన అభివృద్ధి పనులపై ప్రత్యేకంగా ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు.కేవలం ప్రభుత్వ కార్యక్రమాలను వివరించడమే కాకుండా,ప్రజల నుండి అభిప్రాయాలు,సూచనలు కూడా స్వీకరించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ప్రజలు తమ అభిప్రా యాలను పంచుకున్నారు.గత ప్రభుత్వ హాయాంలో సంక్షేమ పథకాల అమల్లో వివక్షను ఎదుర్కొన్నామని, కానీ ఇప్పుడు చంద్రబాబు నాయకత్వంలని కూటమి ప్రభుత్వంలో



సూపర్ 6 పథకాలు ఎలాంటి పక్షపాతం లేకుండా అందరికి సమానంగా అందుతున్నాయని హర్షం వ్యక్తంచేసినట్లు నాయకులు తెలిపారు.ప్రజా భాగస్వామ్యంతో పాలనను మరింత పారదర్శకంగా సమర్థవంతంగా మార్చే దిశగా కార్యక్రమం దోహదపడుతుం దన్నారు. కార్యక్రమంలో టిడిపి గుండిమెడ గ్రామ అధ్యక్షులు చిగురుపాటి సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి నామతోటి రాంబాబు, అనుమోలు వీరాంజనేయ ప్రసాద్, సాంబశివరావు,౽ s.అంకినేయుడు,ఎం.బాబురావు,కె.కుమార్,జె .సతీష్, పి.భార్గవ్ ,కె.నరసింహారావు, కె.శ్రీను, బి.నంతోష,జెట్టి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## రోటరీక్లబ్ నూతన కార్యవర్గం

**నరసరావుపేట టౌన్, జూలై 13 ప్రభాతవార్త :** రోటరీక్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం రోటరీ కమ్యూనిటీహాల్లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డిస్ట్రిక్ గవర్నర్ హరహరప్రసాద్ హాజరయ్యారు. మాజీ అధ్యక్షులు కపలవాయి రాజేంద్రప్రసాద్, సెక్రటరీ



సాతులూరి శివకుమార్, ప్రముఖులు కె.పి.రంగారావు, తాళ్ళ రాజశేఖరరెడ్డి కార్యక్రమంలో పాల్గొన్నారు. రోటరీక్లబ్ అధ్యక్షులు షేక్.కరీమ్ మొహిద్దీన్, సెక్రటరీగా భవనం పుణీంద్రరెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. ట్రెజరర్‌గా ఆంజనేయులు, డైరెక్టర్లుగా జమ్ముల రాధాకృష్ణ, నాగరాజు, ఎస్.కె.జిలానీ మాలిక్, నాగలక్ష్మి, సునీత, వెంకటేశ్వరరావు, ఏపూరి సాంబశివరావు, రాయల శ్రీనివాసరావు, షేక్.మీరావలి, మస్తాన్‌షరీఫ్ పాల్గొని మాట్లాడారు. పోలియో వంటి వ్యాధులు అరికట్టడం కోసం సదస్సులు, దివ్యాంగులకు వీల్‌చైర్స్, కృత్రిమ పరికరాలు, ప్రభుత్వ పాఠశాలలకు మౌలిక వసతులు కల్పించాలని ఈ సందర్భంగా సూచించారు.

## అమ్మవార్లకు ఆషాడ మాసం సారె సమర్పణ

**వట్టిచెరుకూరు 13 జూలై ప్రభాతవార్త :** గుంటూరు జిల్లా, వట్టిచెరుకూరు మండలం,వట్టిచెరుకూరు గ్రామంలోని దేవాలయాల్లో అమ్మవార్లకు భక్తులు ఆషాఢ మాసం సంద ర్భంగా ఆదివారం సారె, చీరెలు సమర్పించారు. గ్రామం లోని మహిళలు ఉపవాస దీక్షలతో గ్రామంలోని పోతురాజు బొమ్మల దగ్గర నుండి బయలుదేరి. గ్రామ దేవతలు శ్రీ అద్దంకమ్మ, పోలేరమ్మ



దేవాలయం మరియు గ్రామంలోని దేవాలయాలకు వెళ్లి అమ్మవార్లకు గ్రామ మహిళలు, ప్రత్యేక పూజలు నిర్వహించి సారె, చీరెలు సమర్పించారు.

## పెదనందిపాడు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాన్ని పెదనందిపాడు బ్రాంచికు అనుసంధానం చేయాలి

**పెదనందిపాడుజులై 13, (ప్రభాతవార్త):** పెదనందిపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాన్ని. గుంటూరు జిల్లా సహకార బ్యాంకు పెదనందిపాడు బ్రాంచ్ కి అనుసందానం చేయాలనీ నాగులపాడు లోని సుభిక్ష సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షులు కొల్లా సీతారామయ్య నేడొక ప్రకటనలో కోరారు. ఈ మేరకు గుంటూరు



జిల్లా కేంద్రసహకార బ్యాంకు చైర్ పర్సన్ మక్కెన మల్లికార్జున్ రావు జిల్లా సహకార అధికారి మరియు ఆంధ్రప్రదేశ్ సహకార సంఘాల రిజిస్ట్రార్ కు వినతి పత్రాలు పంపినట్లు సీతారామయ్య తెలిపారు. గత కొంత కాలం నుంచి పెదనందిపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం జిల్లా కేంద్ర సహకారం బ్యాంకు కాకుమాను బ్రాంచ్ పరిధిలో ఉంటున్నది. పెదనందిపాడు లో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు బ్రాంచ్ ఇటీవల ఏర్పాటు చెశారు. పెదనందిపాడు లోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘము లో పన్నెండు గ్రామాలకు చెందిన పదివేలకు పైగా రైతులు సభ్యత్వం పొంది ఉన్నారు. పది వేల మంది రైతుల సౌకర్యము కోసము పెదనందిపాడు లోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాన్ని జిల్లా కేంద్ర సహకార బాంక్ పెదనందిపాడు బ్రాంచ్ కు అనుసంధానం చేయాలని సీతారామయ్య కోరారు.

## అన్నదాత సుఖీభవ కోసం రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలి

### - పోట్ల నరసింహారావు, మండల వ్యవసాయాధికారి

**కారంపూడి, జులై 13 ప్రభాతవార్త:** ప్రభుత్వం రైతులకు అందించే అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకొని లబ్ధిపొందాలని మండల వ్యవసాయాధికారి పోట్ల నరసింహారావు తెలిపారు. అర్హులైన రైతులంరి జాబితాలు ప్రతి గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో ఉన్నాయని, జాబితాలో పేరు లేని రైతులు వెంటనే మీ గ్రామ వ్యవసాయ ఉద్యాన సహాయకులను సంప్రదించి వెంటనే దరఖాసఉ్తు చేసుకోవాలని తెలిపారు. రైతులందరూ త్వరితగతిన స్పందించి అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ప్రభుత్వం ఇచ్చే రూ.20 వేలు లబ్ధిపొంది, వాటిని వ్యవసాయ పంటల సాగు అవసరాలకు సద్వినియోగం చేసుకోవవాలని కోరారు.



## అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబానికి తెదేపా నేతల ఆర్థికసాయం

**కారంపూడి, జులై 13 ప్రభాతవార్త:** కారంపూడి మండలం ఒప్పిచర్ల గ్రామానికి చెందిన చీమలదిన్నె అంకాలు (75) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శి పంగులూరి పుల్లయ్య రూ.5 వేలు, కొండపల్లి చిన్నఅప్పారావు రూ.2 వేలు మట్టిఖర్చుల కోసం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మృతి చెందిన కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ఒప్పిచర్ల సర్పంచ్ పుష్పలత, శివరామ్, మాదల సత్యనారాయణ, చిరుమామిళ్ల రామలక్ష్మయ్య, చిరుమామిళ్ల శ్రీను, నీళ్ల అంజయ్య, రెబ్బులపల్లి అమరయ్య, దేవరకొండ సుబ్బారావు పాల్గొన్నారు.



## మృతిచెందిన తెదేపా కార్యకర్త కుటుంబానికి ఆర్థికసాయం

కారంపూడి, జులై 13 ప్రభాతవార్త: మండల కేంద్రమైన కారంపూడిలో తెలుగుదేశం కార్యకర్త కుంచవరపు ఈశ్వరమ్మ అనారోగ్యంతో ఆదివారం నాడు మృతి చెందిన విషయం తెలుసుకున్న తెలుగుదేశం నాయకులు ఈశ్వరమ్మ మృతదేహాన్ని సందర్శించి, స్థానిక శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదేశాల మేరకు మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు ఆర్థికసాయంగా అందించారు. కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కారంపూడి పట్టణ తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షులు కటికల బాలకృష్ణ, మస్తాన్‌జానీ, బొల్నీడి కోటేశ్వరరావు, బాలునాయక్, కార్యకర్తలు పాల్గొన్నారు.



# రాష్ట్రాభివృద్ధి సిఎం చంద్రబాబుతోనే సాధ్యం

### - జిల్లా డీసీఎంఎస్ ఛైర్మన్ వడ్రాణం హరిబాబునాయుడు

**పొన్నూరు, జూలై 13,ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ సర్వతోముఖాభివృద్ధి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వల్లే సాధ్యమవుతుందని రాష్ట్ర ప్రజానీకం నమ్మారని, అందుకే టిడిపి అధికారాన్ని కట్టబెట్టారని గుంటూరు



జిల్లా డీసీఎంఎస్ ఛైర్మన్ వడ్రాణం హరిబాబునాయుడు అన్నారు. మండల పరిధిలోని వడ్డిముక్కల గ్రామంలో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్రాణం హరిబాబునాయుడు మాట్లాడుతూ చంద్రబాబునాయుడు విజన్ ఉన్న ముఖ్యమంత్రి అని చెప్పారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో అభివృద్ధి గాడిన పడిందన్నారు. గత పాలకుల పాలనలో రాష్ట్రం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందన్నారు. రాష్ట్రంలో నాడు వైకాపా రాక్షస పాలన సాగించిందన్నారు. టిడిపి పాలనలో ప్రజలందరూ ఎంతో హాయిగా, సుఖంగా ఉన్నారన్నారు. వైకాపా నల్ల జీవోలను తెచ్చి రాష్ట్రంలో ప్రజా కంటక పాలన సాగించిందన్నారు. అందుకే వైకాపాకు ప్రతిపక్ష స్థానం కూడా లేకుండా ప్రజలు తీర్పునిచ్చారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన అన్ని వాగ్దానాలను అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం శక్తివంచన లేకుండా కృషి చేస్తుందన్నారు. మంత్రి నారా లోకేష్ రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారు. రాష్ట్రాభివృద్ధిలో లోకేష్ ప్రధానమైన భూమిక పోషిస్తున్నారన్నారు. తల్లికి వందనం, ఉచితంగా గ్యాస్ సిలెండర్లు, ఫించన్ రూ.4వేలు ఇలాంటి అనేక పథకాలను అమలు చేస్తూ కూటమి ప్రభుత్వం దూసుకెళ్తుందన్నారు. త్వరలో మిగిలిన అన్ని వాగ్దానాలను అమలు చేయడం జరుగుతుందన్నారు. ప్రజలు కూడా సుపరిపాలన అందిస్తున్న కూటమి ప్రభుత్వానికి మద్దతు తెలపాలని, ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. పథకాలు ఏ మేరకు అందాయో అడిగి తెలుసుకొన్నారు. గ్రామంలో పలువురు సమస్యలను విన్నవించారు. అన్ని సమస్యలను త్వరలో పరిష్కరిస్తామన్నారు. డైనమిక్ లీడర్ ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ సారథ్యంలో నియోజకవర్గంలో ఇప్పటికే పెద్ద ఎత్తున నిధులు రాబట్టి అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో ఒక్క సమస్యకూడా లేకుండా ఉండేవిధంగా ఎమ్మెల్యే నరేంద్రకుమార్ కృషి చేస్తున్నారన్నారు. ప్రజలందరూ ఎమ్మెల్యే నరేంద్రకుమార్‌కు ఆశీస్సులు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రీవెన్స్ సెల్ అధ్యక్షునిగా బోయిన ప్రవీణ్‌కుమార్

**పొన్నూరు, జూలై 13,ప్రభాతవార్త:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గ్రీవెన్స్ సెల్ ఫిర్యాదు విభాగం అధ్యక్షుడిగా కొండముది గ్రామానికి చెందిన బోయిన ప్రవీణ్‌కుమార్‌ను పార్టీ అధిష్టానం నియమించింది. పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తుండడంతోనూ, చురుగ్గా పనిచేస్తుండడంతో గ్రీవెన్స్ విభాగంలో నియమించింది. వైకాపా సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ బోయిన నియామకాన్ని సమర్థించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడిగా నియమించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. పార్టీ అభివృద్ధి, మళ్ళీ జగన్మోహనరెడ్డిని ముఖ్యమంత్రిగా చేసేందుకు, పొన్నూరులో అంబటి మురళీకృష్ణ గెలుపుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. నాయకులు, కార్యకర్తలు అందరిని కలుపుకుపోయి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా అంబటి మురళీకృష్ణకు బొకే అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.



## కోట శ్రీనివాసరావుకు గుంటూరు బ్రాహ్మణ సేవాసమితి ఘన నివాళులు

**గుంటూరు విద్య,జూలై 13,ప్రభాతవార్త :** తన విలక్షణ నటనతో తెలుగు సినీ పరిశ్రమలో ప్రత్యేక గుర్తింపు పొందిన మాజీ శాసనసభ్యులు,పద్మశ్రీ కోట శ్రీనివాసరావు కి గుంటూరు బ్రాహ్మణ సేవా సమితి నివాళులర్పిస్తుంది.గత కొని ్న రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న కోట శ్రీనివాసరావు ఆదివారం తెల్లవారుజామున ఫిలింనగర్‌లోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు.ఆయన అకాల మరణానికి చింతిస్తూ వారి పవిత్ర ఆత్మకు మంచి సద్గతి లభించాలని భగవంతుని ప్రార్థిస్తూ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామని బ్రాహ్మణ సేవాసమితి అధ్యక్షులు నందిరాజు పాండురంగారావు కార్యదర్శి రంగావజ్ఝల లక్ష్మీపతి,కోశాధికారి తుళూరు ప్రకాష్,ఉపాధ్యక్షులు మాదల వెంకటకృష్ణ,సభ్యులు పొతూ_రి మురళీమోహన్,కెపి శర్మ,కెవి సాయిబాబు శర్మ,ఆదిరాజు శ్రీధర్,బి.కృష్ణప్రసాద్,వినోద్ కిరణ్ తెలిపారు.

## ఏ విధమైన సైడ్ ఎఫెక్ట్‌లేని శారీరక వైద్యమే ఫిజియోథెరఫీ

**గుంటూరు కల్చరల్,జూలై 13,ప్రభాతవార్త :** ఫిజియోథెరఫీ ఒక శారీరక చికిత్స మాత్రమేనని ఇందులో ఎలాంటి మందుల ప్రమేయం ఉండదని ఏదేని అనారోగ్యం లేదా గాయం తర్వాత శరీరం తిరిగి మామూలై రోగి తన విధులను సక్రమంగా చేసుకునేలా చేయగలిగేది ఫిజియోథెరఫీ అని అవగాహన సంస్థ



ఆధ్వర్యంలో జరిగిన ఆరోగ్యసభలో సీనియర్‌ఫిజియోథెరఫిస్ట్ డాక్ట ర్ ఎం.లక్ష్మీలావణ్య అన్నారు.సంస్థ కార్యాలయంలో నొప్పుల నివారణలో ఫిజియోథెరఫీ పాత్ర అన్న అంశంపై సభ జరిగింది.సభలో డాక్టర్ లక్ష్మీలావణ్య మాట్లాడుతూ నాడీ వ్యవస్థ లోపాలు,కండరాల లోపాలు తదితర సమస్యలున ్నప్పుడు ఫిజియోథెరఫీ చాలా బాగా ఉపకరిస్తుందన్నారు. ఫిజియోథెరఫీ లో చిరోప్రాక్టిక్ సర్దుబాటు ప్రక్రియ అందుబాటులోకివచ్చిందని దిగువ వెన్నునొప్పి ,మెడనొప్పి,తలనొప్పులు లాంటివాటికి చిరోప్రాక్టర్స్ ప్రత్యామా ్నయ చికిత్స పద్ధతుల ద్వారా మెరుగైన వైద్యం అందజేస్తున్నారన్నారు.సభలో అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ డాక్టర్ లావణ్య చిరోప్రాక్టిక్ సర్దుబాటు,కైరోప్రాక్టిక్ చికిత్సలను అద ్భుతంగా అందిస్తూ అందరికి అభిమానం పొందుతున్నారన్నారు.ఆరోగ్యసభానంతరం డాక్టర్ లావణ్యను సంస్థ సభ్యులు ఘనంగా సత్కరించారు.సభలో అనవేమా ట్రస్ట్ అధ్యక్షుడు చల్లా అంజిరెడ్డి, యోగాచార్యులు అచ్యుత ఇందుశేఖర్,డాక్టర్ రవీంద్రకుమార్ లు ప్రసంగించారు.

## మునిసిపల్ కార్మికుల సమ్మెకు ప్రజా సంఘాల మద్దతు

**నరసరావుపేట, జూలై 13 ప్రభాతవార్త :** మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జరుగుతున్న సమ్మెకు ప్రజా సంఘాల నాయకులు ఆదివారం సంఘీభావం తెలియజేశారు. నాయకులు కె.కృష్ణ, నల్లపాటి రామారావు, పి.శ్రీనివాసరావు, షేక్.మౌలాలి, బాదుగున్నల శ్రీనివాసరావు, స్వరూప్ తదితరులు పాల్గొని మాట్లాడారు. సమాజ పనికి సమాన వేతనం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత నెల 6వతేదీన ప్రభుత్వానికి తమ సమస్యలను పట్టించుకొని పరిష్కరించాలని విజ్ఞప్తి చేయడం జరిగిందన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయాలని గతంలో 17 రోజుల సమ్మెకాలపు ఒప్పందాలైన రూ.75 వేలు రిటైర్డ్ బెనిఫిట్స్ పొందాల్సిన అవసరం ఉందన్నారు.

### వరిసాగులో పాముపొడ తెగులు నియంత్రణకు బేయర్ ఫెలుజిత్

**విజయవాడ, జూలై 13, ప్రభాతవార్త :** వ్యవసాయం, ఆరోగ్య సంరక్షణ వంటి జీవశాస్త్ర రంగాల్లో కీలక సామర్థ్యాలు కలిగిన బేయర్ వరిసాగులో పాముపొడ తెగులు నుండి రక్షణకోసం వినూత్న శిలీంధ్ర సంహారిణి ఫెలుజిత్‌ను రూపొందించినట్లు బేయర్ క్రాప్ సైన్స్ విభాగం క్లస్టర్ కమర్షియల్ లీడ్ మోహన్‌బాబు తెలిపారు. జూలై నుండి అన్ని వరిపండించే రాష్ట్రాల్లో లభిస్తుందన్నారు. పొడతెగులుకు కారణమయ్యే రైజోక్టోనియాను విజయవంతంగా ఎదుర్కొంటుందన్నారు.

## అబాకస్‌లో పలువురు చిన్నారులకు ట్రోఫీలు

పొన్నూరు, జూలై 13,ప్రభాతవార్త: రాష్ట్రస్థాయిలో వివిధ స్థాయిలలో ఆన్‌లైన్ ఆఫ్‌లైన్‌లో జరిగిన అబాకస్ పోటీలలో పట్టణానికి చెందిన 18మంది చిన్నారులు ట్రోఫీలు సాధించినట్లు డైరెక్టర్ సాయిచంద్ తెలిపారు. వివిధ స్థాయిలలో మొత్తం 2,500మంది విద్యార్థులకు పైగా హాజరయ్యారు.



పొన్నూరు నుండి 37మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో అత్యధిక ప్రతిభ, ఉత్తమ ప్రదర్శన కనబరచిన విద్యార్థులకు గుంటూరులో జరిగిన కార్యక్రమంలో ట్రోఫీలను అందజేశారు. చిన్నారులకు శిక్షణ ఇచ్చిన శిక్షకురాలు అనూషను పలువురు చిన్నారుల తల్లిదండ్రులు అభినందించారు.

## రూరల్ మండల వాణిజ్యవిభాగం అధ్యక్షునిగా చెట్టుపల్లి

పొన్నూరు, జూలై 13,ప్రభాతవార్త: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వాణిజ్య విభాగం పొన్నూరు రూరల్ మండలం అధ్యక్షుడిగా మామిళ్ళపల్లి గ్రామానికి చెందిన చెట్టుపల్లి వెంకట కృష్ణమూర్తిని నియమిస్తూ పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. చెట్టుపల్లి వెంకటకృష్ణమూర్తి పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తుండడంతో పార్టీ అధిష్టానం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఈ సందర్భంగా వెంకట కృష్ణమూర్తి మాటా ్లడుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. తన నియామకానికి కృషి చేసిన సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ, పార్టీ అధ్ యక్షుడు జగన్మోహనరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ సూచించిన అన్ని కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్ళేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా సమన్వయకర్త మురళీకృష్ణను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.



## కోటా శ్రీనివాసరావుకు బిజెపి ఘన నివాళి

**పొన్నూరు, జూలై 13,ప్రభాతవార్త:** ప్రముఖ నటుడు కోటా శ్రీనివాసరావు మృతి బిజెపికి తీరని లోటని బిజెపి నాయకులు అన్నారు. మండల పరిధిలోని కసుకర్రు గ్రామంలో కోటా శ్రీనివాసరావు చిత్రపటానికి పూలమాలలు వేసి



ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోటా శ్రీనివాసరావు బిజెపి అభివృద్ధికి కృషి చేసిన విధానాన్ని గుర్తు చేసుకొన్నారు. 1999లో బిజెపిలో చేరి విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారన్నారు. సిని రంగంలో తనదైన శైలిలో వ్యవహరించి ప్రేక్షకులు, సిని పరిశ్రమ పెద్దల మన్ననలు అందుకొన్నారు. నివాళులర్పించినవారిలో పూల సుబ్రహ్మణ్యం, పక్కెల కోటేశ్వరరావు, పోతంశెట్టి సాంబశివరావు, నాగిశెట్టి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

## పలువురికి వ్యాస మహర్షి పురస్కారాలు

**పొన్నూరు, జూలై 13,ప్రభాతవార్త:** వేద విజ్ఞానాన్ని ఈ భూమిపైకి తెచ్చి ఎంతో మందికి శిష్యులకు జ్ఞాన సంపదను అందించిన వేదవ్యాసుని గురించి ప్రతి శిష్యులకు జ్ఞాన సంపదను అందించి కార్యోన్ముఖులుగా చేయాలన్నారు. భారతీయ సంస్కృతి, సాంస్కృతిక వైభవాలను, భారతీయ ధర్మాన్ని



ఒక్కరూ తెలుసుకోవాల్సి న అవసరం ఎంతైనా ఉందని తాళ్లాయపాలెం శ్రీ శైవ క్షేత్ర పీఠాధిపతి పూజ్యశ్రీ శివస్వామి అన్నారు. ఆంధ్రప్రదేశ్ హిందూ ఉపాధ్యాయ సమితి ఆధ్వర్యం లో బాపట్ల రోటరీక్లబ్‌లో జరిగిన వ్యాస మహర్షి పురస్కారాల ప్రధానోత్సవ సభలో ఆయన మాట్లాడారు. జ్ఞాన సంపదకు తొలి గురువు, మహాభారతం, భాగవతం, అష్టాదశ పురాణాలు రచించిన వ్యాస మహర్షి జయంతిని పురస్కరించుకొని ఇలాంటి పురస్కారాలు అందించడం ఎంతో అభినంద నీయ మన్నారు. ఉపాధ్యా యినీ, ఉపాధ్యాయులు కూడా గురువు అయిన వ్యాస మహర్షి అడుగుజాడల్లో నడిచి ప్రజల్లోకి తీసుకెళ్లేం దుకు విద్యావంతు లందరూ కృషి చేయాలన్నారు. నిడుబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ పండితులుగా సేవలంది స్తున్న తాటి నరేష్‌కుమార్, అద్దేపల్లి కృష్ణ మోహన్‌లకు పురస్కారా లను అంద జేశారు. అదేవిధ ంగా మాతృభాష అయిన తెలుగుకు సంబంధించి నిడుబ్రోలు జడ్పీ పాఠశాలలో తెలుగు పండితునిగా విద్యా బోధన చేస్తున్న బయ్యా ఉదయ భాస్కర్‌కు వ్యాస మహర్షి పురస్కారాన్ని అంద జేశారు. ఈ సందర్భంగా పురస్కారాలు పొందిన ఉపాధ్యా యులను ప్రధా నోపాధ్యాయు రాలు, ఉపాధ్యా యులు అభినందించారు.

# నోరు అదుపులో లేకపోతే రాష్ట్రం నుండి ప్రజలు తరిమికొడతారు : యాగంటి

మాచర్ల, జులై 13 ప్రభాతవార్త: మాజీ మంత్రి పేర్నినాని, నెల్లూరుకు చెందిన ప్రసన్నకుమార్ రెడ్డిలు నోటికి వచ్చినట్లు మాట్లాడితే జనం రాష్ట్రం నుంచి తరిమి కొడతారని మార్కెట్



యార్డు మాజీ ఛైర్మన్ యాగంటి మల్లికార్జునరావు అన్నారు. ఆదివారం యాగంటి మాచర్ల పట్టణలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యేగా, మాజీ మంత్రిగా చేసిన పేర్ని నాని నోటికి వచ్చినట్లు మాట్లాడి రాష్ట్రంలో అలజడి సృష్టించాలని చూస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో గొడవలు సృష్టించి శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా నాని మాట్లాడటం సిగ్గు చేటని ఎద్దేవా చేశారు. రాత్రిపూట కన్ను కొడితే చేయాల్సిందంతా చేసేయాలని వైకాపా క్యాడర్‌ను రెచ్చగొట్టడం నాని దిక్కుమాలిన రాజకీయానికి నిదర్శనం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ సీఎం జగన్ ఎక్కడికి వెళ్లినా అక్కడ గొడవలు చేయాలని చూడటం వైకాపా నీతిమాలిన రాజకీయానికి నిదర్శనంగా పేర్కొన్నార. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇష్టమొచ్చినట్లు చేయండి నేను చూసుకుంటాను అంటూ నాని మాట్లాడటం హత్యా రాజకీయాలను ప్రోత్సహించడమే అవుతుందన్నారు. వైకాపా క్యాడర్‌ను రెచ్చగొడుతూ రాత్రిపూట ఏదో ఒకటి చేయమని చెబుతున్న నాని నీకు చేతనైతే పగటిపూట రావవాలని సవాల్ విసిరారు. మొన్న ఎలక్షన్‌లో 11 సీట్లయినా వైకాపాకు వచ్చాయి. ఇలా అడ్డగోలుగా మాట్లాడితే ప్రజలే మీ పార్టీకి బుద్ధి చెప్తారని హితవు పలికారు. నెల్లూరులో మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి మహిళల విషయంలో ఇష్టానుసారం మాట్లాడటంతో తగిన శాస్తి మహిళలు చేశారన్నారు. మహిళలను గౌరవించడం చేతకాని ప్రసన్నకుమార్‌రెడ్డికి రాజకీయంగా మాట్లాడే అర్హత ఎక్కడిదని ప్రశ్నించారు. వైకాపాలో అందరూ జగన్ మనస్తత్వం కలవారే ఉన్నారని పేర్కొన్నారు. జగన్ తన సొంత తల్లిని, చెల్లిని అడ్డగోలుగా మాట్లాడుతున్నా పట్టించుకోలేదన్నారు. జగన్ వెనకున్న వాళ్లకు మాత్రం మంచి బుద్ధులు ఎలా వస్తాయని ఎ ద్దేవా చేశారు. తెదేపా చేస్తున్న అభివృద్ధిని చూసి జగన్ విధ్వంసానికి రూపకల్పన చేస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో జరిగిన నష్టాన్ని ప్రజలు గమనించి తెదేపాకు పట్టం కట్టి కూటమి ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించారని పేర్కొన్నారు. అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేయాలనే లక్ష్యంతో జగన్ తన అనుచరులను రెచ్చగొడుతూ ఎక్కడికక్కడ గొడవలు సృష్టించాలని ప్రేరేపిస్తున్నట్లు అర్థమవుతుందని అభిప్రాయపడ్డారు. ప్రతి విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారనే విషయం ఇప్పటికైనా జగన్ తెలుసుకోవాలని చెప్పారు. అడ్డగోలుగా మాట్లాడిన నాని, ప్రసన్నకుమార్‌రెడ్డి విషయంలో పోలీసులు చర్యలు తీసకోవాలని కోరారు. విలేకరుల సమావేశంల మాజీ కౌన్సిలర్ సంతోష్, తిక్కా కొండలు, దుర్భాకుల్ ప్రసాద్, గాజుల ఆంజనేయులు, బాదంబాయి, బొట్టు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# బత్తుల మురళి సేవలను అభినందించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట, జూలై 13 ప్రభాతవార్త : ఆర్‌టిఐ రాష్ట్ర సలహాదారునిగా నియమితులైన ప్రముఖ సామాజికవేత్త బత్తుల మురళిని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు



అభినందించారు. ఆదివారం మండలంలోని ఇస్సపాలెం గ్రామంలోని వాసవి ఆర్యవైశ్య అన్నదాన సత్రంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. బత్తుల మురళీ అందిస్తున్న సేవలను గుర్తు చేశారు. రాష్ట్రస్థాయిలో బాధ్యతాయుతమైనటువంటి పదవిని అందుకోవడం మంచి విషయం అన్నారు. రాష్ట్ర కమిటీ సైతం ఇటువంటి వారిని ప్రోత్సహించడం ద్వారా సమాజానికి మంచి జరుగుతుందన్నారు. ఏమి ఆశించకుండా నిస్వార్థంగా సేవలందించేవారిని తాము ఎప్పుడూ అభినందిస్తామని, చేయూతను అందిస్తానని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మన్ ఎం.ఆర్.శేషగిరిరావు, అజయ్, ప్రసన్నకుమార్, గట్టుపల్లి సత్యనారాయణ, చేగు వెంకటేశ్వరరావు, మార్కెట్‌యార్డు ఛైర్మన్ పూనాటి శ్రీనివాసరావు, రంగిశెట్టి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# వైకాపా జిల్లా అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డికి సత్కారం

నరసరావుపేట టౌన్, జూలై 13 ప్రభాతవార్త : వైకాపా జిల్లా అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డికి ఆదివారం సత్కారం నిర్వహించారు. నియోజకవర్గానికి చెందిన బిసి నాయకులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీకి బిసిలే వెన్నెముక అని తెలిపారు. వైకాపా అంటేనే బిసిల పార్టీ



అన్నారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అశోక్‌కుమార్ ఎంపిక కావడం అభినందనీయమన్నారు. మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి రాష్ట్రానికి ముఖ్యమంత్రిని చేసుకోవడం ప్రతి ఒక్కరి లక్ష్యంగా పని చేయాలని వైకాపా జిల్లా అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు.

# మంద కృష్ణ మాదిగకు చిల్లపల్లి ఘన సన్మానం

మంగళగిరి, జులై 13, ప్రభాతవార్త : పరిశ్రమ, సమాజ సేవ, సామాజిక న్యాయం రంగాలలో తనదైన ముద్ర వేసిన పద్మశ్రీ డా.



మంద కృష్ణ మాదిగ గౌరవించే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ ఎస్సీ ఎస్టీ గెజిటెడ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఆదివారం నాడు మంగళగిరి నియోజకవర్గం, తాడేపల్లిలోని సిఎస్ఆర్ కళ్యాణమండపంలో ఏర్పాటు చేసిన సన్మాన సభకు విశిష్ట అతిథిగా ఏపీఎంఎస్ఐడిసి ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు పాల్గొని ప్రసంగించారు.మంద కృష్ణ మాదిగ ఒక ఉద్యమ నేత.. ఆయనను సన్మానించుకునే అవకాశం కల్పించిన ఆంధ్రప్రదేశ్ ఎస్సీ ఎస్టీ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ వాళ్లకి కృతజ్ఞతలు తెలియజేశారు. జనసేన అధ్యక్షుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు మందకృష్ణ మాదిగ అంటే ప్రత్యేక అభిమానం అని.. అనేక సందర్భాల్లో అసెంబ్లీలో ఆయన గురించి ఆయన ప్రస్తావించిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు ఉద్యమ నేతగా తనకోసం కాకుండా సంఘం కోసం జీవితాన్ని త్యాగం చేసిన వ్యక్తి కి కేంద్ర ప్రభుత్వ అత్యుత్తమ పురస్కారం పద్మశ్రీ రావడం.. సంతోషంగా ఉందని తెలియజేస్తూ ఆయనకి శాలువా కప్పి పుష్పగుచ్చని అందించి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కేఎస్ జవహర్, స్టేట్ జనరల్ సెక్రెటరీ సునీల్ కుమార్, అసోసియేషన్ స్టేట్ ఎంప్లాయ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రమా సూర్యనారాయణ, కెవి రమణ.. పాల్గొన్నారు.

# రాష్ట్రం మెరుగైన పాలన వైపు ముందడుగు

## -వ్యవసాయ మార్కెట్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్

మంగళగిరి, జులై 13, ప్రభాతవార్త : కూటమి ప్రభుత్వం సుపరిపాలనలో అభివృద్ధి సంక్షేమ ఫలాలు ప్రజలకు చేరువటంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారని మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ అన్నారు. ఆదివారం మంగళగిరి మండలం పెద్దవడ్లపూడి గ్రామంలో సుపరిపాలన తొలి అడుగులో



భాగంగా గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ఆత్మీయ పలకరింపుల మధ్య ఏడాది కూటమిపాలనలో ప్రజల మంచి కోసం అందించిన సంక్షేమ ఫలాలు గురించి వివరించి ప్రచార కరపత్రాలను అందజేశారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడగగా, సంక్షేమ పథకాలు అందుతున్నాయని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా జవ్వాది కిరణ్ చంద్ మాట్లాడుతూ ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందించటమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఆయన అన్నారు. కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజలందరూ సంతృప్తిగా ఉన్నారని ఆయన తెలిపారు. ఏడాది కాలంలోనే ఏ ప్రభుత్వం అమలు చేయని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ యువతకు ఉద్యోగ కల్పన ధ్యేయంగా పరిశ్రమలు, కంపెనీలను పారిశ్రామికవేత్తలతో నెలకొల్పిస్తూ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో ఎంతో కృషి చేస్తున్నారని, అదేవిధంగా జాబ్ మేళా నిర్వహించి అనేక వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారని జవ్వాది కిరణ్ చంద్ గుర్తు చేశారు. తల్లికి వందనం పథకం కింద ఇంటిలో ఎంతమంది ఉంటే అంతమంది పిల్లలకు పథకం అమలు చేసి కూటమి ప్రభుత్వం ప్రజల ప్రభుత్వం అని నిరూపించిందని జవ్వాది కొనియాడారు.

# పెదకూరపాడులో శ్రీ అంకమ్మతల్లికి ఆషాడం సారె సమర్పణ

పెదకూరపాడు, జూలై 13 ప్రభాతవార్త : జలాభిషేకాలు పొంగళ్ళు నైవేద్యాలతో తల్లికి ఘనంగా వేడుకలు మండల కేంద్రమైన పెదకూరపాడులో వేంచేసియున్న శ్రీ అంకమ్మతల్లికి ఆదివారం మహిళలు ఆషాడం సారె సమర్పణ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామునే భక్తులు అమ్మవారికి 108 బిందెలతో జలాభిషేకం చేసి భక్తి శ్రద్ధలతో అమ్మవారికి అలంకరణ గావించారు. ఆలయం నుండి మేళతాళాలతో మహిళలు పెద్ద ఎత్తున వీధుల నుండి



శోభయాత్ర నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని 108 రకాల వంటకాలు, వస్త్రాలు, పసుపు, కుంకుమ, గాజులు, పూలుల, పండ్లు, తాంబూలము, ముత్తైదు వాయనములను శ్రీ అంకమ్మతల్లికి సమర్పించారు. ఆలయ అర్చకులు ఎనుముల రాములు, ఎనుముల గంగాధర్ పూజ క్రతువు నిర్వహించారు. శ్రీ అంకమ్మతల్లి దేవస్థానం కమిటీ పర్యవేక్షణలో తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ప్రతి ఏడాది ఆషాడమాసంలో అమ్మవారికి సారె సమర్పణ నిర్వహించడం జరుగుతుందని మహిళలు తెలిపారు.

# రామాపురంలో సుపరిపాలనలో తొలి అడుగు

పెదకూరపాడు, జూలై 13 ప్రభాతవార్త : మండలంలోని రామాపురం గ్రామంలో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఏటుకూరి బ్రహ్మయ్య పాల్గొని



గ్రామంలోని ఇంటింటికి వెళ్ళి కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమాన్ని వివరించారు. అలాగే కరపత్రాలను అందించి ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ నాయకులు భాష్యం ఆంజనేయులు, గల్లా బాబురావు, వడ్లమూడి అప్పారావు, కృష్ణకుమారి, సుజాత, బెల్లంకొండ రామ్‌గోపాల్‌రావు, కొండవీటి ప్రసాదు, యూనిట్ ఇన్‌ఛార్జి, బూత్ కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తాలూకా సెంటర్‌లో ఆక్రమణలు తొలగింపు

సత్తెనపల్లి, జూలై 13 ప్రభాతవార్త : పట్టణంలోని తాలూకా సెంటర్ అన్న క్యాంటీన్ వద్ద ఆక్రమణ షాపులను మున్సిపల్ అధికారులు ఆదివారం



తొలగించారు. తాలూకా సెంటర్ నుండి గుంటూరు వైపు వెళ్ళే ప్రయాణికులకు బస్‌షెల్టర్ లేకపోవడంతో ఎండ, వానకు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అయితే వేసవిలో ప్రయాణికుల కోసం తాత్కాలిక చలువ పందిళ్ళను ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలోనే శాశ్వితంగా బస్ షెల్టర్‌ను ఏర్పాటు చేసేందుకు ఆక్రమణలు తొలగింపు కార్యక్రమాన్ని అధికారులు చేపట్టారు.

# బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్యలో పదవులు

సత్తెనపల్లి, జూలై 13 ప్రభాతవార్త : బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్యలో నూతనంగా సత్తెనపల్లి పట్టణానికి చెందిన పలువురు బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర అధికార ప్రతినిధిగా కోనంకి మారుతి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఏ.ఆర్.రాజశేఖర్‌శర్మ, రాష్ట్ర అర్చక పురోహిత ప్రతినిధిగా పులుపుల ఫణికుమార్ శర్మ ఎంపికయ్యారు. వారితో పాటు విభజన ప్రతినిధిగా బెల్లంకొండ నటరాజ్, మహిళా ప్రతినిధిగా అత్తలూరి లక్ష్మి పాల్గొన్నారు. బ్రాహ్మణ ఐక్యవేదిక, వేద గాయత్రీ పురోహిత సంఘం, వివిధ పార్టీలకు చెందిన వారు వారికి శుభాకాంక్షలను తెలియజేశారు.

# కూటమి ప్రభుత్వం గృహ విద్యుత్తు బిల్లుల్లో బాదుడే బాదుడుతో వినియోగదారుల పరేషాన్

ఎ కొండూరు, జులై 13, ప్రభాతవార్త : రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం గృహ విద్యుత్ వినియోగదారులకు ఇచ్చే బిల్లుల్లో బాదుడే బాదుడు వల్ల వినియోగదారులు లబోదిబోమంటున్నారు. గత వైసిపి ప్రభుత్వంలో రద్దు చేస్తామన్న ట్రూ అప్ చార్జీలు గాని, స్మార్ట్ మీటర్లు గాని రద్దు చేయకుండా ఆ భారాలే నెత్తి మీద వేస్తుండటం వల్ల వందల సంఖ్యలో వచ్చే బిల్లులు వేల సంఖ్యలోకి మారడంతో తిరువూరు నియోజకవర్గంలోని ఎ కొండూరు తిరువూరు గంపలగూడెం విసన్నపేట మండల ప్రాంత వినియోగదారులు కూటమి ప్రభుత్వం తమ దుంప తెంచుతుందని వినియోగదారులు ప్రభుత్వ చపలచిత్త వైఖరిని తీవ్రంగా విమర్శించారు. ఒకపక్క విద్యుత్ సరఫరాలో దోబూచులాట మరోపక్క విద్యుత్ బిల్లుల బాదుడుతో తమ జీవితాలు ఆర్థికంగా చితికిపోతున్నాయని, ఇకనైనా ఈ విద్యుత్ చార్జీల బాదుడు నుండి తమను రక్షించి ఆదుకోవాలని నాలుగు మండలాల గృహ విద్యుత్ వినియోగదారులు తెలుగుదేశం కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికుల కనీస వేతంన పెంచాలి

బాపట్ల,జులై13,ప్రభాతవార్త: మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.26000 లకు పెంచాలని సిఐటియు జిల్లా కార్యదర్శి మజుందారు డిమాండ్ చేశారు.బాపట్లలో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు ఆదివారం అర్ధరాత్రి నుండి సమ్మెబాట పట్టారు. పురపాలక సంఘంలో విద్యుత్తు త్రాగునీరు ఇతర ఇంజనీరింగ్ విభాగంలో సేవలు నిలిచిపోయాయి. కార్మికులు విధులను బహిష్కరించి మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు



చేసిన సమ్మె శిబిరంలో బైఠాయించారు.సిఐటియు ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మెలో పాల్గొన్న కార్మికులు తమ న్యాయమైన సమస్యలు పరిష్కారం అయ్యేవరకు విధుల్లోకి హాజరయ్యేది లేదని తీర్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు కనీస వేతనంరూ 26000 లకు పెంచాలని డిమాండ్ చేశారు.తమ సమస్యలు పరిష్కరించాలని కార్మికులు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోలేదని మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చాలీచాలని జీతాలతో జీవనం సాగించలేక ఆర్థిక ఇబ్బందులకు లోనవుతూ మైక్రో ఫైనాన్స్ సంస్థల దగ్గర అప్పులు తీసుకొని అధిక వడ్డీలతో అప్పులు తీర్చలేక మానసికంగా ఇబ్బందులు పడుతూ అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. నిత్యవసర వస్తువుల ధరలు పెరిగిపోతున్నాయని, చాలీచాలని జీతాలు, కుటుంబంలోని తల్లిదండ్రులకు అనారోగ్యపరమైన సమస్యలతో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు నిత్యం ఆర్థికపరమైన సమస్యలు ఎదుర్కొంటూనే ఉన్నారు. ఈ సమస్య తీరాలంటే సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ప్రతి కార్మికుడికిరూ 26 వేలు వేతనం ఇవ్వాలన్నారు . తప్పని పరిస్థితుల్లో సమ్మెలోకి దిగాల్సి వచ్చిందని మజుందార్ తెలిపారు.ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. శిబిరంలో సిఐటియు నాయకులు శరత్, జిల్లా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు యూనియన్ నాయకులు రత్నం,నాని,అశోక్, పట్టణ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు మురళీకృష్ణ,హరిబాబు, వెంకటేశ్వర రెడ్డి, సాంబిరెడ్డి,ప్రమీల,నరేష్ పాల్గొన్నారు.

# ప్రతి ఇంటికీ సుపరిపాలన చేరువకావాలి : ఎమ్మెల్యే నసీర్

గుంటూరు తూర్పు, జులై 13 (ప్రభాతవార్త) : ప్రతి ఇంటికీ సుపరిపాలన చేరాలని, ఈ విషయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలే వారధులని తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. ఆదివారం స్ధానిక ఎమ్మెల్యే కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే నసీర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ



రాష్ట్రంలో సీఎం చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో సుపరిపాలన అందించామని, దీనిపై ప్రతి ఒక్కరికీ తెలిసేలా ప్రచారం నిర్వహించాలని సూచించారు. కూటమి ప్రభుత్వం చేసిన మంచిని ప్రతి గడపకు తీసుకెళ్లే బాధ్యత కేడర్‌దేనని స్పష్టం చేశారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టామని, దీని గురించి విస్తృతంగా చర్చ జరగాలని సూచించారు. ఈ ప్రాంతాలల ఏ సమస్య వచ్చినా ముందుగా నాయకుల దృష్టికి రావాలని తెలిపారు. ప్రజలు స్వయంగా తనను కలిసే ముందు నాయకుల ద్వారా తమకు సమాచారం అందించాలని చెప్పారు. సూపర్ సిక్స్ హామీలను ఇప్పటికే 80శాతం పూర్తి చేశామని, దీని గురించి ప్రజలకు చెరువ కావాలని చెప్పారు. తల్లికి వందనం లబ్ధిదారులు సంతోషంగా ఉన్నారని, ఇంకా ఎవరికైనా అర్హులకు అందకపోతే వెంటనే నాయకులు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాబోయే నాలుగేళ్ళలో గుంటూరు తూర్పు నియోజకవర్గాన్ని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దే బాధ్యత అందరిపై ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ వార్డు ప్రెసిడెంట్లు, డివిజన్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైకాపా యువజన విభాగం పల్నాడు జిల్లా కార్యదర్శిగా బైరెడ్డి బసివిరెడ్డి

కారంపూడి, జూలై 13 ప్రభాతవార్త: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం పల్నాడు కార్యదర్శిగా కారంపూడి మండలం గాదెవారిపల్లెకు చెందిన బైరెడ్డి బసివిరెడ్డిని నియమిస్తూ వైసీపీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. బైరెడ్డి బసివిరెడ్డి వైసీపీలో చురుకైన కార్యకర్తగా పనిచేస్తూ మాచర్ల నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో మంచి గుర్తింపు పొందారు. పార్టీ అభివృద్ధికి బసివిరెడ్డి చేస్తున్న కృషిని గుర్తించి పల్నాడు జిల్లా వైకాపా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సిఫార్సు మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం బసివిరెడ్డిని జిల్లా యువజన విభాగం పల్నాడు జిల్లా కార్యదర్శిగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది.



ఈ సందర్భంగా బసివిరెడ్డి మాట్లాడుతూ తమ నియామకానికి మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. పల్నాడు జిల్లా యువజన విభాగం జిల్లా కార్యదర్శిగా నియమితులైన బసివిరెడ్డిని వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కొమ్మిరెడ్డి ఎర్రగురవారెడ్డి, పల్నాడు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు కొమ్ము చంద్రశేఖర్, సోషల్ మీడియా కన్వీనరు జక్కిరెడ్డి, నాగిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు కొంగర సుబ్రహ్మణ్యం, యువజన విభాగం మండల అధ్యక్షులు చిలుకూరి చంద్రశేఖరరెడ్డి, తదితర వైసీపీ నాయకులు బసివిరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

# మధ్యాంధ్ర రామకృష్ణ వివేకానంద భావ ప్రచార పరిషత్ సమావేశం

మాచర్ల, జులై 13 ప్రభాతవార్త: మధ్యాంధ్ర రామకృష్ణ, వివేకానంద భావ ప్రచార పరిషత్ సంస్థాగత సమావేశం గుంటూరు జిల్లా కర్లపాలెంలో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో మాచర్ల శ్రీరామకృష్ణ సేవాసమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి పాల్గొన్నారు. సేవాసమితి ద్వారా మాచర్ల పట్టణం,



తదితర గ్రామ ప్రజలకు చేసిన సేవా కార్యక్రమాల గురించి ప్రసంగించారు. సేవా కార్యక్రమాల నివేదికను స్వామీజీలకు అందించారు. ఎవరూ చేయని విధంగా కార్యక్రమాలు చేస్తున్న శ్రీరామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డిని ఈ సందర్భంగా స్వామీజీలు అభినందించారు. ఈ కార్యక్రమంలో 32 సేవా సమితుల ప్రతినిధులు హాజరయ్యారు.

# చెస్ జట్ల ఎంపిక

మాచర్ల, జులై 13 ప్రభాతవార్త: పల్నాడు జిల్లా చెస్ డెవలప్‌మెంట్ అసోసియేషన్, ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా అండర్-13 చెస్‌జట్ల ఎంపిక పోటీలను మాచర్లలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో నిర్వహించారు. ఈ పోటీలలో బాలుర విభాగంలో మొదటి రెండు స్థానాల్లో కె.ఎస్.మోజెస్, కేజే మాగ్నస్‌లు నిలిచారు. బాలికల విభాగంలో బి.మేఘశ్రీకోమలి, ఎం.శ్రావ్యలు గెలుపొందారు. ఈ నలుగురు ఆగస్టు 2, 3 తేదీల్లో మంచిలీపట్నంలో జరిగే అండర్-13 రాష్ట్ర స్థాయి పోటీల్లో పల్నాడు జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని పల్నాడు చెస్ అకాడమీ కోచ్ కిరణ్ తెలిపారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి అకాడమీ కోచ్ కిరణ్ మాట్లాడుతూ చిన్నతనం నుంచే చదరంగం నేర్చుకోవడం వల్ల ప్రతి పని మీద ఏకాగ్రత ఉంటుందని, తద్వారా చదువు కూడా సులభతరంగ అర్థం చేసుకోవచ్చ న్నారు. ప్రతి విద్యార్థి చదువుతోపాటు వారికి నచ్చిన విభాగా ల్లో ఆటలు, పాటలు, క్రీడల్లో పాల్గనడం ద్వారా అనుకున్న లక్ష్యాన్ని సాధించగ లరని తెలిపారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమ తులు ప్రదానం చేశారు. ఈ కార్యక్ర మంలో చెస్ కోచ్ కిరణ్,పాఠశాల ప్రిన్సిపల్, యాజ మాన్యం, యూనివర్శల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఎం.వీరాంజ నేయులు, వేణు, పాపారావు, పాఠశాల సిబ్బంది, క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# దబ్బకూటి నాగరాజు మృతి బాధకరం


బాపట్ల,జులై13,ప్రభాతవార్త: జిల్లా బీసీ సంక్షేమ సంస్థలో అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ కార్యదర్శిగా సేవలందించిన ప్రముఖ నాయకుడు, వెంకట శివ నాగరాజు (వయసు 56) శనివారం రాత్రి అనారోగ్యంతో అకాలమరణం చెందారు. ఆయన మృతి పట్ల బీసీ సామాజిక వర్గంలో తీవ్ర సంతాపం వ్యక్తమవుతోంది.ఆదివారం మధ్యాహ్నం బాపట్లలోని ఆయన నివాసంలో పార్థివ శరీరాన్ని బీసీ సంక్షేమ సంఘం నాయకులు, కుటుంబసభ్యులు, ఆప్తులు,మిత్రులు సందర్శించి, కుటుంబానికి సానుభూతి తెలిపారు.నాగరాజు చేసిన సేవలను పలువురు కొనియాడారు.బిసి వసతి గృహ అభ్యున్నతికి ఎంతగానో కృషి చేశారు.ఆయన అకాల మృతి బాధకరమని పలువురు తీవ్ర సంతాపాన్ని తెలియజేసి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని కోరారు.



దబ్బకూటి నాగరాజు (ఫైల్ ఫోటో)

# బాపట్లలో అందకారం

బాపట్ల,జులై13,ప్రభాతవార్త: మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు సమ్మెబాట పట్టడంతో బాపట్ల ఆదివారం రాత్రి అందకారంగా మారింది.కార్మికుల సమ్మెకారణంగా విధులలో పాల్గొనకపోవడంతో ప్రధానంగా మున్సిపల్ కార్యాలయం పరిసర ప్రాంతాలన్నీ అందకారంగా మారాయి.అదే విధంగా పట్టణంలో త్రాగు నీరుకూడ ఇబ్బంది కలుగుతుందేమో అని ప్రజలు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. కార్మికుల సమస్యలను పరిష్క రించాలని కోరడం వారి హక్కులకు సంబంధించిన విషయమే అయినప్పటికి పట్టణంలో ప్రధానంగా మంచినీరు, విద్యుత్‌కు తీవ్ర అంతరాయం ఏర్పాడి ప్రజలు అనేక ఇబ్బందులకు గురైయే అవకాశం ఉంది.



# సేవాభావంతో కృషి చేస్తున్న సన్ సంస్థ అభినందనీయం : కెఎస్ లక్ష్మణరావు

గుంటూరు తూర్పు, జులై 13 (ప్రభాతవార్త) : ఉన్నత విద్యను అభ్యశిస్తున్న విద్యార్థులు సేవాభావంతో పేద విద్యార్థులను, అనాథ



బిడ్డలను అంగ వైకల్యంతో విద్యను అభ్యశిస్తున్న ప్రతిభ గల విద్యార్థులకు తోడ్పాటు అందించడానికి స్టూడెంట్స్ యూనియన్ ఫర్ ఇండియా చేస్తున్న కృషి అభినందనీయమని మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు పేర్కొన్నారు. గుర్రం జాసువా విజ్ఞాన కేంద్రం హాలులో ఆదివారం సన్ సంస్థ 12వ వార్షికోత్సవం సన్ సంస్థ వ్యవస్థాపకుడు యశ్వంత్ నేతృ త్వంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భం గా కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ 2013లో ప్రారంభమైన సన్ సంస్థ గత 12సంవత్సరాలుగా గుంటూరు జిల్లాలో ప్రతిభ గల వందలాది పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ ఇస్తూ చేయూత అందిస్తుందన్నారు. విద్యార్థి దశలోనే యశ్వంత్‌సాయి, ఆదిశేష లాంటి విద్యార్థులు ముందుకు వచ్చి సన్ సంస్థను స్థాపించి విద్యార్థి లోకానికి ఆదర్శ ప్రాయులుగా నిలిచారన్నారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ అక్షరాస్యతలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అట్టడుగున 36వ స్థానంలో ఉండటం దురదృష్టకరమన్నారు. సన్ సంస్థ వ్యవస్థాపకులు యశ్వంత్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు రూ.5లక్షలు స్కాలర్ షిప్‌లను 12వ వార్షికోత్సవ సందర్భంగా అందిస్తున్నామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో హిందూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ సెక్రటరీ సిహెచ్. రామకృష్ణమూర్తి, నేస్తం వ్యవస్థాపకులు జలీల్ అహ్మద్, అపెక్స్ వ్యవస్థాపకులు కె.నాగేశ్వరరావు, సీనియర్ సాఫ్ట్వేర్ ఇంజనీర్ దిలీప్, జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు డి.ప్రసాద్, సామాజిక విశ్లేషకులు టి.ధనుంజయరెడ్డి, తదితరులు మాట్లాడారు. 25మంది ప్రతిభ గల విద్యార్థులకు రూ.5లక్షలు విలువైన స్కాలర్‌షిప్‌లను అందించారు. దాదాపు 200మంది విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరయ్యారు.

# మున్సిపల్ కార్మికుల సమ్మెకు సిపిఎం మద్దతు

## -కర్మికుల సమస్యలు పరిష్కరించి సమ్మె విరమింప చేయాలని డిమాండ్

గుంటూరు తూర్పు, జులై 13 (ప్రభాతవార్త) : నేటి నుండి రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు తమ సమస్యలు పరిష్కరిం చాలని కోరుతూ నిరవధిక సమ్మెకు పూనుకున్నారు. ఈ సమ్మెను సీపిఎం పార్టీ సంపూర్ణంగా బలపరుస్తుందని ప్రభుత్వం వెంటనే స్పందించి వారి సమస్యలు పరిష్కరించాలని గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది కాలంగా మున్సిపల్ కార్మికులు ప్రత్యేకించి ఇంజనీరింగ్ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వివిధ రూపాలలో ఆందోళన నిర్వహిస్తూ వచ్చారన్నారు. సమస్యలు పరిష్కరించక పోతే జులై 12వ తేది అర్ధరాత్రి నుండి నిరవధిక సమ్మెకు వెళ్ళాల్సి ఉంటుందని, ముందుగానే చట్టబద్ధమైన సమ్మె నోటీసు ఇచ్చారు. అయినప్పటికీ వారి సమస్యలు పరిష్కారం చేసే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అధికారులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించేయడంతో అనివార్యమైన పరి స్థితులతో సమ్మెకు పూనుకోవాల్సి వచ్చింద న్నారు. జీవో నెంబర్ 36ను ఇంజనీరింగ్ కార్మికులకు కూడా వర్తించే విధంగా చర్యలు చేపట్టాలని, రిటైర్మెంట్ వయస్సు 62ఏళ్ళకు పెంపుదల చేయాలని, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, 2023 డిసెంబర్లో 17రోజల పాటు జరిగిన సమ్మె సందర్భంగా ప్రభుత్వంతో జరిగిన ఒప్పదం మేరకు రిటైర్మెంట్ అనంతరం చెల్లించే సర్వీసు పరిహారం పెంపుదల జీవో, మట్టి ఖర్చుల పెంపుదల జీవో, విధి నిర్వహణలో ఉండి చనిపోయిన సందర్భంగా కార్మికులకు ఇచ్చే పరిహారం పెంపుదల జీవోలు ఇవ్వాలని కోరుతున్నారు. సమ్మె ప్రారంభం అయిన తర్వాత అధికారులను, అధికార పార్టీ పెద్దలను వినియోగించుకుని సమ్మె చేస్తున్న కార్మికులను అదిరించి, బెదిరించి, లొంగదీసుకునే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తున్నది. ఇలాంటి చట్ట విరుద్ధమైన చర్యలను ప్రబుత్వం పాల్పడటం సరైంది కాదని, తక్షణమే యూనియన్ నాయకులతో చర్చించి వారి సమస్యలు పరిష్కారం చేసి సమ్మె విరమింపచ సేందుకు తగు చర్యలు చేపట్టాలని సీపీఎం డిమాండ్ చేస్తుందన్నారు.

# తెర



## చలన చిత్ర యవనికపై
# చెరగని జ్ఞాపకం

**విజయవాడ, జూలై 13, ప్రభాతవార్తప్రతినిధి:** 'నటన,జీవితం వేర్వేరు అనే భావన వదిలి పెట్టాల్సిన అవసరాన్ని కళాకారులు గుర్తిస్తేనే రంగస్థలం మీదైన..చలనచిత్ర పరిశ్రమలోనైనా నటించగలం' దివంగత నట దిగ్గజం కోట శ్రీనివాసరావు ఓ ముఖాముఖి కార్యక్రమంలో అన్న మాటలు ఇవి. జీవితంలో ప్రతి ఘట్టాన్ని ఆకళింపు చేసుకుంటూ ఎదిగినప్పుడు నటనలో అందులో అంతర్భాగమవుతుంది.నటనలో సజీవకత తొణికిసలాడుతుందని కోట శ్రీనివాసరావు అభిప్రాయపడేవారు.అందుకే ఆయన చలనచిత్ర రంగంలో దమ్మున్న నటుడిగా నిలిచారు, రాణించారు. సినిమా రంగాన్ని, రాజకీయరంగాన్ని శాసించిన దిగ్గజ నటులను పోలిన పాత్రల్లో నటించి, మొర ఎత్తుకుని పరిశ్రమలో నిలిచారు. మండలాధీశుడు వంటి చిత్రాల్లో ఆయన నటించినప్పుడు ఇక ఈ పని జౌట్ అన్న వారిని సైతం ఆశ్చర్యపరుస్తూ ఆయన చిత్రయానం అప్రతిహతంగా నడిచింది. వేషం పోతుందనో, దాడులు జరుగుతాయోనని ఆయన ఎప్పుడు భయపడలేదు. నువ్వు నటిస్తున్న పాత్ర ఫలానా వ్యక్తిని పోలిన పాత్ర అని చెప్పిన ఆయన వెనుకంజవేయలేదు. అందుకే కోట నటన నిఘంటువు సైతం వెతుక్కోలేని పదంగా మారింది. విలన్, హాస్యనటుడిగా, గుణచిత్ర నటుడిగా ఆయన తనదైన మార్కు నటన చూపారు. నటన రంగంలో దీవించిన దేవుడు జీవితంలో దెబ్బ కొట్టాడంటూ కోట వాపోయిన జీవన సందర్భం ఉంది. అదే సినిమాల్లో ఆయన వారసుడి నిలదొక్కుంటున్న కోట కుమారుని దుర్మరణం.జీవితం నన్ను కోలుకోలేని దెబ్బకొట్టింది. నటన ఆకాశానికి ఎత్తిదంటూ ఆయన అనేక సందర్బంలో కంట తడిపెట్టిన సందర్భాలున్నాయి. బెజవాడ దగ్గర కంకిపాడు అనే ఊరులో జన్మించారు కోట శ్రీనివాసరావు. ఆయన తండ్రి డాక్టర్ కోట సీతారామాంజనేయులు. డిగ్రీ చదువు పూర్తయ్యాక, కోటకు భాగ్యనగరంలోని నారాయణగూడ స్టేట్ బ్యాంకులో ఉద్యోగం లభించింది.ఆయన అప్పటి కృష్ణా జిల్లా ఇప్పటి ఎన్టీఆర్ జిల్లా ఎస్‌బిఐలోను పనిచేసారు. బ్యాంకులో లక్షలు లెక్కబెట్టినా, ఆయన మనసంతా నటనపైనే ఉండేది. నాటకాలపై ఉన్న ఆసక్తితో తరచూ నాటికలు, నాటక ప్రదర్శనల్లో పాల్గొంటూ రంగస్థలంపై తన ప్రతిభను చాటేవారు. కాల క్రమంలో కోటకి రంగస్థలం మాత్రమే కాదు, వెండితెరపై నటించాలన్న తలంపు ఉండేది. ఈ ఆశయంతో చిన్ననాటి కలలను పెద్దదిగా చేసుకుంటూ, ఒకసారి రవీంద్రభారతిలో నాటక ప్రదర్శనలో పాల్గొన్నారు. అప్పుడు దర్శకుడు క్రాంతికుమార్ ఆయన ప్రతిభను గమనించి, ప్రాణం ఖరీదు సినిమాతో కోట శ్రీనివాసరావును చిత్రపరిశ్రమకు పరిచయం చేశారు. అక్కడినుంచి కోట నట ప్రయాణం మరో దశ తిరిగింది. అభ్యుదయ దర్శకుడు టి. కృష్ణ రూపొందించిన ప్రతిఘటన చిత్రంతో కోటకు ప్రత్యేక గుర్తింపు వచ్చింది.ప్రతిఘటన కోట నట జీవితానికి మలుపు.."తమ్మీ నేను మినిస్టర్ కాశయ్యను మాట్లాడతాండ.. అంటూ ప్రతిఘటనలో తెలంగాణ యాసలో పలికిన కోట శ్రీనివాసరావు డైలాగ్స్ అప్పట్లో ప్రేక్షకులను రంజింపజేశాయి. ప్రతిఘటన సినిమాలో గుడిసెల కాశయ్యగా ఆయన నటన తారస్థాయికి ఎదిగింది. సామాజిక చైతన్యాన్ని ఊపిరి పోసిన ఆ చిత్రంలో కోట నటన ప్రేక్షకులను మరిచిపోలేని రీతిలో ఆకట్టుకుంది. ఆ తరువా. వరుస సినిమాల్లో విలన్, కామెడీ పాత్రల్లో తనదైన శైలిని చూపిస్తూ మెప్పించారు.

## అసలైన పేరుతో డ్రిల్ మాస్టారు



మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న లేటెస్ట్ చిత్రాన్ని దర్శకుడు అనిల్ రావిపూడి డైరెక్ట్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాను పూర్తి కామెడీ ఎంటర్ టైనర్‌గా తనదైన ట్రీట్మెంట్‌తో రూపొందిస్తున్నాడు దర్శకుడు అనిల్. అయితే, మెగాస్టార్ చిరంజీవి కెరీర్‌లో 157వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ సినిమాకు మెగా157 అనే వర్కింగ్ టైటిల్‌తో చిత్రీకరణ చేస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమాకు సంబంధించిన టైటిల్‌పై ఓ వార్త జోరుగా చక్కర్లు కొడుతోంది. ఈ సినిమాలో చిరు ఓ డ్రిల్ మాస్టర్‌గా కనిపిస్తాడు. దీంతో ఈ సినిమాలో ఆయన పేరు శివశంకర్ వరప్రసాద్ గా ఉంటుందని.. అందుకే ఈ సినిమాకు మన శంకర్ వరప్రసాద్ గారు అనే టైటిల్‌ను ఫిక్స్ చేయాలని మేకర్స్ నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ ఇదే నిజమైతే చిరంజీవి ఫ్యాన్స్‌కు ఇది ట్రీట్ అని చెప్పాలి. తన అసలైన పేరుతో మెగాస్టార్ సినిమా వస్తుండటాన్ని వారు ఎంజాయ్ చేస్తారు. ఇక ఈ సినిమాలో నయనతార హీరోయిన్‌గా నటిస్తుండగా భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నాడు.

## మహావతార నరసింహ కోసం గీతా ఆర్ట్స్!

మన ఇండియన్ సినిమా దగ్గర యానిమేషన్ సినిమాలు రావడం అనేదే చాలా అరుదు కానీ ఈ జానర్ లో కూడా డివోషనల్ టచ్ తో కన్నడ నిర్మాణ సంస్థ హోంబళే ఫిలిమ్స్ వారు నిర్మాణం వచ్చిన చిత్రమే మహావతార నరసింహ. భారీ విజువల్స్ అండ్ ఊహించని యాక్షన్ ఎలిమెంట్స్ తో ఆస్యపరిచిన ట్రైలర్ మరిన్ని అంచనాలు పెంచింది. మరి పాన్ ఇండియా లెవెల్లో అనౌన్స్ చేసిన మేకర్స్ ఇపుడు తెలుగు రిలీజ్ పై ఓ అప్డేట్ అందించారు. ఈ సినిమాని మన టాలీవుడ్ దిగ్గజ నిర్మాతల్లో ఒకరైన అల్లు అరవింద్ తన గీతా ఆర్ట్స్ బ్యానర్ పై తెలుగులో భారీ లెవెల్లో విడుదల చేసేందుకు ముందుకొచ్చారు. దీనితో ఈ జూలై 25న మహావతార నరసింహ తెలుగు రాష్ట్రాల్లో గట్టిగానే విడుదల అయ్యేందుకు సిద్ధంగా ఉందని చెప్పవచ్చు. ఇక ఈ సినిమాకి సామ్ సి ఎస్ సంగీతం అందించగా అశ్విన్ కుమార్ దర్శకత్వం వహించారు.



## అందాలకే విందు..



ఇన్నాళ్లు చీరకట్టులో మన పక్కింటి అమ్మాయిలా కనిపిస్తూ సందడి చేసే హైదరాబాదీ బ్యూటీ కుషిత కల్లపు మరోసారి రెచ్చిపోయింది. అచ్చ తెలుగు సోయగం కుషిత కల్లపు రెచ్చిపోయింది. ఎప్పుడూ చీరకట్టులో మన పక్కింటి అమ్మాయిలా కనిపిస్తూ సందడి చేసే ఈ హైదరాబాదీ బ్యూటీ ఎలాంటి డ్రెస్ వేసుకున్నా అందులో ఒదిగిపోయి తన అందంతో ఎదు టి వారిని మెస్మరైజ్ చేసేది. తాజాగా హాలీడే ట్రిప్‌కు వెళ్లిన ఈ బ్యూటీ అక్కడ కేవలం చిన్న గుడ్డ పీలకతో ఎద అందాలను టైట్‌గా బిగించి వీధులన్నీ కలియ తిరుగుతూ కల్లోలం రేపింది. వంటి పై భాగంలో, నడుముపై లైవ్‌లో కలర్ ఫుల్‌గా టాటూస్ వేయించుకుని ఎంజాయ్ చేసింది. అప్పుడప్పుడు చూయించి చూయించనట్లు అందాల ప్రదర్శిస్తూ వచ్చిన ఈ ముద్దు గుమ్మ ఒక్కసారిగా రూట్ మార్చి అందాలను బాహాటంగా పరుస్తూ షాకిచ్చింది.

# నమస్తే తమ్మీ.. ఇక సెలవు



**కోట మృతితో టాలీవుడ్‌లో విషాదం**


**భారీగా తరలి వచ్చి నివాళులర్పించిన తారాగణం**


**40 ఏళ్లపాటు 750కి పైగా సినిమాల్లో నటన**

**కామెడీని మిళితం చేసి విలన్ పాత్రలకు జీవం**

**ప్రతిఘటన, గాయం, తీర్పు, లిటిల్ సోల్జర్స్, గణేష్, చిన్నా, ఆ నలుగురు, పెళ్లైన కొత్తలో చిత్రాలకు నంది అవార్డులు**

తెలుగు సినీమా వేదికపై ఓ కోట నిలిచింది.. ఇప్పుడు అది గడియారాన్ని ఆపేసినట్టు స్థబ్ధమైపోయింది. తెలుగు నటనకు ఒక పాఠశాల, ప్రతి పాత్రను జీవంగా మార్చిన కళాకారుడు... ఆయనే కోట శ్రీనివాసరావు. 1970ల నుంచి తెలుగు తెరపై తన స్వరంతో, నటనతో, శరీర భాషతో మాయ చూపిస్తూ... నవరసాలను ప్రేక్షకుల గుండెల్లోకి పోసిన మేటి నటుడు. సాధారణంగా కనిపించే పాత్రను అసాధారణంగా చేసి చూపించే నైపుణ్యం ఆయన సొంతం. హాస్య పాత్రలలో ఆయనే రాజు. కోట నటించిన ప్రతి సినిమాలో పాత్రకు ప్రాణం పోశారు. ప్రేక్షకుల్ని నవ్వించడమే కాదు, ఆలోచింపజేశారు. నటనా రంగాన్ని గౌరవించాల్సిన విధంగా తీర్చిదిద్దారు. ఆయన ఉన్నప్పుడు సహజ నటన అనే పదానికి అర్థం తెలిసింది. ఆయన వేసిన బాటపై ఎన్నో తరం నటులు నడుస్తున్నారు. నలభై సంవత్సరాల పాటు తనదైన శైలిలో విభిన్న కోణాలలో ప్రేక్షకుల గుండెల్లో చెరగని కోట నిర్మించుకున్న ఆయన ఆదివారం నమస్తే తమ్మీ..ఇక సెలవు అంటూ వీడ్కోలు తీసుకున్నారు. కోట శ్రీనివాసరావు ఇక లేరు అన్న వార్త తెలుగువారిని విషాదంతో ముంచెత్తింది.







కోట శ్రీనివాసరావు విలక్షణమైన అభినయాన్ని తలచుకొని కొందరు ఆయనను మరో నాగభూషణంగా అభివర్ణించారు. కొందరు రావు గోపాలరావుతోనూ, మరికొందరు నూతన్ ప్రసాద్‌తోనూ పోల్చారు. నిస్సందేహంగా కోటతో పోల్చిన వారందరూ ప్రతిభావంతులే. బహుశా, కోట కొన్ని చిత్రాలలో అంతకు ముందు వారు ధరించిన తరహా పాత్రలు పోషించి ఉండవచ్చు. అందువల్ల జనం ఆ మహానటులతో కోటనూ పోల్చారేమో అనిపిస్తుంది. పలువురిని అనుసరించినా, కోట తనకంటూ ఓ ప్రత్యేకమైన బాణీని ఏర్పరచుకున్నారు. వందలాది విలక్షణమైన పాత్రలకు తన సలక్షణమైన అభినయంతో ప్రాణం పోశారు. అందువల్ల కోట తీరే వేరుగా నిలచింది. అలా ప్రేక్షకుల మదిలో ప్రత్యేక స్థానం సంపాదించారు కోట.

**కోట అభినయానికి పెద్ద పీట వేసిన జంధ్యాల**

కోట శ్రీనివాసరావులోని కామెడీ రాజును వెలికితీసింది మాత్రం జంధ్యాల గారే. ఆయన చిత్రాలు కోట అభినయానికి పెద్ద పీట వేశాయి. కోట శ్రీనివాసరావు ప్రతిభను గమనించిన జంధ్యాల తన చిత్రాల ద్వారా కోటకు అవకాశాలు కల్పిస్తూ వచ్చారు. అమరజీవి, బాబాయ్ అబ్బాయ్ చిత్రాల్లో కోటకు చిన్న పాత్రలే ఇచ్చారు జంధ్యాల. ఎలాగైనా జంధ్యాల సినిమాలో నటించేసి పేరు సంపాదించాలని కోట శ్రీనివాసరావు తెగ ప్రయత్నిస్తూండేవారు. కానీ, జంధ్యాల బిగ్ రోల్ ఏదీ ఆఫర్ చేయలేకపోయేవారు. టి.కృష్ణ ప్రతిఘటనలో కాశయ్య పాత్రలో కోట అభినయం అందరినీ ఆకట్టుకుంది. అలాగే జంధ్యాలను సైతం ఆ సినిమా మురిపించింది.

**అహ...నా పెళ్ళంటలో అంచనాలకు మించి**

అయితే కోటలోని నటునికి ఛాలెంజ్ విసిరేలా జంధ్యాల అహ...నా పెళ్ళంట సినిమా కోసం లక్ష్మీపతి పాత్రను క్రియేట్ చేశారు. జంధ్యాల అంచనాలను మించి ఆ పాత్రలోకి పరకాయ ప్రవేశం చేశారు కోట. అందులో పలు సన్నివేశాల్లో కోట పూయించిన నవ్వులు ఈ నాటికీ గుబాళిస్తూనే ఉండడం విశేషం! సురేశ్ ప్రొడక్షన్స్ అధినేత డి.రామానాయుడు నిర్మించిన అహ...నా పెళ్ళంట ఘనవిజయం సాధించింది. ఆ సినిమా విజయోత్సవంలో కోటను ఆకాశానికి ఎత్తేశారు జంధ్యాల.

**తెలుగునేలపైన యాసలన్నిటితో జనం మనసులు గెలిచి..**

నాగభూషణం లాగా కామెడీని మిళితం చేసి పలు చిత్రాలలో కోట విలన్ గా మెప్పించారు. ఆయన లాగే కొన్ని సినిమాల్లో లేడీ గెటప్ లోనూ మురిపించారు కోట. అయితే రెండిళ్ళ పూజారిలో థర్డ్ జెండర్ గా నటించి కోట అలరించిన తీరును ఎవరూ మరచిపోలేరు. రావు గోపాలరావు లాగా కూడా సీరియస్ గా కొన్నిసార్లు, కామెడీతో మరికొన్ని మార్లు ప్రతినాయక పాత్రలు ధరించి ఉండవచ్చు. కానీ, తన గాత్రంతో వైవిధ్యం ప్రదర్శించారు కోట. నూతన్ ప్రసాద్ లాగా వాచికాభినయంతో కోట కూడా మైమరపించారు. అయితే తెలుగునేలపైని యాసలన్నిటినీ అచ్చు ఆ ప్రాంతాల్లోని వారు మాట్లాడే తీరునే వల్లించి జనం మనసులు గెలిచారు కోట. సెగట్రీ... అంటూ రావు గోపాలరావులాగే కోట అభినయించిన దాఖలాలూ ఉన్నాయి. రావు గోపాలరావుకు మల్లె రాజకీయాల్లోనూ రాణించిన వైనమూ కోటలో కనిపిస్తుంది. అయితే ఎవరిని అనుసరించినా, వారి పంథాను మాత్రం అనుకరించకుండా తనకంటూ ఓ ప్రత్యేక బాణీ ఏర్పరచుకున్నారు కోట. అందువల్లే కోట ఇకలేరన్న వార్త తెలియగానే ఇంతమంది మహానటులను గుర్తు చేసుకోవలసి వచ్చింది. వారి సరసన కూర్చోదగ్గ మేటి నటుడు కోట.

**హై కమాండ్ నడిగి చెబుతా..**

ప్రతిఘటనలో కాశయ్య పాత్రలో కోట అభినయం చూసి, కొందరు నటులు గుర్తుకు రావచ్చు. అయితే హై కమాండ్ నడిగి చెబుతా...అని తనదైన వాచకంతో సాగిన కోట నటన ... కాదు ఇతను ప్రత్యేకం అనిపించక మానదు. పిసినారి పాత్రల్లో పైన పేర్కొన్న నటులందరూ అలరించారు.

**ఎక్స్‌ప్రెషన్‌లతో కడుపుబ్బ హాస్యం**

కానీ, గుమ్మానికి కోడిని వేలాడ దీసి చికెన్ బిర్యానీ తింటున్నంత ఎక్స్ ప్రెషన్ ఇచ్చారే ఆ సీన్ లో ఆయనకంటే సీనియర్‌గా జంధ్యాల సినిమాల్లో కనిపించిన సుత్తి వీరభద్రరావును సైతం పక్కకు నెట్టి మార్కులు పట్టేసిన తీరును మరచిపోగలమా? శ్రీకనకమాలక్ష్మి రికార్డింగ్ డాన్స్ ట్రూప్‌లో యెల్లా పాపారావు పాత్రలోనూ కొందరిలా కనిపిస్తారు. కానీ, వారందరికంటే భిన్నంగా వాగ్దాటితో తన బాణీ వేరని తేల్చి పారేస్తారు.

**శివలో విలక్షణంగా మాచిరాజు పాత్ర**

శివలో కితకితలు పెట్టకుండానే మాచిరాజు పాత్రను రక్తి కట్టించారే అది చూడగానే అది కదా విలక్షణమంటే అనిపించక మానదు. జంధ్యాల జయమ్ము నిశ్చయమ్మురాలో సినిమా పిచ్చి పటేల్ గా నటించిన కోటను చూశాక అసలు నిన్ను ఇతరులతో పోల్చలేమయ్యా అని అంగీకరించేస్తారు.

**బాబూ మోహన్‌తో కలిసి టన్నుల కొద్దీ హాస్యం**

ఇక తెలుగునాట దెబ్బలతో అబ్బా అనిపించేలా నవ్వించారు కోట. ఆయనను హీరోలు కొట్టినప్పుడు నవ్వులు పూసేవి. అలాగే కోట, బాబూ మోహన్ కలసి తన్నులతో టన్నుల కొద్ది హాస్యాన్ని తెలుగువారి సొంతం చేసిన తీరునూ మరచిపోగలమా? అంతకు ముందు కొందరు మహానటులు మాయల ఫకీర్లుగా రక్తి కట్టించారు. వారి వికృత వేషధారణ చూసి జనం జడుసుకున్నారు కూడా! అంత కంటే విలక్షణంగా గణేశ్ చిత్రంలో వికృతరూపంతో విలనీని పండించిన కోటకు జనం జేజేలు కొట్టకుండా ఉండలేకపోయారు. కాసులకోసం ఏమైనా చేసే కక్కుర్తి వెధవల పాత్రల్లోనూ కోట అలరించిన తీరు అనితరసాధ్యమే అనిపిస్తుంది. ఆమెలో అలాంటి పాత్రతోనే విధవరాలయిన కొడుకు భార్యనే డబ్బుల కోసం సొంతం చేసుకోవాలని చూసే పాత్రలోనూ కోట మెప్పించారు. ఆ పాత్రలో కోట మెప్పించక పోతే, కట్టుకున్న పెళ్ళామే అతడిని నరికి పారేస్తుంటే అలా జరగాల్సిందే... అని జనం కసిగా అనేవారు కారు.

**భయపెట్టడమూ.. నవ్వించడం రెండు ఆయనకే సాధ్యం..**

కేవలం కితకితలు పెట్టి నవ్వించడం వల్లో, భయపెట్టి ప్రతినాయక పాత్రలు ధరించడం వల్లో కోటను మహానటుడు అంటే అది కొంతే అవుతుంది. ఆయనలోని మరోకోణం పలు చిత్రాలలో కన్నీరూ పెట్టించింది. లిటిల్ సోల్జర్స్, ఆ నలుగురు సినిమాలు అందుకు నిదర్శనం. కోటలోని విలక్షణానికి రంకెలు వేస్తూ నంది ఆయన ఇంట ఎనిమిది సార్లు వచ్చి చేరింది. నాలుగు సార్లు బెస్ట్ విలన్ గా, మూడు సార్లు బెస్ట్ కేరెక్టర్ యాక్టర్‌గా, ఓ సారి బెస్ట్ సపోర్టింగ్ యాక్టర్‌గా నంది అవార్డులను సొంతం చేసుకున్నారు కోట. ఆయన ఇక లేరు అన్న వార్త అభిమానులను ఆవేదనతో ముంచెత్తక మానదు. కానీ, ఆ నటనల కోట ఏనాడూ బీటలు వారదు. భవిష్యత్ లోనూ చెక్కుచెదరని దుర్గంలా నిలచే ఉంటుంది. శ్రీనివాసరావు ధరించిన వందలాది విలక్షణమైన పాత్రలు ఆ కోటను పరిరక్షిస్తూనే ఉంటాయి.

**చిరంజీవితో తొలి సినిమా..**

ఇక మెగా ఫ్యామిలీతో కోట శ్రీనివాసరావుకు ఎంతో అనుబంధం ఉంది. ప్రాణం ఖరీదుతోనే కోట శ్రీనివాసరావు, చిరంజీవి సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. ఇది యాదృచ్ఛికమే అయినా ఇద్దరూ కూడా సినీ ఇండస్ట్రీలో ఎనలేని కీర్తి ప్రఖ్యాతులు సంపాదించారు. ఆ తర్వాత వీరిద్దరు కలిసి ఎన్నో చిత్రాల్లో నటించారు. ఇక చిరంజీవి తమ్ముడు పవన్ కళ్యాణ్‌తోనూ కోటకి మంచి అనుబంధమే ఉంది. పవన్ తొలి చిత్రం అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి చిత్రంలో బాయ్స్ హాస్టల్ వార్డెన్‌గా కోట నటించారు. ఆ తర్వాత వీరిద్దరు కలిసి గోకులంలో సీత.. బద్రి చిత్రాల్లో పవన్‌కి తండ్రిగా నటించారు. అలాగే గబ్బర్ సింగ్, అత్తారింటికి దారేది లాంటి సూపర్ హిట్ చిత్రాల్లోనూ పవన్‌తో కలిసి నటించారు. గబ్బర్ సింగ్ సినిమాలో మందుబాబులం అంటూ కోట ఓ పాట కూడా పాడారు. కోట శ్రీనివాసరావు చివరగా 2023లో వచ్చిన సువర్ణ సుందరిలో కనిపించారు.

**పవన్‌తో ఆఖరి సినిమా?**

నాలుగు దశాబ్దాలకి పైగా తెలుగు సినిమాకి సేవలందించిన కోటా శ్రీనివాసరావు తన చివరి స్క్రీన్ ప్రెజెన్స్ ఈ నెల లోనే రాబోతున్న భారీ చిత్రం హరిహర వీరమల్లు లోనే ఉండబోతుందని తెలుస్తోంది. తాను చిన్న కీలక పాత్ర ఈ సినిమాలో చేసినట్టుగా సమాచారం.

## బావురు మన్న టాలీవుడ్

కోట శ్రీనివాసరావు భౌతిక కాయానికి పలువురు టాలీవుడ్ ప్రముఖులు వాళులర్పించారు. నిర్జీవంగా ఉన్న కోటని చూసి కన్నీటి పర్యంతమయ్యారు.

**కోట లాంటి నటుడు మళ్లీ పుట్టడు : చిరంజీవి**



కోట శ్రీనివాసరావు భౌతికకాయానికి చిరంజీవి నివాళులు అర్పించారు. కోట లాంటి నటుడు మళ్లీ పుట్టడని.. ఆన్ స్క్రీన్‌లోనే కాకుండా ఆఫ్ స్క్రీన్‌లో కూడా చాలా చమత్కారంగా మాట్లా డతారని చిరంజీవి అన్నారు. కోట శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

**రెండ్రోజుల క్రితమే ఫోన్ చేశా: బాబూమోహన్**

ఒకే తల్లికి పుట్టకపోయినా అన్నదమ్ముల్లా కలిసి మెలిసి ఉండేవాళ్లం. ఇద్దరం షూటింగులకు కలిసి వెళ్లి, పక్కపక్క గదుల్లో ఉండే వాళ్లం. ఆయన నా కోసం అన్నం కలిపి తినిపించిన రోజులున్నాయి. రెండు రోజులు క్రితమే ఫోన్ చేశాను. ఇంటికి వస్తా అన్నాను. కానీ నా కోటన్న చెప్పకుండా వెళ్లిపోయాడు .. అంటూ భావోద్వేగానికి గురయ్యారు సీనియర్ కమెడియన్ బాబూమోహన్.

**నటన ఉన్నంత కాలం ఆయన ఉంటారు : బ్రహ్మానందం**



కోట శ్రీనివాసరావు లేరనే విషయాన్ని నమ్మలేకపోతున్నా. వందల సినిమాల్లో కలిసి నటించాం.నేను, కోట, బాబు మోహన్ కలిసి రోజుకు18 గంటలు నటించాం. కోట మరణం తీరని లోటు. నటన ఉన్నంత కాలం ఆయన ఉంటారు. కోట శ్రీనివాసరావు నటరాజపుత్రులు. ఏ విషయాన్నైనా నిర్మొహమాటంగా మాట్లాడే వ్యక్తి. దాదాపు 4 దశాబ్దాల పాటు మేము కలిసి పనిచేశాం..

**కోట కూలిపోయింది : తనికెళ్ల భరణి**

నాటకాలు అంటే కోట శ్రీనివాసరావుకు ఎనలేని ఆసక్తి. అదే సినీ రంగ ప్రవేశానికి పునాది వేసింది. ఆయనతో వ్యక్తిగతంగా దశాబ్దాలకు పైగా పరిచయం ఉంది. సామాన్య మధ్యతరగతిలో పుట్టి అంచలంచెలుగా సినీ శిఖరంగా ఎదిగిన ఆయన ప్రస్థానం ఎంతో స్ఫూర్తిదాయకం. పోషించిన ప్రతి పాత్ర సంపూర్ణ నటుడిగా ఆయనకు గుర్తింపు తెచ్చింది. ఇప్పుడు సినీ పరిశ్రమ కోట కూలిపోయింది. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని కోరుకుంటున్న.

**తీపి జ్ఞాపకాలు: రవి తేజ**

కోట శ్రీనివాసరావు గారిని చూస్తూ, ఆరాధిస్తూ.. ఆయన్నుంచి నేర్చుకుంటూ పెరిగాను. ఆయన నా కుటుంబంలో వ్యక్తిలాంటి వారు. ఆయనతో కలిసి పని చేసిన క్షణాలు.. నాకు తీపి జ్ఞాపకాలు. కోట శ్రీనివాసరావు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నా.

**బాధ మిగిల్చి వెళ్లిపోయారు: సాయి దుర్గ తేజ్**

విలక్షణ నటుడు, శ్రీ కోట శ్రీనివాసరావు గారి మరణం తెలుగు ఇండస్ట్రీకి మాత్రమే కాదు ఇండియన్ సినిమాకు తీరని లోటు. ఎన్నో సినిమాలలో ఆయన నటన అద్భుతం. స్క్రీన్ మీద కొన్నిసార్లు భయపెట్టి.. ఇంకొన్నిసార్లు చిరాకు తెప్పించి.. మరికొన్నిసార్లు కడుపులు చెక్కలయ్యేలా నవ్వించి.. చివరికి ఇలా మనకు బాధ మిగిల్చి వెళ్లిపోయారు కోట.

**ఎప్పటికీ సజీవంగానే ఉంటారు: విష్ణు మంచు**

అరుదైన ప్రతిభ కొద్దిమందికే దక్కుతుంది. ఆయనతో చాలా సినిమాల్లో పనిచేసే అదృష్టం నాకు కలిగింది. మనం ఆయనను శారీరకంగా కోల్పోయి ఉండవచ్చు, కానీ ఆయన కళ, ఆయన నవ్వు, ఆయన ఆత్మ ఆయన అలంకరించిన ప్రతి సన్నివేశంలో సజీవంగా ఉంటాయి.

**కోట అందరికీ నచ్చడు : ప్రకాష్‌రాజ్**

కోట గారి సినిమాలు చూసి చాలా స్ఫూర్తి పొందా., ఎన్నో సినిమాల్లో కలిసి నటించాం. ఆయన అందరికీ నచ్చడు.. ఎవరిని మెప్పించటానికి ప్రయత్నం చేయడని, ఆయనది ఒక ప్రజెన్స్ అని.. తన మాటల్లో ఓ వ్యంగ్యం ఉండేది. ఈమధ్య ఫోన్ చేశానని, మాతో కలిసి ఓ సినిమా సెట్‌లో గడిపారు.

14-7Pg5.qxd:14-7Pg5.qxd 01/01/01 8:59 AM Page 1



# బీహార్ ఓటర్లలో అత్యధికులు
# బంగ్లా, నేపాలీ, మయన్మార్ పౌరులు



## పరిశీలన తర్వాత తొలగిస్తామని ఇసి వెల్లడి

**పాట్నా, జులై 13:** బీహార్‌లో శాసనసభ ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ భారత ఎన్నికల సంఘం ఓటరు జాబితా సమగ్ర సవరణను చేపట్టడం దేశవ్యాప్తంగా దుమారం రేపింది. విపక్షాల ఆందోళనలను తోసిపుచ్చుతూ బీహార్‌లో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ జాబితా సమగ్ర సవరణ ప్రక్రియలో అనేక విషయాలు తెలుస్తున్నాయి. బీహార్‌లో ఇంటింటినీ తనిఖీ చేస్తున్న ఇసి సిబ్బందికి భారీగా బంగ్లాదేశీయులు, నేపాలీలు, మయన్మార్ పౌరులు కనిపించారు. వారి వద్ద ఆధార్, రేషన్ కార్డు, నివాస ధ్రువీకరణ పత్రాలు కూడా ఉన్నాయి. అంతేకాదు వారిలో చాలా మంది ఓటర్ లిస్టులో ఉండే అవకాశం ఉందని ఇసి భావిస్తోంది. అందుకే ఆగస్టు తర్వాత వారిని విచారించి జాబితా నుంచి తొలగిస్తామని తెలిపింది. సెప్టెంబర్‌లో విడుదల చేసే తుది ఓటర్ జాబితాలో విదేశీయుల పేర్లు ఉండవని స్పష్టం చేసింది. ప్రతిపక్షాలకు వచ్చే ఓట్లను తొలగించడానికే కేంద్రప్రభుత్వం కనుసన్నల్లో ఇసి ఈ ప్రక్రియ చేపట్టిందని కాంగ్రెస్ సహా ఇండియా కూటమి పక్షాలు ఆరోపిస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ఆధార్ కార్డును పౌరసత్వ గుర్తింపుగా పరిగణించకపోతే పేదలు, వృద్ధులు ఇప్పటికిప్పుడు కుల, నివాస, జనన ధ్రువపత్రాలు ఎలా తీసుకురాగలరని ప్రశ్నించాయి. పిటిషన్లను విచారించిన సుప్రీం ఓటర్ జాబితా సమగ్ర సవరణ రాజ్యాంగ బద్ధమేనని స్పష్టంచేసింది. అయితే ఎస్ఐఆర్ కోసం ఆధార్ కార్డును పరిగణనలోకి తీసుకోవాలని ఇసికి సూచించింది. ఈ క్రమంలో ఎన్నికల అధికారులు బీహార్‌లో పర్యటిస్తూ ఎస్ఐఆర్ చేపట్టారు. ఇంటింటి తనిఖీల్లో నేపాల్, బంగ్లాదేశ్, మయన్మార్ దేశస్తులు భారీగా బీహార్‌లో ఉన్నారని గుర్తించారు. వారి పేర్లు ఓటర్ జాబితాలో ఉన్నాయా లేదా అన్నది వెల్లడించలేదు. ఆగస్ట్ 1 తర్వాత క్షుణ్ణంగా విచారణ జరుపుతామనీ భారత పౌరులు కానివారి పేర్లేవీ సెప్టెంబర్ 30న విడుదల చేసే జాబితాలో ఉండబోవని అధికారులు తెలిపారు. బీహార్‌లో ప్రస్తుతం 77 వేలమంది బూత్ లెవల్ ఆఫీసర్లు, ప్రభుత్వ సిబ్బంది, రాజకీయపార్టీల కార్యర్తలు పాల్గొంటున్నారు. 7.8 కోట్ల మంది ఓటర్లను వీరు తనిఖీ చేయనున్నారు.

దేశవ్యాప్తంగా సర్వేను నిర్వహించాలని నిర్ణయించింది. చాలారాష్ట్రాల్లో భారీగా అక్రమ విదేశీ వలసదారులు ఉంటున్నారు. వారిలో చాలా మంది ఓటర్‌లిస్టులో ఉండే అవకాశం ఉందని ఇసి తెలిపింది. విదేశీయులను ఓటర్‌లిస్ట్ నుంచి తొలగించేందుకే పక్రియ చేపట్టినట్లు వెల్లడించింది. పశ్చిమ బంగాల్, అసోం, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరిలో ప్రభుత్వాల పదవీకాలం వచ్చే ఏడాది మే కల్లా ముగియనుంది. దీంతో బీహార్ తర్వాత ఆ రాష్ట్రాల్లోనే ఓటర్ జాబితా సమగ్ర సవరణ చేపడతామని ఇసి స్పష్టం చేసింది.



# రాజ్యసభకు మరో నలుగురు ప్రముఖులు

## నామినేట్ చేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

### సీనియర్ న్యాయవాది ఉజ్వల్‌నికం, చరిత్రకారిణి మీనాక్షి జైన్, కేరళ ఉపాధ్యాయుడు సదానందన్, మాజీ దౌత్యవేత్త హర్షవర్ధన్ సింగ్లా నియామకం

**న్యూఢిల్లీ, జులై 13:** రాష్ట్రపతి ద్రౌపదిముర్ము మాజీ విదేశాంగ శాఖ కార్యదర్శి హర్షవర్ధన్ శ్రింగ్లా, ప్రముఖ న్యాయవాది ఉజ్వల్ నికంతో సహా నలుగురిని రాజ్యసభకు నామినేట్ చేశారు. ఈ మేరకు కేంద్రహోంశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ముంబయి ఉగ్రదాడుల కేసులో ఉగ్రవాది కసబ్‌కు ఉరిశిక్షపడేలా ప్రభుత్వం తరఫున ఉజ్వల్ నికం వాదనలు వినిపించారు. రాష్ట్రపతి నామినేట్ చేసిన మిగిలిన ఇద్దరిలో ప్రముఖ చరిత్రకారిణి మీనాక్షిజైన్, కేరళ ఉపాధ్యాయుడు సదానందన్‌లు ఉన్నారు. ఆయా రంగాల్లో వారి సేవలను గుర్తించి రాష్ట్రపతి ఆ నలుగురిని పెద్దల సభలకు నామినేట్ చేశారు. కళలు, సాహిత్యం, ప్రజాసేవ సహా వివిధరంగాలకు చెందిన 12మందిని రాష్ట్రపతి రాజ్యసభకు నామినేట్ చేస్తారు. వారిలో నలుగురి పదవీకాలం ముగియటం వల్ల రాష్ట్రపతి ఆ స్థానాలను భర్తీ చేశారు. రాజ్యసభకు నామినేట్ అయిన నలుగురికీ మోదీ అభినందనలు తెలిపారు. "న్యాయ రంగం, రాజ్యాంగం పట్ల ఉజ్వల్ నికంకు ఉన్న అంకితభావం ఆదర్శప్రాయమైనది. ఆయన గొప్ప న్యాయవాది మాత్రమే కాదు, ముఖ్యమైన కేసులను వాదించడంలో ఆయన ముందు వరుసలో ఉంటారని మోదీ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. తన న్యాయ వృత్తిలో నికం ఎల్లప్పుడూ రాజ్యాంగ విలువలను బలోపేతం చేయడానికి విశేష కృషి చేశారన్నారు. రాష్ట్రపతి ఆయన్ని రాజ్యసభకు నామినేట్ చేయడం సంతోషంగా ఉందన్నారు. శ్రింగ్లా సహకారాన్ని మోదీ ప్రశంసించారు. ఆయన దౌత్యవేత్తగా, మేధావిగా వ్యూహాత్మక ఆలోచనాపరుడిగా రాణించారని మోదీ అన్నారు. గత కొద్ది సంవత్సరాలుగా ఆయన భారతదేశ విదేశాంగ విధానానికి విశేష కృషి చేశారు. జీ20 అధ్యక్ష పదవికి కూడా దోహదపడ్డారు. ఆయన్ని రాజ్యసభకు నామినేట్ చేయడం ఆనందంగా ఉందని మోదీ మరో పోస్ట్‌లో పేర్కొన్నారు. సదానందన్ మాస్టర్ ఉపాధ్యాయుడిగా, సామాజిక కార్యకర్తగా ఆయన ప్రయత్నాలు ప్రశంసనీయం అని మోదీ అన్నారు. యువత సాధికారత పట్ల ఆయనకు చాలా మక్కువ ఉందన్నారు. మీనాక్షి జైన్‌ను రాష్ట్రపతి రాజ్యసభకు నామినేట్ చేయడం చాలా సంతోషకరమైన విషయం అని మోదీ అన్నారు. ఆమె ఒక పండితురాలిగా, పరిశోధకురాలిగా, చరిత్రకారిణిగా తన ప్రత్యేకతను చాటుకున్నారు. విద్య, సాహిత్యం, చరిత్ర, రాజకీయ శాస్త్ర రంగాలలో ఆమె విశేష కృషి చేశారన్నారు. విద్యా రంగంలో ఆమె చేసిన కృషికి గానూ 2020లో పద్మశ్రీ అవార్డును అందుకున్నారన్నారు. భారత రాష్ట్రపతి రాజ్యసభకు 12 మంది సభ్యులను నామినేట్ చేసే అధికారం ఉంటుంది. కళలు, సాహిత్యం, సామాజిక సేవ వంటి రంగాలలో కృషి చేసిన వారిని ఈ స్థానాలకు నామినేట్ చేస్తారు.



## భార్యతో విడాకులను వేడుకగా జరుపుకున్న భర్త

**గువాహతి,జులై 13:** భార్య నుంచి విడాకుల మంజూరు అయ్యాయని అసోంకు చెందిన ఓ వ్యక్తి వింతగా సెలబ్రేట్ చేసుకున్నాడు. 40 లీటర్ల పాలతో స్నానంచేసి సంబరాలను జరుపుకున్నాడు. తాను ఇకనుంచి స్వేచ్ఛగా ఉంటానని అంటున్నాడు. విముక్తికి ప్రతీకగా అసోంలోని నల్బరి జిల్లాలోని ముకల్మువా పోలీస్ స్టేషన్ పరిధిలోని బరలియాపర్ గ్రామానికి చెందిన మాణిక్ అలీకి తన భార్య నుంచి చట్టబద్ధంగా విడాకులు మంజూరైంది. ఈ విడాకుల ద్వారా తనకు విముక్తి కలిగిందని భావించాడు. 40 లీటర్ల పాలతో స్నానం చేశాడు. భార్య నుంచి విముక్తి లభించడం వల్లే ఇలా చేశానని చెబుతున్నాడు మాణిక్ అలీ. ప్రస్తుతం ఈ పాల స్నానం ఎపిసోడ్ అసోంతో పాటు దేశవ్యాప్తంగా వైరల్‌అయ్యింది. తాను పాలస్నానం చేయడానికి గల కారణాలను మాణిక్ అలీ వివరించాడు. తన భార్య ఆమె ప్రియుడితో రెండుసార్లు పారిపోయిందన్నాడు. తన కూతురి భవిష్యత్తు కోసం ఆలోచించి భార్యను రెండు సార్లు క్షమించానని తెలిపాడు. కానీ తన భార్య పదేపదే తన ప్రియుడి పారిపోతోందని, తప్పును మళ్లీ పునరావృతం చేస్తోందని పేర్కొన్నాడు. తాను ఇక భరించలేక భార్య నుంచి చట్టబద్ధంగా విడాకులు తీసుకున్నానని వెల్లడించాడు.

# బీహార్ అసెంబ్లీ ఎన్నికలకోసం నితీశ్ వరాలు

## తాజాగా 100 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్

## 50 లక్షలమంది యువతకు ఉద్యోగ కల్పన



**పాట్నా, జులై 13:** బీహార్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్ననేపథ్యంలో ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ఉచిత పథకాలు, ప్రజలకు సౌకర్యాలు కల్పించడంపై దృష్టి సారించారు. ఇప్పటికే మహిళా రిజర్వేషన్లు, పెన్షన్ పెంపు వంటి నిర్ణయాల తర్వాత ఇప్పుడు రాష్ట్ర ప్రజలకు 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించడానికి ఆయన సన్నాహాలు చేస్తున్నారు. అలాగే రాష్ట్రంలో 50 లక్షలమంది యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. లక్ష్యం పూర్తికావడానికి అత్యంత చేరువలో ఉన్నామని, ఇప్పటివరకూ పదిలక్షలమందికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామని, మరో 39 లక్షల మంది ప్రభుత్వ ప్రోత్సాహంతో ఉపాధి పొందారన్నారు. 2030 కల్లా కోటి మందికి ఉద్యోగకల్పన చేస్తామన్నారు. అలాగే వలసజీవులకోసం మొత్తం 300 అంతర్‌రాష్ట్ర బస్సు సర్వీసులు ప్రవేశపెడతామన్నారు. తాజాగా ఉచిత విద్యుత్ ప్రతిపాదనకు ఆర్థిక శాఖ ఆమోదం లభించింది. అయితే కేబినెట్ ఆమోదం లభించాల్సి ఉంది. కేబినెట్ ఆమోదం తర్వాతే వినియోగదారులు ఈ పథకం ప్రయోజనాన్ని ఎలా పొందవచ్చో తెలుస్తుంది.

ఈ పథకం ముందుగా ఆర్థిక శాఖ ఆమోదం పొందడానికి కారణం దీని ఆర్థిక భారం రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉంటుంది. సామాజిక భద్రత పెన్షన్ పెంపు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ముఖ్యమంత్రి నితీష్ కుమార్ సామాజిక భద్రత పెన్షన్ పథకంలో పెంపును ప్రకటించారు. దీని ప్రకారం పింఛను ఇప్పుడు ఇస్తున్న 400 రూపాయలకు బదులుగా రూ.1100 లభిస్తుంది. పెంచిన పెన్షన్ మొత్తం జులై నుంచి ప్రారంభమవుతుందని సిఎం తెలిపారు. మహిళలకు 35 శాతం రిజర్వేషన్ ప్రకటన రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు ముందు మహిళా సాధికారతే లక్ష్యంగా రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగాలలోని ప్రతి విభాగంలో 35 శాతం పోస్టులు మహిళలకోసం రిజర్వ్ చేయబడతాయని సిఎం నితీష్ కుమార్ ప్రకటించారు.

## 17 యేళ్ల బాలుడితో లేచిపోయిన సవతితల్లి!

**చండీగఢ్, జులై 13:** హరియాణాలోని నుహ్ జిల్లాలో వావివరసలు మరిచి 17 ఏళ్ల బాలుడ్ని తీసుకుని సవతితల్లిపారిపోవడమే కాకుండా ఆతడిని వివాహం చేసుకుంది. ఈ ఘటన పై బాలుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. హరియాణాలోని నుహ్ జిల్లాలో షాకింగ్ ఘటన జరిగింది. 17 ఏళ్ల బాలుడు 40 ఏళ్ల సవతి తల్లి మోనికతో ఇంటి నుంచి పారిపోయి వివాహం చేసుకున్నారు. ఈ ఘటనపై బాలుడి తండ్రి రామ్ కిషన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బాధితుడు రామ్ కిషన్ తెలిపిన వివరాల ప్రకారం రామ్ కిషన్ మొదటి భార్య చనిపోయింది. అయితే గురుగ్రామ్‌లోని సోహ్నా ప్రాంతానికి చెందిన మోనిక అనే మహిళను పెళ్లిచేసుకున్నాడు.గత కొద్ది కాలంగా రామ్ కిషన్ మొదటి భార్య కుమారుడు వీరితో కలిసి ఆ ఇంట్లో ఉంటున్నాడు. రామ్ కిషన్ ముందు మోనికను తల్లి అని పిలిచేవాడని కాళ్లు కూడా పట్టుకునే వాడని కానీ వాళ్లిద్దరి మధ్య సీక్రెట్ ఎఫైర్ నడుస్తోందని తాను గ్రహించలేదని రామ్ కిషన్ పేర్కొన్నాడు. తాజాగా మోనికతో బాలుడు పారిపోయాడు. ఇద్దరూ పెళ్లి చేసుకున్నారు. అయితే వారి పెళ్లి చెల్లదని బాలుడికి 17 ఏళ్లేనని తండ్రి రామ్ కిషన్ తెలిపాడు. అయితే పోలీసులు మాత్రం వీళ్లిద్దరూ కోర్టు మ్యారేజ్ చేసుకున్నారని.. తాము ఏమీ చేయలేమని చెప్పడం గమనార్హం.

# ఆరోజు కాక్‌పిట్‌లో ఏంజరిగింది?

- ఎయిరిండియా విచారణ నివేదికలపై నిపుణుల సందేహాలు
- అసమగ్రంగా ఉన్న ఎఎఐబి నివేదిక
- రెండు ఇంజిన్ల వైఫల్యంపై ఇంకా అనుమానాలు

**న్యూఢిల్లీ, జులై 13:** అహ్మదాబాద్‌లో గత నెలలో జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంపై అనేక ప్రశ్నలు ఇంకా సమాధానం దొరకడం లేదు. తాజాగా ఈ ప్రమాదానికి సంబంధించిన నివేదిక రాగా, విమానయాన నిపుణులు దానిని ప్రశ్నిస్తున్నారు. ప్రమాదం జరిగిన రోజు కాక్‌పిట్‌లో ఏం జరిగిందన్న ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. భారత వైమానిక దళ (ఐఏఎఫ్) మాజీ డైరెక్టర్ సంజీవ్ కపూర్ మాట్లాడుతూ ఎయిర్ క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఎఎఐబి) ప్రారంభ 15పేజీల నివేదికను తీవ్రంగా విమర్శించారు. దాని ముగింపు కూడా అసంపూర్ణంగా ఉందని, కాలక్రమం కూడా అనుమానాస్పదంగా ఉందని పేర్కొన్నారు. పైలట్ మేడే కాల్‌ను ఎప్పుడూ తేలిగ్గా జారీచేయడని, మేడే అంటే ఏదోఘోరంజరిగిందనే అర్థమని చెప్పారు. రెండు ఇంజిన్లు విఫలమయ్యాయని చెప్పడంలో సందేహం లేదన్నారు. అయితే, వాటి విఫలం వెనక కారణం మాత్రం ప్రాథమిక నివేదికలో వివరించలేదన్నారు. విమానం కూలడానికి ముందు పైలట్లలో ఒకరు వరుసగా మూడుసార్లు డిస్ట్రెస్ కాల్ చేశారన్న ఏఏఐబీ నివేదికపై సంజీవ్ కపూర్ స్పందిస్తూ ఇంధన సరఫరా ఎందుకు నిలిచిపోయిందని పైలట్లలో ఒకరు ప్రశ్నించడం కాక్‌పిట్ వాయిస్ రికార్డయిందన్నారు. దీని కారణంగానే టేకాఫ్ అయిన తర్వాత ఇంజిన్లు రెండు సెకన్ల వ్యవధిలోనే శక్తిని కోల్పోయాయని తెలిపారు. టేకాఫ్ అయిన వెంటనే పైలట్ ఉద్దేశపూర్వకంగా ఇంధన కట్ ఆఫ్ స్విచ్‌లను ఆపరేట్ చేస్తాడని చెప్పడం వింతగా ఉందని సంజీవ్ కపూర్ చెప్పారు. విమానాన్ని పైలట్ మాన్యువల్‌గా ఎందుకు లిఫ్టాఫ్ చేస్తాడని ప్రశ్నించారు.

# నస్రల్లాను హతమార్చినట్లే.. ఖమేనీ అంతానికి యత్నం

## ఇజ్రాయెల్‌పై ఇరాన్ ఆరోపణలు



**టెహ్రాన్, జులై 13:** ఇటీవల ఇరాన్‌లోని అణ్వాయుధ స్థావరాలు, ముఖ్య నేతల నివాసాలే లక్ష్యంగా ఇజ్రాయెల్ వైమానిక దాడులకు పాల్పడిన సంగతి విదితమే. అయితే బీరుట్‌లో హెజ్‌బొల్లా నాయకుడు నస్రల్లాను హత్య చేసిన విధంగానే ఇరాన్‌పై దాడుల సమయంలో ఇజ్రాయెల్.. తమ దేశాధ్యక్షుడిని హతమార్చడానికి ప్రయత్నించిందని ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్ (ఐఆర్‌జిసి)కు సంబంధించిన వార్తా సంస్థ పేర్కొంది. జూన్ 16న టెహ్రాన్‌లోని ఓ భవనంలో నిర్వహించిన ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సమావేశానికి ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాగర్ గాలిబాఫ్, న్యాయ వ్యవస్థ చీఫ్ మోహ్సేని ఏజీ, ఇతర సీనియర్ అధికారులు హాజరయ్యారని వార్తా సంస్థ తెలిపింది. ఉన్నతాధికారుల సమావేశంలో ఉన్న సమయంలో ఆ భవనంపై ఇజ్రాయెల్ వైమానిక దాడులకు పాల్పడిందని వార్తాసంస్థ వెల్లడించింది. అందులోని వారు తప్పించుకునే వీలు లేకుండా భవనానికి ఉన్న ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్‌లను లక్ష్యంగా చేసుకొని.. ఆరు క్షిపణులను ప్రయోగించిందని ఆరోపించింది. దాడులతో విద్యుత్ సరఫరా నిలిచిపోయినప్పటికీ అధికారులు ముందుగానే సిద్ధం చేసుకున్న అత్యవసర హాచ్ ద్వారా తప్పించుకోగలిగారని తెలిపింది. అక్కడి నుంచి తప్పించుకుంటున్న సమయంలో ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియార్ సహా పలువురు ఉన్నతాధికారులకు గాయాలు అయినట్లు తెలిపింది. హెజ్‌బొల్లా నాయకుడు నస్రల్లాను హత్య చేయడానికి ఇజ్రాయెల్ ఇదే తరహాలో దాడి చేసిందని.. ఇరాన్ అధ్యక్షుడి విషయంలో మాత్రం విఫలమయ్యిందని పేర్కొంది.

# రేపటి నుంచి యుకెలో ఇ-వీసా అమలు!



**లండన్, జులై 13:** యునైటెడ్ కింగ్‌డమ్‌లో ఈ నెల 15 నుంచి సాధారణ వీసాల స్థానంలో ఇ-వీసాలు అమల్లోకి రానున్నాయి. ఇమిగ్రేషన్ వ్యవస్థలో చేపట్టిన విస్తృత మార్పుల్లో భాగంగా వీటిని వాడుకలోకి తీసుకొస్తున్నారు. జులై 15 నుంచి జారీ చేసే అన్ని వీసాలు వాటిని పొందే వారి పాస్‌పోర్టులతో అనుసంధానమై.. డిజిటల్ రూపంలో ఉండనున్నాయి. ఇవి అన్ని రకాల వాటికి వర్తిస్తుంది. యుకెలో విద్యాభ్యాసం చేసే వారిలో భారతీయుల సంఖ్యే ఎక్కువ. ఇమిగ్రేషన్ ప్రాసెస్‌ను గాడిన పెట్టేందుకు ఈ సరికొత్త వీసాలను అమల్లోకి తెస్తోంది. విద్యార్థులు కచ్చితంగా తమ డిజిటల్, ప్రొసీజరల్ అంశాలను ప్రయాణానికి ముందే సరిచూసుకోవాల్సి ఉంటుంది.

సరికొత్త విధానం ప్రకారం.. పాస్‌పోర్టుపై సంప్రదాయ వీసా విగ్నెట్‌ను జారీ చేయరు. దీనికి బదులు ఇ-వీసా జారీ చేస్తారు. ఇది డిజిటల్ ఇమిగ్రేషన్ హోదాను అందిస్తుంది. ఇ-వీసాల్లో కచ్చితంగా విద్యార్థులు అప్‌డేట్ చేసిన పర్సనల్ పాస్‌పోర్టు వివరాలు ఉండాల్సిందే. పాస్‌పోర్టు రెన్యూవల్‌లో మార్పులను కూడా తెలియజేయాల్సి ఉంటుంది. విద్యార్థులు కచ్చితంగా యుకెవిఐ ఖాతాను క్రియేట్ చేసుకొని వారి ఇ-వీసాను మేనేజ్ చేసుకోవాలి. వీసా వివరాలు, అప్‌డేట్ ఇన్ఫర్మేషన్, ఇమిగ్రేషన్ స్టేటస్ సమాచారం ఆయా విద్యా సంస్థలకు, యజమానులకు, కంపెనీలకు తెలియజేయడానికి ఉపయోగపడుతుంది. దీంతోపాటు విద్యార్థులు లాగిన్ క్రెడెన్షియల్స్, కాంటాక్ట్ డిటైల్స్‌ను సరిగ్గా గుర్తుంచుకోవాలి. విద్యార్థులు యుకెలో బస చేసేందుకు, కోర్సుల్లో రిజిస్టర్ చేసుకునే సమయాల్లో.. ఆయా కంపెనీలు, ల్యాండ్ లార్డ్స్, విశ్వవిద్యాలయాలు యుకెవిఐ ఖాతాను తనిఖీ చేయాల్సి ఉంటుంది. ఇ-వీసా జారీ అయినా.. విద్యార్థులు మాత్రం తమ పాస్‌పోర్టును, ప్రింటెడ్ లేదా డిజిటల్ వీసా కాపీలను తమతో ఉంచుకోవాలి. బోర్డర్ ఆఫీసర్లు పాస్‌పోర్టును స్కాన్ చేసి ఇ-వీసాను తనిఖీ చేస్తారు. ఇక వీసా జారీ అయ్యాక.. పాస్ పోర్టును రెన్యూవల్ చేస్తే.. ఆవివరాలను విద్యార్థులు తమ ఇంగ్లాండ్ ప్రయాణానికి ముందే తమ యుకెవిఐ ఖాతాను అప్‌డేట్ చేయాలి.

యుకె ప్రయాణానికి ముందు.. ఇ-వీసా జారీని ధ్రువీకరించుకోవాలి. పాస్‌పోర్టు లింకేజీని సరిచూసుకోవాలి. యుకెవిఐ ఖాతా కోసం రిజిస్టర్ చేసుకోవాలి. క్రెడెన్షియల్స్‌ను జాగ్రత్తగా ఉంచుకోవాలి. డిజిటల్ సిస్టమ్‌లో అన్ని పర్సనల్, పాస్‌పోర్టు వివరాలను నమోదు చేయాలి. వీసా డెసిషన్ లెటర్‌ను ప్రింట్ తీసుకోవడమో.. సేవ్ చేసుకోవడమో చేయాలి. వీసా అప్లికేషన్‌లో వాడిన పాస్‌పోర్టును వారి వద్ద ఉంచుకోవాలి. ఇమిగ్రేషన్ వెరిఫికేషన్ కోసం యూనివర్సిటీ అకామిడేషన్‌కు సంబంధించిన పాలసీలను సరిచూసుకోవాలి.

## చైనా-భారత్‌కు సమస్యగా దలైలామా వారసత్వ సమస్య!

**న్యూఢిల్లీ, జులై 13:** టిబెట్‌బౌద్ధమతగురువు దలైలామా వారసుడిఎంపిక అంశం ఇపుడు చైనా భారత్ సంబంధాల్లో ఒక సమస్యగా మారిందని భారత్‌లోని చైనా రాయబారకార్యాలయం వెల్లడించింది. భారత విదేశాంగ నిపుణులు టిబెట్‌కు సంబంధించిన సమస్యల సున్నితత్వంపరిగణనలోనికి తీసుకోవాలన్నారు. దలైలామా పునర్జన్మ, వారసత్వం పూర్తిగా మాదేశ అంతర్గత వ్యవహారమని, భారత్ కల్పించుకుంటే సమస్యలు తలెత్తుతాయని ఆయన అన్నారు. 2020లో గల్వాన్‌ఘటనతో ఇరుదేశాలమధ్య తీవ్ర ఉద్రిక్తతలు తలెత్తినతర్వాత భారత విదేశాంగమంత్రి జైశంకర్ చైనాలో తొలిసారి పర్యటించనున్నట్లు తేలింది.

# సంక్షిప్తంగా..

## కేరళ సిఎం నివాసానికి బాంబు బెదరింపు



**తిరువనంతపురం, జులై 13:** కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ అధికారిక నివాసానికి బాంబు బెదరింపు వచ్చింది. తంపనూరు పోలీసు స్టేషన్‌కు గుర్తుతెలియని వ్యక్తులు ఇ-మెయిల్ పంపారు. క్లిఫ్ హౌస్ వద్ద బాంబు పేలుళ్లు జరగబోతున్నాయంటూ ఇ-మెయిల్‌లో పేర్కొన్నారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు ఆయన నివాసంలో విస్తృతంగా తనిఖీలు చేసి.. అది నకిలీ ఇ-మెయిల్‌గా తేల్చారు. 'బాంబు బెదరింపు తర్వాత సిఎం నివాసాన్ని డాగ్‌స్క్వాడ్, బాంబుస్క్వాడ్‌లతో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించాం. కానీ ఎక్కడా అనుమానాస్పదంగా కనబడలేదు'అని పోలీసులు వెల్లడించారు. తనిఖీల సమయంలో సిఎం విజయన్, ఆయన కుటుంబం విదేశాల్లో ఉన్నారని తెలిపారు.

## పాత డ్యామ్‌లను కూల్చివేస్తున్న చైనా

**బీజింగ్,జులై 13:** దేశంలో వేలాదికోట్లతో నిర్మించిన పాత డ్యామ్‌లన్నింటినీ పర్యావరణ ప్రయోజనాలకోసమని చైనా ప్రభుత్వం కూల్చివేస్తోంది. ఇప్పటి వరకు కట్టిన డ్యామ్‌లన్నీ కూల్చేస్తోంది ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా ఇప్పటి వరకు 300 డ్యామ్‌లు కూల్చేసింది. అంతేకాదు 373 హైడ్రోపవర్ స్టేషన్లలో 342 చిన్నస్థాయి జల విద్యుత్ కేంద్రాల్లో కార్యకలాపాలు ఎక్కడికక్కడ బంద్ పెట్టింది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా డ్రాగన్ కంట్రీ కఠిన నిర్ణయాలు అమలు చేస్తున్నట్లు తెలుస్తోంది. డ్యామ్‌ల కూల్చివేత చర్యలు 2020 నుంచే మొదలు పెట్టినట్లు సమాచారం. ఆసియాలోనే అతి పొడవైన యాంగ్జీ నదిపై చైనా గత కొన్ని దశాబ్దాల కాలంలో భారీస్థాయిలో డ్యామ్‌లు, జల విద్యుత్ కేంద్రాలు నిర్మించింది. దీంతో పర్యావరణాకి పెను ముప్పు వాటిల్లింది. నదిని ఆధారంగా చేసుకుని జీవించే జలచరాల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది.

## డీజిల్ లోడ్ గూడ్స్‌రైలులో మంటలు

**తిరువళ్లూరు,జులై 13:** తమిళనాడులోని తిరువల్లూరు సమీపంలో డీజిల్ లోడ్‌తో వెళ్తున్న గూడ్స్ రైలులో మంటలు చెలరేగాయి. చెన్నై పోర్టు నుంచి 52 వ్యాగన్లలో బెంగళూరుకు ఇండియన్ ఆయిల్ తరలిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఒక వ్యాగన్‌లో లేచిన మంటలు వేగంగా ఇతర వ్యాగన్లకు వ్యాపించాయి. పెద్దఎత్తున మంటలు ఎగిసిపడటంతో సమీప ప్రాంతాల ప్రజలు భయాందోళనకు లోనయ్యారు. అయితే ఈ ప్రమాదంలో ఎవరికి ఏమీ కాలేదని రైల్వే అధికారులు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే ఘటనాస్థలానికి చేరుకొన్న అగ్నిమాపక సిబ్బంది విద్యుత్తు సరఫరాను నిలిపివేశారు. అనంతరం మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాద నేపథ్యంలో పలు లోకల్ రైళ్లను తాత్కాలికంగా నిలిపివేశారు.

## హిందీలోనే మాట్లాడతానన్న ఆటోడ్రైవర్‌పై 'సేన' దాడి!


**ముంబయి, జులై 13:** మహారాష్ట్రలో మరో షాకింగ్ ఉదంతం చోటుచేసుకుంది. హిందీలోనే మాట్లాడతానన్న ఓ ఆటో డ్రైవర్‌పై శివసేన యుబిటి, మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన ఎమ్ఎన్ఎస్ మద్దతుదారులు బహిరంగంగా దాడికి దిగారు. వారం రోజుల క్రితం ఆ ఆటో డ్రైవర్ తన వాహనంలోని ప్రయాణికుడితో మాట్లాడుతూ తాను హిందీ లేదా భోజ్‌పురీలోనే మాట్లాడతానని స్పష్టం చేశాడు. ఎవరేం చేసినా తనకు భయం లేదని చెప్పారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఈ నేపథ్యంలో శివసేన యుబిటి, ఎమ్ఎన్ఎస్ మద్దతుదారులు ఆ ఆటోడ్రైవర్‌పై దాడి చేశారు. మరాఠీ భాష, సంస్కృతిని అవమానిస్తే ఉపేక్షించేది లేదంటూ పలుమార్లు అతడి చెంప ఛెళ్లుమనిపించారు. అతడిపై చేయి చేసుకున్న వారిలో మహిళ కూడా ఉన్నారు.

## పాట్నాలో పట్టపగలే న్యాయవాది కాల్చివేత!

**పాట్నా,జులై 13:** బీహార్‌లో శాంతిభద్రతల పరిస్థితిపై మరోసారి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పాట్నాలోని సుల్తాన్‌గంజ్ పోలీసు స్టేషన్‌కు కేవలం 300 మీటర్ల దూరంలో పట్టపగలే గుర్తుతెలియని దుండగులు రెచ్చిపోయారు. ఆదివారం మధ్యాహ్నం ఒక లాయర్‌పై కాల్పులు జరపడంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. దీంతో ఆ ప్రాంతవాసులు భయభ్రాంతులకు గురయ్యారు. రాష్ట్రంలో పెరుగుతున్న గన్ కల్చర్‌పై ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. అగంతకుల కాల్పుల్లో మృతిచెందిన వ్యక్తిని జితేందర్ కుమార్‌గా గుర్తించారు పోలీసులు. వృత్తిరీత్యా లాయర్ అయిన జితేందర్ కుమార్ గత రెండేళ్లుగా తన వృత్తిలో చురుకుగా లేరని తెలుస్తోంది. రెగ్యులర్‌గా వచ్చే టీషాపులో టీ తాగి వెళ్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు కాల్పులు జరిపి పరారైనట్టు పట్నా ఈస్ట్ ఎస్పీ పరిచయ్ కుమార్ తెలిపారు.

14-7Pg6exHMNWJQE.qxd:14-7Pg6exHMNWJQE.qxd 01/01/01 10:14 AM Page 1




చిల్డ్రన్ పార్కు సిల్వర్ జూబ్లీ వేడుకలను జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభిస్తున్న మంత్రి నారాయణ తదితరులు

# చిల్డ్రన్స్ పార్కు సిల్వర్ జూబ్లీ వేడుకలు

## 25 మొక్కలు నాటిన మంత్రి నారాయణ

**నెల్లూరు, జులై 13, ప్రభాతవార్త -వైద్యం:** చిల్డ్రన్ పార్కు నిర్మించి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 25 మొక్కలను మంత్రి నారాయణ నాటారు. అనంతరం జ్యోతి ప్రజ్వల చేసిన సిల్వర్ జూబ్లీ ఉత్సవాలను ప్రారంభించారు. పార్కు ఏర్పాటుకు కృషి చేసిన జేఎస్ రెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్ళపాక అనురాధ మాట్లాడుతూ చిల్డ్రన్స్ పార్కు సిల్వర్ జూబ్లిలో పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. తాను మున్సిపల్ చైర్‌పర్సన్స్‌గా ఉన్న సమయంలో డంపింగ్ యార్డుని తొలగించి కౌన్సిల్‌లో పార్కుకి ఆమోదం తెలిపామని చెప్పారు. జన్మభూమిలో పెట్టి పార్కు అభివృద్ధి రోడ్డు ఏర్పాటు చేశామన్నారు. సిటీలో 46 పార్కులను అన్ని హంగులతో ఏర్పాటు చేసిన ఘనత మంత్రి నారాయణకే దక్కుతుందన్నారు. నిత్యం అభివృద్ధి గురించి ఆలోచించే మంత్రి చిక్కటం మన అదృష్టం అని తెలిపారు. డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ గతంలో నెల్లూరులో రెండు పార్కుల గురించే అందరికి తెలుసని, ఇప్పుడు నారాయణ చలువతో 48కి పార్కుల సంఖ్య చేరిందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి భాగాలేకున్నా అనుభవంతో అనుకున్నది సాధిస్తున్నారని కొనియాడారు. వీఆర్సీ ఆధునీకరణలో భాగస్వామి ఆయన మంత్రి కుమార్తె పొంగూరు షరణికి కూడా ధన్యవాదాలు తెలిపారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ చిల్డ్రన్స్ పార్కుకి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. అప్పట్లో నెల్లూరులో గాంధీ పార్క్ ఒక్కటే ఉండేదన్నారు. డంపింగ్ యార్డుని 2000 సంవత్సరంలో చిల్డ్రన్స్ పార్కుగా టీడీపీ ప్రభుత్వం మార్చిందన్నారు. జన్మభూమిలో 70-30 నిష్పత్తి కింద జేఎస్ రెడ్డి పార్కును ఏర్పాటు చేశారన్నారు. ఈ పార్కులో 70 మంది పిల్లలు ఒకే సారి ఆడుకొనేలా 28 లక్షలతో ప్లే ఎక్విప్‌మెంట్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. వాయుగుండం వెంకటేశ్వర్లు పార్కు అభివృద్ధికి ముందుకొచ్చారని ఆధునీకరణకు 40 లక్షలు ఇచ్చేందుకు అంగీకారం తెలిపారన్నారు. పార్కు రూపురేఖలు మార్చేందుకు లియో కన్సల్టెంట్‌ని పిలిపిస్తానని హామీ ఇచ్చారు. 46 పార్కులు నెల్లూరు సిటీలో సిద్ధం చేశామని సంతోషం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం 5 స్వచ్ఛ అవార్డులను ప్రకటించడం ఆనందంగా ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, నగర టీడీపీ అధ్యక్షులు మామిడాల మధు, కార్పొరేటర్లు శ్రీకాంత్‌రెడ్డి, కర్తం ప్రతాప్‌రెడ్డి, పార్కు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రామ్మూర్తి, పెద్ద పంచల ప్రసాద్, ట్రెజరర్ ప్రసాద్ కమిటీ సభ్యులు, వాకర్స్ పాల్గొన్నారు.

# ఆయిల్ ట్యాంకర్‌లో చెలరేగిన మంటలు

## తమిళనాడు తిరువళ్లూరు సమీపంలో ఘటన

## చెన్నై-బెంగళూరు-తిరుపతి మార్గాల్లో ఆలస్యంగా నడిచిన రైళ్లు



**కుప్పం, జులై 13 ప్రభాతవార్త :** క్రూడ్ ఆయిల్ ట్యాంకర్లతో వెళ్తున్న ఓ గూడ్స్ రైలులో ఓ ట్యాంకర్ నుంచి హఠాత్తుగా మంటలు చెలరేగిన సంఘటన ఆదివారం ఉదయం తమిళనాడులోని తిరువళ్లూరు సమీపంలో చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న రైల్వే ఉన్నతాధికారులు ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపేశారు. దీంతో పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. ప్రధానంగా చెన్నై - బెంగళూరు రైలు మార్గంలో తిరిగే రైళ్లు కొంత ఆలస్యంగా నడిచాయి. ఈ సంఘటన జరిగిన సమయంలోబెంగళూరునుంచి చెన్నై వెళ్లే లాల్‌బాగ్ ఎక్స్‌ప్రెస్ రైలును కుప్పం రైల్వేస్టేషన్‌లో కొంత సమయం నిలిపేశారు. సుమారు 45 క్రూడ్ ఆయిల్ ట్యాంకర్లతో చెన్నై ఎగ్మోర్ స్టేషన్ నుంచి బయలుదేరిన గూడ్స్ రైలు వాలాజాబాద్ మార్గంలో వస్తుండగా తిరువళ్లూరు సమీపంలోని ఎగట్టూర్ ప్రాంతంలో ప్రమాదానికి గురైనట్లు సమాచారం. ఒక్కసారిగా మంటలు చెలరేగిన నేపథ్యంలో రైల్వే ఉన్నతాధికారులు ముందస్తు చర్యగా విద్యుత్ సరఫరా నిలిపివేయించ చడంతో పాటు రైల్వే స్టేషన్లకు సమాచారం ఇవ్వడంతో అప్రమత్తమయ్యారు. రైల్వే ఉన్నతాధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. అనంతరం చెన్నై - బెంగళూరు, తిరుపతి మార్గా ల్లో తిరిగే రైళ్లు ఆలస్యంగా నడిచాయి.ఈ సం ఘటనతో చెన్నై-అరక్కోణం సెక్షన్ల మధ్య తిరిగే ఇఎంయు లోకల్‌ట్రైన్లను ఆదివారం రద్దు చేశారు.

# తల్లితండ్రి లేని చిన్నారులకు భరోసా ఏది?


## మిషన్ వాత్సల్య లబ్ధిదారుల ఆవేదన

**పాకాల, జులై 13, ప్రభాతవార్త:** చిత్తూరు జిల్లా పాకాల మండల పరిధిలో కొన్ని అనివార్య కారణాల రీత్యా తల్లి తండ్రి పోగొట్టుకున్న పిల్లలు ప్రభుత్వం చేయూత కోసం కళ్ళు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నప్పటికీ ప్రభుత్వం నుంచి మొండి చెయ్యే మిగులుతోంది. మిషన్ వాత్సల్య పేరుతో తల్లి గాని, తండ్రి గాని, తల్లిదండ్రులు చనిపోయిన పిల్లల కోసం కేంద్ర ప్రభుత్వం ఆర్భాటంగా పార్లమెంటు సాక్షిగా ప్రకటించిన పథకం మిషన్ వాత్సల్య. ఈ పథకం ద్వారా అనాథ పిల్లలకు వారి పోషణకు చదువుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి నెలకు 4000 రూపాయలు ఇస్తామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటు వేదికగా ప్రకటన చేశారు. ఈ పథకంలో చేరటానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా లబ్ధిదారులు గుర్తించే ప్రయత్నంలో రెండున్నర సంవత్సరాల ముందు గ్రామ వార్డు సచివాలయాల లోని డిజిటల్ అసిస్టెంట్ దగ్గర ఇప్పటికే లబ్ధిదారులు తమ అప్లికేషన్ నింపి నమోదు చేసి ఉన్నారు. కానీ ఇప్పటి వరకు కూడా పేద పిల్లలను వారి సంరక్షకులను ఆదుకునే ప్రయత్నం ప్రభుత్వం నుంచి మొదలు కాకపోవడం పై లబ్ధిదారులను తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భావి భారత పౌరుల కోసం ప్రారంభించిన ఈ కార్యక్రమాన్ని మొదలు పెట్టక పోవడం దురదృష్టకరమని ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఓటు బ్యాంకు కోసం వయోవృద్ధులకు 4వేల రూపాయలు ప్రతినెలా పెన్షన్ చెల్లిస్తున్న ప్రభుత్వం భావి భారతదేశ భవిష్యత్తు కాపాడేందుకు తల్లిదండ్రులు కోల్పోయిన పిల్లలకు ఆర్థిక చేయూత కోసం దయానియంగా ఎదురు చూస్తున్నప్పటికీ నేటి పాలకులు స్పందించకపోవడం సభ్య సమాజానికి సిగ్గుచేటుగా మారిన ఓ పరిణామం. ప్రభుత్వం సొమ్ము మంచినీళ్లు ప్రాయంగా ఖర్చు పెట్టే పాలకులు రాష్ట్రంలోని నిరుపేద కుటుంబాలలో తల్లి తండ్రి కోల్పోయిన పిల్లలను ఈ పథకం ద్వారా ఇప్పటికైనా ఆదుకోని వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయవలసిందిగా ప్రజలు కోరుతున్నారు.

# మాజీ ఎమ్మెల్యే వి.కె.సతీమణి పార్వతమ్మ మృతి

## నేడు అనంతపురంలో అంత్యక్రియలు

## నివాళులర్పించిన నాయకులు, అభిమానులు


వికె పార్వతమ్మకి నివాళులర్పిస్తున్న సిపిఐ నాయకులు ఇన్‌సెట్‌లో పార్వతమ్మ(ఫైల్)

**అనంతపురం, జులై 13 ప్రభాతవార్త బ్యూరో:** ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు, భారత కమ్యూనిస్టు పార్టీ అగ్ర నాయకులు గుత్తి మాజీ శాసనసభ్యులు కామ్రేడ్ వి.కె.ఆదినారాయణరెడ్డి సతీమణి వికె పార్వతమ్మ(101) అనంతపురం నగరంలోని మెదటి రోడ్డు స్వగృహములో ఆదివారం తుది శ్వాస విడిచారు. వికె సతీమణి పార్వతమ్మ వికె సమకాలికులు మినహా సిపిఐకి సంబంధించిన ప్రతి ఒక్కరూ అమ్మా అని ఆప్యాయంగా పిలిచేవారు. సిపిఐ సీనియర్ నేత, దివంగత వికే ఆదినారాయణరెడ్డి కోసం సిపిఐకి చెందిన వారైన లేక ఇతరులైన గతంలో ఇంటికి వెళ్లితే అందరిని గౌరవించే సాంప్రదాయం పార్వతమ్మ అమ్మది అని పలువురు నేతలు, కార్యకర్తలు చెబుతున్నారు. వికె ఆదినారాయణ రెడ్డి ఇంటిలో సిపిఐ సమావేశాలు జరిగిన సందర్భంలో హాజరైన వారందరికీ మర్యాదలో ఏ లోటు వుండేది కాదు. పార్వతమ్మ మృతి పట్ల సిపిఐ అగ్రనేత నారాయణ, సిపిఐ రాష్ట్ర కార్య దర్శి రామకృష్ణ, జగదీష్, తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. ఆమె సేవలను కొనియాడారు. వైసిపి, టిడిపి, సిపిఎం పార్టీల నేతలతోపాటు పలు ప్రజాసంఘాల నేతలు కూడా పార్వతమ్మ సేవలను కొనియాడారు. కాగా వికే ఆదినారాయణరెడ్డి సతీమణి పార్వతమ్మ అమ్మ మృతి చెందారు అన్న విషయం తెలుసుకున్న సిపిఐ నాయకులు, కార్యకర్తలు వారి ఇంటికి చేరుకుని పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో అనంతపురం సిపిఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్, సహాయ కార్యదర్శులు పి.నారాయణస్వామి, సి.మల్లికార్జున, సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు జె.రాజారెడ్డి, బి.కేశవరెడ్డి, ఎన్.శ్రీరాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు సి.లింగమయ్య, టి.నారాయణస్వామి, నగర సహాయ కార్యదర్శులు బి.రమణయ్య, వి.కృష్ణుడు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కుల్లా యిస్వామి, నగర కార్యవర్గ సభ్యులు ఎల్లట్ల నారాయణ స్వామి, చిత్రచేడు రామాంజనేయులు, శ్రీనివాసులు, బుక్కరాయసముద్రం మండల కార్యదర్శి, స్వామి, సిపిఐ నాయకులు సుందరరాజు అనేక సిపిఐ కార్యకర్తలు నివాళులర్పించారు. కాగా సిపిఐ అగ్ర నాయకులు కీ.శే.వికె సతీమణి పార్వతమ్మ మృతి భాదాకరం అని శ్రీ సత్యసాయి జిల్లా సిపిఐ కార్యదర్శి వేమయ్య యాదవ్ పేర్కొన్నారు. మాజీ ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు శ్రీనివాసుల నాయుడు, నీటిపారుదల నిపుణులు టి.లక్ష్మినారాయణ మాట్లాడుతూ వికె ఉన్న కాలంలో ఎంత అభిమానంగా ఉండేవారో, అంతే అభిమానంగా, ఆప్యాయతతో పార్వతమ్మ మాట్లాడేవారు, అతిథి మర్యాదలు చేసేవారు. వద్దని వారించిన వినిపించుకునే వారు కాదు అని అభిప్రాయ పడ్డారు. అమ్మ మితభాషి. గొప్ప సంస్కారవం తురాలు. అనిర్వచనీయమైన అనుబంధం వికె కుటుంబంతో పెనవేసుకుపోయింది. అమ్మ పార్వతమ్మ మృతికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నామని పలువురు సంతాపం వ్యక్తం చేశారు. కాగా సోమవారం ఉదయం అనంతపురంలోని హరిచంద్ర ఘాట్‌లో పార్వతమ్మ మృతదే హానికి అంతక్రియలు నిర్వహించనున్నారు.

# ఆర్డిటి సంస్థకు వెంటనే ఎఫ్.సి.ఆర్.ఏ మంజూరు చేయాలి

## మేధావుల డిమాండ్, ప్రజా ప్రతినిధులు స్పందించాలని వినతి


చర్చ వేదికలో ఆర్‌డిటీకి ఎఫ్‌సిఆర్‌ఏ మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్న చేస్తున్న దృశ్యం

**అనంతపురం, జులై 13 ప్రభాతవార్త బ్యూరో:** అనంతపురం నగరంలోని ఉపాధ్యాయ భవన్‌లో ప్రముఖ స్వచ్ఛంద సంస్థ (ఆర్డిటి)కి సంబంధించిన ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్ (ఎఫ్‌సిఆర్‌ఏ)ను కేంద్ర ప్రభుత్వం పునరుద్ధరించాలని, ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా తగిన చొరవ చూపాలని, ప్రజా ప్రతినిధులు ఒత్తిడి తీసుకురావాలని అనంతపు రంలో మేధావుల సమావేశం డిమాండ్ చేసింది. స్థానిక ఉపాధ్యాయ భవనంలో ఆదివారం జరిగిన మేధావుల సమావేశంలో ఆర్డిటికీ ఎఫ్‌సిఆర్‌ఏ మంజూరు సమస్యపై చర్చా వేదిక నిర్వహించారు. ఈ సమావేశాన్ని ఉప్పరపాటి వెంకటేశులు, ఎద్దులపల్లి కుమార్ నిర్వహించగా, రచయిత సంగీత వాణి రాయుడు అధ్యక్షత వహించారు. ఈ చర్చలో వివిధ వర్గాల చెందిన మేధావులు, కవులు, ప్రజా సంఘాల వారు, ఆర్డిటి అభిమానులు, సానుభూతిపరులు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు. చర్చ వేదికలో ప్రముఖ కవి శాంతి నారాయణ, వంకిరెడ్డి రెడ్డప్ప రెడ్డి, హోవాబ్ ఖాన్, తిప్పేస్వామి, హనుమంత రాయుడు, డాక్టర్ వంశీకృష్ణ వంటి ప్రముఖులు ప్రధాన వక్తలుగా పాల్గొన్నారు. వక్తలు తమ ప్రసంగాల్లో ఆర్డిటి సంస్థ అనేక దశాబ్దాలుగా అనంతపురం జిల్లాలో పేదల అభ్యున్నతికి చేపట్టిన సేవా కార్యక్రమాలను వివరించారు. వేలాది గ్రామాల్లో విద్య, ఆరోగ్య సేవలు, ఉపాధి అవకాశాలు కల్పించిన ఆర్డిటి సేవలు అమూల్యమని వారు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా మేధావులు, కవులు, రచయితలు, ప్రజాస్వామ్యవాదులు సమావేశానికి హాజరై, ఆర్డిటి సేవలను కొనియాడారు. ఆ సంస్థ లక్షల మందికి మేలు చేసిన నేపథ్యంలో చర్చా వేదికలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఎఫ్‌సిఆర్‌ఏను పునరుద్ధరించాలన్న డిమాండ్ వినిపించింది. ఆర్డిటిని రక్షించేందుకు తాము మద్దతుగా నిలబడతామని పలువురు అభిప్రాయపడ్డారు. ఆర్డిటి సేవలు ఆగిపోవడం అనేది సామాజికంగా పెద్ద నష్టంగా మిగులుతుంది. అందుకే దాని సేవలు కొనసాగేందుకు అందరం కలిసికట్టుగా నిలవాలి అని వక్తలు పేర్కొన్నారు.

# జూరాల ఒక గేటు ద్వారా నీరు విడుదల

**మహబూబ్‌నగర్ బ్యూరో, జులై 13, ప్రభాతవార్త:** జూరాల డ్యామ్‌కు వరద స్వల్పంగా స్థిరంగా కొనసాగుతున్నది. ఆదివారం జూరాలకు 65,000క్యూసెక్కుల ఇన్ ఫ్లో నమోదైంది. జూరాల పూర్తి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం జూరాలలో 4.380 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. పవర్ హౌస్ కు 36035 క్యూసెక్కులు, స్పిల్‌వే ద్వారా 6,823 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అదేవిధంగా బీమా లిఫ్ట్ -1కు 1,300 క్యూసెక్కులు, కోయిల్ సాగర్ లిఫ్ట్ కు 315 క్యూసెక్కులు, ఆర్డీఎస్ కెనాల్ కు 150 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 1030 క్యూసెక్కులు, కుడి కాలువకు 470 క్యూసెక్కులు, సమాంతర కాలువకు 950 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల నుంచి 47068 క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదయింది.

# 20న 'ప్రణామం' కవి సమ్మేళనం

**విజయవాడ,జులై 13,ప్రభాతవార్త ప్రతినిధి:** మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ ఆధ్వర్యంలో జులై 20న ఆదివారం విజయవాడలో ఎంపిక చేయబడిన కవులతో "ప్రణామం" కవి సమ్మేళనం జరుగనుంది. ఆ సంస్థ వ్యవస్థాపకులు, నవ్యాంధ్ర రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి కలిమికొండ సాంబశివరావు(కలిమిశ్రీ) తెలిపారు. ఈ కవి సమ్మేళనంలో భాష, సామాజిక న్యాయం, దేశభక్తి, శాంతి, పర్యావరణం వంటి వివిధ అంశాలపై కవులు తమ కవితల్ని వినిపించొచ్చు. అనంతరం 18 ఎకరాల విస్తీర్ణంలో అందంగా విహార స్థలంగా నిర్మించిన అంబేద్కర్ స్మృతివనం పార్కును చూసి తరించొచ్చు. అరుదైన లొకేషన్స్‌లో తీసుకున్న మీ ఫొటోలను చిరకాలం మీ జ్ఞాపకాలలో భద్రపరచుకోవచ్చు.



# దుర్గమ్మకు విజయవాడ సిపి ఆషాఢం సారె

**ఇంద్రకీలాద్రి, జులై 13, ప్రభాతవార్త:** దుర్గమ్మవారికి విజయవాడ సిపి రాజశేఖర్ బాబు దంపతులు ఆషాడం సారెను ఆదివారం అందించారు. మంగళవాయిద్యాల నడుమ ఆలయానికి తీసుకుని రాగా అక్కడ ఇఓ వారికి ఘన స్వాగతం పలికి శ్రీ అమ్మవారి సన్నిధికి తొడ్కొని వెళ్ళారు. ఆషాడం సారెను అమ్మవారి ముందు పూజలు నిర్వహించి సమర్పించారు.

**భక్తుల విరాళాలు:** దుర్గమ్మవారి ఆలయంలో భక్తులకు పంపిణీ చేసే ఉచిత ప్రసాదానికి రాజస్థాన్‌లోని ఉదయపూర్‌కు చెందిన శాంభవ సోలంకి రు.1,01,000లను, నిత్యాన్నదాన పథకానికి రు.51,000లను విరాళంగా ఆదివారం ఇఒకు అందించారు. రాజమండ్రికి చెందిన భోగవరపు సత్యనారాయణ, ఝాన్సీ లక్ష్మి దంపతులు రు.1,01,116లను విరాళంగ అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అనంతరం వారికి ప్రసాదం, శేషవస్త్రం, మెమెంటోలను అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

**దుర్గమ్మకు భక్తిగా కోలాట, నృత్యనీరాజనం:** దుర్గమ్మవారికి ఆదివారం విజయవాడకు చెందిన భక్తబృందం కోలాట ప్రదర్శన తో అలరించారు. విజయవాడకు చెందిన నృత్య కళాకారులు కూచిపూడి నృత్యార్చన సమర్పించారు.

**ఉచిత బిస్కట్లు,వాటర్‌బాటిల్స్ పంపిణీ:** భక్తులకు ఆదివారం ఉచితంగా వాటర్‌బాటిల్స్, మంచినీటి బాటిల్స్‌ను పంపిణీ చేశారు.

# వాస్తవ జీవన చిత్రణ 'పగిలిన జీవ కలలు'

## కృష్ణా జిల్లా పూర్వపు కలెక్టర్ ఎఎమ్‌డి ఇంతియాజ్

## ఎస్ ఆర్ పృధ్వి రచించిన పగిలిన జీవ కలలు, నానో ప్రస్థానం పుస్తకాల ఆవిష్కరణ



**విజయవాడ,జులై 13,ప్రభాతవార్తప్రతినిధి:** మన చుట్టూ ఉన్న సమాజాన్ని ప్రతిబింబిస్తూ వాస్తవ జీవన చిత్రణ ఎస్ఆర్ పృధ్వి రచించిన పగిలిన జీవ కలలు పుస్తకంలో మనం చూస్తామని కృష్ణా జిల్లా పూర్వపు కలెక్టర్ ఎ ఎమ్ డి ఇంతియాజ్ అన్నారు. ఆదివారం సాయంత్రం ఎక్స్ రే సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ, కామ్రేడ్ జిఆర్కెపోలవరపు సాంస్కృతిక సమితి సంయుక్త నిర్వహణలో విజయవాడ బుక్ ఫెస్టివల్ లైబ్రరీ హాల్ లో ప్రముఖ కవి ఎస్ ఆర్ పృధ్వి రచించిన పగిలిన జీవ కలలు, నానో ప్రస్థానం పుస్తకాల ఆవిష్కరణ జరిగింది. పూర్వపు కలెక్టర్ ఇంతియాజ్ పగిలిన జీవ కలలు(దీర్ఘ కవిత) ఆవిష్కరణ చేసి అనంతరం ప్రసంగిస్తూ సమాజ పరివర్తనకు ఉపకరించే సాహిత్యం రావాలని ఆకాంక్షించారు. మరొక పుస్తకం నానో ప్రస్థానం ఆవిష్కరణ చేసిన డిప్యూటి సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఎన్ వి రమణ ప్రసంగిస్తూ స్వల్ప అక్షరాలతో అనల్పార్థాన్ని నానో కవితా ప్రక్రియ లో చూస్తామన్నారు. అనేకమంది కవుల రచనాశైలిని కవి ఎస్ఆర్ పృధ్వి చక్కగా వివరించారని ప్రశంసించారు. ఆకాశవాణి పూర్వపు సంచాలకులు ముంజులూరి కృష్ణకుమారి, ప్రముఖ కవయిత్రి కావూరి సత్యవతి ఈ పుస్తకాలను సమీక్షిస్తూ పాఠకులను ఆసక్తికరంగా చదివించే రచనలు అన్నారు. ప్రముఖ కవి శ్రీకంఠస్ఫూర్తి, ఎక్స్ రే సాహిత్య కార్యదర్శి సింగంపల్లి అశోక్ కుమార్ చక్కని అభిభాషణతో కవిని అభినందించారు.సభకు అధ్యక్షత వహించిన ఎక్స్ రే కొల్లూరి మాట్లా డుతూ సులభశైలిలో, అందరికీ అర్థం అయ్యేలా కవిత్వం ఉండాలన్నారు. కామ్రేడ్ జిఆర్కె పోలవ రపు సాంస్కృతిక సమితి అధ్యక్షులు గోళ్ళ నారా యణ రావు ప్రసంగిస్తూ సమాజాన్ని చైతన్యపరిచే రచనలను మనం స్వాగతించాలని అన్నారు. పుస్తక రచయిత ఎస్ఆర్ పృధ్వి సత్కార అనంతరం ప్రసంగిస్తూ కవిగా తన ఆశయాలను వివరించారు. ఎక్స్ రే ప్రధాన కార్యదర్శి బోడి ఆంజనేయ రాజు తొలుత స్వాగ తం పలుకుతూ అధ్యయనం ద్వారా మాత్రమే కవులు మంచి కవిత్వాన్ని సృజన చేయగలరు అన్నారు. ఎక్స్ రే కోశాధికారి చామర్తి వెంకట సుబ్బయ్య, కొల్లూరి కనకవల్లి, డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్,పురాణం రాజేశ్వర శర్మ, పొత్తూరి సీతారామారావు కార్యక్రమ పర్యవేక్షణ చేసారు.

# కోట మృతికి పలువురు మంత్రుల సంతాపం

**విజయవాడ, జులై 13 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రముఖ విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావు మృతిపై పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ మంత్రికందుల దుర్గేష్ సంతాపం వ్యక్తం చేశారు. మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ తెలుగు వారి గుండెల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకొని కోట కట్టుకున్న మహానటుడు కోట శ్రీనివాసరావు అన్నారు. కోట శ్రీనివాసరావు మృతిపై ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సంతాపం:** కోట శ్రీనివాసరావు మృతి పట్ల రాష్ట్ర రోడ్లు,మరియు భవనాలు పెట్టుబడులు మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. వైవిధ్య భరితమైన నటనతో ప్రతి నాయకుడిగా క్యారెక్టర్ ఆర్టిస్టుగా కమెడియన్‌గా తెలుగు తెరపై ఎన్నో మరపురాని పాత్రలు పోషించిన గొప్ప నటుడు కోట శ్రీనివాసరావు. తెలుగు భాష, యాస, మాండలికాలతో వెండితెరపై విలనిజానికి కొత్త భాష్యం చెప్పిన వ్యక్తి. .

**సంతాపం తెలిపిన రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్:** వైవిధ్యభరితమైన నటనతో ఎన్నో మరపురాని పాత్రలు పోషించిన గొప్ప నటుడు కోటా శ్రీనివాసరావు అని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సంతాపం తెలిపారు. 1999లో బిజెపి విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిపి సేవలందించిన ప్రజా నాయకుడు కోటా శ్రీనివాసరావు అన్నారు.ఆయన ఆత్మకుశాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థించిన మంత్రి. అనగాని సత్యప్రసాద్ రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్ మరియు స్టాంపుల శాఖామాత్యులు ప్రముఖ నటుడు మాజీ ఎమ్మెల్యే కోటా శ్రీనివాసరావు మృతి చెందడం విచారకరం. 40ఏళ్ల పాటు కళా మతల్లికి ఆయన చేసిన సేవలు చిరాస్మరణీయం. 750కి పైగా సినీమాల్లో వివిధ వైవిద్య పాత్ర లను పోషించి సినీ ప్రియులను రంజింప చేశారు. తెలుగు సినిమాలో విలనిజానికి కొత్త వరవడిని సృష్టించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆ దేవున్ని ప్రార్థిస్తున్నాను.ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలుపుతతతతున్నాను.

# సినీనటుడు కోట శ్రీనివాసరావు మృతికి సిపిఐ నారాయణ, కూనంనేని సంతాపం

**హైదరాబాద్, జులై 13, ప్రభాతవార్త:** ప్రముఖ సినీనటుడు కోట శ్రీనివాసరావు మరణం పట్ల సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. కళామతల్లికి అంకితమై కోట శ్రీనివాసరావు సేవ చేశారని.. విలక్షణమైన వ్యక్తి అని, వారి సహజ నటనను ప్రజలు మరవలేరని నారా యణ కొనియాడారు. ఆయన మరణం కళా రంగానికి తీరనిలోటని ప్రగాఢ సంతాపం తెలియజేస్తూ ఆయన కుటుంబసభ్యులకు సానుభూతి తెలియ జేశారు. మాజీ శాసనసభ్యుడు కోటా శ్రీనివాసరావు మరణం పట్ల సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు సంతాపం తెలిపారు. కోటా శ్రీని వాసరావు చిత్రపరిశ్రమలో అనేక వైవిద్యమైన పాత్రలు పోషించి ప్రేక్షకులను అలరిం చారన్నారు. ఆయన మరణం చిత్ర పరిశ్రమకు తీరని లోటని, కోట శ్రీనివాసరావు కుటుంబసభ్యులకు సానుభూతిని తెలియజేశారు.

# 883 అడుగులకు చేరిన శ్రీశైలం డ్యాం

## కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జులై 13, ప్రభాతవార్త:** శ్రీశైలం జలాశయం నిండుకుండలా మారింది. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి ఒక గేటు ద్వారా నీటి విడుదల కొనసాగుతున్నది. కర్ణాటక నుంచి కృష్ణా నదికి భారీగా వరద జలాలు రావడంతో జూరాల నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో నమోదవుతున్నది, ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులగాను ప్రస్తుతం 883.30 అడుగులకు చేరుకున్నది. ఇక నీటి నిల్వలు 215 టీఎంసీలకుగాను 206.0996 టీఎంసీలకు చేరుకున్నాయి. ప్రాజెక్టు ఒక గేటు 10అడుగుల మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. కాగా భారీ ఇన్ ఫ్లోతో ఏపీలోని పోతిరెడ్డిపాడుతో పాటుగా తెలంగాణలోని మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి నీళ్లు విడుదల చేస్తున్నారు. అలాగేకుడిగట్టు జలవిద్యుత్ కేంద్రానికి 33,067 క్యూసెక్కులు, ఎడమగట్టు జల విద్యుత్ కేంద్రానికి 35,315 క్యూసెక్కులు ద్వారా రెండు తెలుగు రాష్ట్రాలకు విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతుంది. జూరాల నుంచి 36035 క్యూసెక్కులు సుంకేసుల నుంచి 30,728క్యూసె క్కుల నీళ్లు వచ్చిడ్యాంలోకి చేరుతున్నాయి. మొత్తంగా శ్రీశైలం జలాశయం నుంచి 73568 క్యూసెక్కులు దిగువకు నాగార్జున సాగర్‌కు విడుదలయ్యాయి.

# దేశ రాజధానిలో త్రిపుర విద్యార్థిని అదృశ్యం



**న్యూఢిల్లీ, జులై 13:** దేశ రాజధాని ఢిల్లీలో స్నేహ దెబ్‌నాథ్ అనే 19 ఏళ్ల విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో అదృశ్యం కావడం సంచలనం రేపుతోంది. త్రిపురకు చెందిన స్నేహ అదృశ్యంపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మానిక్ సాహా పోలీసులను ఆదేశించారు. త్రిపుర జిల్లా సబ్రూమ్ నివాసి అయిన స్నేహ ఢిల్లీ యూని వర్సిటీకి అనుబంధంగా ఉన్న ఆత్మారామ్ సనాతన్ ధర్మ కాలేజీలో చదువుతోంది. చివరి సారిగా తన కుటుంబ సభ్యులతో ఈనెల 7న మాట్లాడింది. తన స్నేహితురాలిని దిం పేందుకు సరాయ్ రోహి ల్లా రైల్వే స్టేషన్‌కు వెళ్తు న్నట్టు తల్లికి తెలిపింది. ఉదయం 5.56 గంట లకు చివరిసారిగా ఫోన్ కాల్ రికార్డయింది. 8.45 గంటలకు ఆమె ఫోన్ స్విచ్ఛాఫ్ అయింది. అయితే స్నేహ తనను కలుకోలేదని ఆమె ఫ్రెండ్ చెప్పడంతో తల్లిదండ్రుల్లో ఆందోళన మొదలైంది. క్యాబ్ డ్రైవర్‌ను కనుక్కోగా సిగ్నేచర్ బ్రిడ్జి దగ్గర దింపినట్టు తెలియడంతో కుటుంబ సభ్యులు మరింత బెంబేలెత్తారు. సిగ్నేచర్ బ్రిడ్జి అంత సేఫ్టీ కాకపోవడమే కాకుండా అక్కడ పరిమితంగానే సీసీటీవీ నిఘా ఉంది. స్నేహ ఆచూకీపై కెమెరా ఫుటేజ్ లేకపోవడంతో ఆమె జాడ తెలుసుకోవడం క్లిష్టంగా మారింది. ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు ఈనెల 9న ఎన్‌డీఆర్‌ఎఫ్ సాయంతో సిగ్నేచర్ బ్రిడ్జి చుట్టూ ఏడు కిలోమీటర్ల పరిధిలో తీవ్రమైన గాలింపు చర్యలు జరిపారు. అయితే ఇంతవరకూ సరైన ఆధారాలు ఏవీ దొరకలేదు. స్నేహ గత నాలుగు నెలలుగా డబ్బులు డ్రా చేయలేదని, బ్యాంకు అకౌంట్ ముట్టుకోలేదని ఆమె తల్లిదండ్రులు చెబుతున్నారు. దీంతో స్నేహ ఆచూకి తెలిస్తేసమాచారం ఇవ్వాలని ప్రజలను పోలీసులు కోరారు.

# హెచ్‌సిఎ గోల్‌మాల్ కేసులో నిందితుల కస్టడీపై నేడు తీర్పు

**హైదరాబాద్, జులై 13, ప్రభాతవార్త :** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌లో వెలుగుచూసిన గోల్‌మాల్ కేసులో అరెస్టయి జైల్లో వున్న ఐదుగురు నింది తుల కస్టడీపై మల్కాజిగిరి కోర్టులో సోమవారం తీర్పు వెలువడనుంది. ఈ కేసులో హెచ్‌సిఎ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు సహా ఐదుగురు అరెస్టవడం తెలిసిందే. మరో నిందితుడు దేవరాజ్ పరారీలో వుండగా అతని కోసం గాలిస్తున్నారు. హెచ్‌సిఎ గోల్‌మాల్‌లో పదుల కోట్ల రూపాయల అక్రమాలు జరిగినందున నిందితు లను పది రోజుల పాటు కస్టడీకి అనుమతించాలని సిఐడి అధికారులు మల్కా జిగిరి కోర్టును కోరారు. అయితే ఈ పిటిషన్‌పై డిఫెన్స్ న్యాయవాది అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇదే సమయంలో నిందితుల తరపున ఆయన బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. రెండింటిపైనా సోమవారం కోర్టు నిర్ణయాన్ని ప్రకటించనుంది.

# రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థపై పెనుభారంగా విద్యుత్ డిస్కంలు

## వీటి మొత్తం నష్టాలు రూ.6.5 లక్షల కోట్లు

### దేశ జిడిపిలో 2.4 శాతం నమోదు

**హైదరాబాద్, జూలై 13, ప్రభాతవార్త:** విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కమ్‌లు) రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై భారంగా తయారయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ పంపిణీ సంస్థలను తమ స్వప్రయోజనాలకు ఉపయోగించుకోవడంతో వాటి పరిస్థితి క్రమేపీ దిగజారుతోంది. ఈ నేపథ్యంలోనే 2022-23 నాటికి రాష్ట్ర డిస్కమ్‌ల మొత్తం పోగుపడిన నష్టాలు రూ.6.5 లక్షల కోట్లకు చేరుకున్నాయి. ఇది దేశ జిడిపిలో 2.4 శాతంగా నమోదైంది. ఈ మేరకు వీటికి సంబంధించి భారతీయ రిజర్వ్ బ్యాంక్ విడుదల చేసిన ఒక నివేదికలో పేర్కొంది. విద్యుత్ పంపిణీ సంస్థలు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై ఒక డ్రాగ్ కొనసాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. వివిధ సంస్కరణల ప్రయత్నాలు ఉన్నప్పటికీ డిస్కమ్‌లు రాష్ట్రాలకు ఒక ముఖ్యమైన సవాలుగా ఉన్నాయని తెలిపింది. దీనిని పరిష్కరించడానికి, ఉత్పాదకతను మెరుగుపరచడం, ప్రసార మరియు పంపిణీ నష్టాలను తగ్గించడంతో పాటు, విద్యుత్ సరఫరా యొక్క వాస్తవ వ్యయంతో సుంకాలను సర్దుబాటు చేయడం వంటి చర్యల యొక్క ప్రాముఖ్యతను గూర్చి నొక్కి చెప్పింది. ఇతర సిఫార్సు దశల్లో విద్యుత్ సరఫరా పరిశ్రమను విడదీయడం మరియు విద్యుత్ ఉత్పత్తి మరియు పంపిణీని ప్రైవేటీకరించడం ఉన్నాయి. తద్వారా రాష్ట్ర ఆర్థిక నాణ్యతను గణనీయంగా మెరుగుపరుస్తుందని వెల్లడించింది. డిస్కమ్‌లను ఆర్థిక బలోపేతం చేసే విధంగా పెంపొందించడం ద్వారా రాష్ట్ర ఆర్థిక మొత్తం నాణ్యతను మెరుగుపరచడానికి ఈ చర్యలు కీలకమైనవని వివరించింది. అనేక ఆర్థిక పునర్నిర్మాణ ప్రయత్నాలు ఉన్నప్పటికీ, 2016-17 నుండి డిస్కమ్‌ల మొత్తం బకాయిలు సగటు వార్షిక రేటు 8.7 శాతం వద్ద వృద్ధి చెందాయని నివేదిక హైలైట్ చేసింది. పంపిణీ నష్టాలను తగ్గించడం, మీటరింగ్ వ్యవస్థలను మెరుగుపరచడం, సకాలంలో టారిఫ్ సవరణలను నిర్ధారించడం మరియు ప్రభుత్వ సబ్సిడీలపై ఆధారపడటాన్ని క్రమంగా తగ్గించడానికి విద్యుత్ రంగాన్ని ప్రోత్సహించడం ద్వారా రాష్ట్రాలు కార్యాచరణ సామర్థ్యాన్ని ప్రాధాన్యపరచాలని నివేదిక వివరించింది. ఇది గత సంవత్సరాల నుండి మెరుగుదలను ప్రతిబింబిస్తుందని చెప్పింది. మరియు బాధ్యతాయుతమైన ఆర్థిక నిర్వహణకు నిబద్ధతను ప్రదర్శిస్తుందని తెలియజేసింది. అదనంగా, ఖర్చుల నాణ్యతను మెరుగుపరచడంలో రాష్ట్రాలు పురోగతి సాధించాయని నివేదిక పేర్కొంది. మరింత సానుకూల పరిస్థితుల నేపథ్యంలో ఆర్థిక క్రమశిక్షణను కొనసాగించడంలో రాష్ట్రాలు పురోగతి సాధించాయని పేర్కొంది. 2023-24లో రాష్ట్రాల స్థూల ఆర్థిక లోటు 2.91 శాతం వద్ద ఉంది, ఇది ఆర్థిక బాధ్యత చట్టం ద్వారా నిర్దేశించబడిన 3 శాతం పరిమితిలో బాగానే ఉంది. ఇక ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో పెట్టుబడి మరియు దీర్ఘకాలిక వృద్ధికి కీలక సూచిక అయిన మూలధన వ్యయం 2023-24లో జిడిపిలో 2.6 శాతానికి పెరిగింది, ఇది అంతకుముందు సంవత్సరంలో 2.2 శాతంగా ఉంది. 2024-25లో రాష్ట్రాలు ఆర్థిక క్రమశిక్షణను కొనసాగించాలని భావిస్తున్నాయని, ఈ నేపథ్యంలో 3.2 శాతంగా ఉంటుందని నివేదిక అంచనా వేసింది.

## నేడు చౌటుప్పల్, నల్గొండలో పర్యటించనున్న బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

**హైదరాబాద్, జూలై 13, ప్రభాతవార్త:** బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రాంచందర్ రావు చౌటుప్పల్, నల్గొండ జిల్లాలో పర్యటించనున్నారు. సోమవారం ఉదయం హైదరాబాద్ నుంచి బయలుదేరి ఉదయం 9 గంటలకు మునుగోడు నియోజకవర్గం, చౌటుప్పల్ చేరుకుంటారు. ఆ తరువాత నకిరేకల్ నియోజకవర్గం చిట్యాల, నార్కెట్‌పల్లి, నల్గొండ పట్టణంలో పర్యటిస్తారు. మధ్యాహ్నం 3.30 గంటలకు సూర్యాపేట చేరుకున్న అనంతరం బిజెపి పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. రాత్రి 7 గంటలకు రామచందర్ రావు స్వగ్రామం కోదాడ నియోజకవర్గం నడిగూడెం గ్రామంలో వివిధ వర్గాలతో, గ్రామస్తులతో మాట్లాడుతారు. రాత్రి వారి స్వగ్రామంలో బసచేస్తారు. 15వ తేది స్వగ్రామంలో దేవాలయంలో పూజలు నిర్వహిస్తారు. కోదాడ, చౌటుప్పల్ మండలంలో పర్యటిస్తారు.

## ఎమ్మెల్సీ కవితపై తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలు ఖండిస్తున్నాం

### పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై 13:** ఎమ్మెల్సీ కవితపై తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలు గర్హనీయమని టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఖండించారు. మహిళలను గౌరవించుకోవడం మన సంప్రదాయమని, కవితపై మల్లన్న చేసిన అనుచిత వ్యాఖ్యలు ఖండించాల్సిందేనని స్పష్టం చేశారు. అయితే మల్లన్న కార్యాలయంపై జాగృతి కార్యకర్తల దాడి చట్ట వ్యతిరేకమని మండి పడ్డారు. చట్ట పరిధిలో అందరూ పని చేసుకోవాలని సూచించారు. మల్లన్న కార్యాలయంపై దాడి, గన్‌మెన్ కాల్పులు జరిపిన అంశాలపై వచ్చిన ఫిర్యాదులపై చట్టపరిధిలో విచారణ జరుగుతుందన్నారు. బిసి బిల్లు, రిజర్వేషన్లు అన్ని కాంగ్రెస్ కృషి ఫలితమేనని మహేశ్‌కుమార్‌గౌడ్ మరోసారి పునరుద్ఘాటించారు. బిసి రిజర్వేషన్ల అంశంలో ఇతరులు లబ్ధి పొందాలని చూడడం సమంజసం కాదని హితవు పలికారు.

## ధూపదీప నైవేద్య పథకం పోస్టులకు భారీ డిమాండ్

### 255 పోస్టులకు 3,500పైగా దరఖాస్తులు

**హైదరాబాద్, జూలై 13, ప్రభాతవార్త:** దేవాదాయ ధర్మాదాయ శాఖ మంజూరు చేసిన దూప దీప నైవేద్యం పథకంలోని పోస్టులకుభారీగా పోటీ నెలకొంది. మంజూరు చేసిన 255 పోస్టులకు పోటాపోటీగా దరఖాస్తులు వెల్లువెత్తాయి. గడువు చివరి నాటికి ఎండోమెంట్ కార్యాలయానికి దాదాపు 3,500 పైగా దరఖాస్తులు వచ్చాయి. అత్యధికంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 600, ఉమ్మడి వరంగల్ జిల్లాలో 300 పైగా దరఖాస్తులు వచ్చాయి. వీటితో పాటు ఇతర జిల్లాల నుంచి కూడా భారీగా అప్లికేషన్లు వచ్చాయి. వీటిని పరిశీలించి దూప దీప నైవేద్యం పథకానికి అర్హత కలిగిన ఆలయాలను ఎంపిక చేసేందుకు ఎండోమెంట్ అధికారులు కసరత్తు మొదలుపెట్టారు. ఇప్పటికే ఏ జిల్లా నుంచి ఎన్ని దరఖాస్తులు వచ్చాయో వాటిని జిల్లాల వారీగా విభజించారు. అర్హులను గుర్తించే ప్రక్రియను త్వరలో చేపట్టేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం దేవాదాయ శాఖ అధికారులు బోనాల ఉత్సవాలు ఉండటంతో పరిశీలనను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు తెలిసింది. ఉత్సవాలు ముగియగానే ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. రాష్ట్రంలో దేవాదాయ శాఖ పరిధిలో అనేక దేవాలయాలు ఉన్నప్పటికీ అవి దూపదీప నైవేద్యానికి నోచడం లేదు. వాటికి ఏళ్ల నాటి చరిత్ర ఉన్నా నిర్వహణ లేక అవి శిథిలావస్థకు చేరాయి. విశిష్టత కలిగిన ఆలయాలను గుర్తించి నిత్యం పూజలు నిర్వహించేందుకు అర్చకులకు కనీస వేతనం, ఆలయాల నిర్వహణకు కనీస ఖర్చుల కింద ప్రభుత్వం నెలనెలా నిధులు మంజూరు చేస్తుంది. ఆలయ పూజారికి రూ.6 వేల చొప్పున, ఆలయ నిర్వహణకు రూ.4 వేల చొప్పున మొత్తం రూ. 10వేల పూజారి(పంతులు) ఖాతాలో జమ చేయనుంది. నెలకు రూ.10 వేల చొప్పున అందజేయడమే దూప దీప నైవేద్యం పథకం కింద ఎంపికైనట్లు పేర్కొంటున్నారు.

ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా దూప దీప నైవేద్యం పథకంలో 255 పోస్టులు మంజూరు చేసింది. అర్హులైన వారు ఈ పోస్టులకు జూన్ 24 వరకు దరఖాస్తులు చేసుకోవాలని ఎండోమెంట్ డిపార్ట్మెంట్ నోటిఫికేషన్ జారీచేసిన విషయం తెలిసిందే. వీటి కోసం వివిధ ఆలయాల్లో పూజలు చేస్తున్న అర్చకులు పెద్దసంఖ్యలో పోటీపడ్డారు. ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 3,500 దరఖాస్తులు వచ్చాయి. వీటిని పరిశీలించేందుకు ఎండోమెంట్ ఉన్నతాధికారులు సర్వం సిద్ధమయ్యారు. ప్రభుత్వం మంజూరు చేసిన 255 పోస్టులు పరిమిత సంఖ్యలో ఉండటంతో అర్చకుల నుంచి పోటీ తీవ్రంగా ఉంది. తాజాగా 33 జిల్లాల ప్రకారం చూస్తే జిల్లాకు 6 నుంచి 7 పోస్టులు కేటాయించే అవకాశం ఉంది. ఈ లెక్కన అర్చకులను ఎంపిక చేయాల్సి ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. ఎంపిక విధానంలో అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుంటూ జాబితాను రూపొందించనున్నారు. దూప దీప నైవేధ్యం పథకానికి ఎంపిక చేసే ఆలయానికి కొన్ని నిబంధనలు పెట్టారు. ముందుగా ఆ ఆలయం ఎండోమెంట్‌లో రిజిస్టేషన్ అయి ఉండాలి.

ఆలయానికి ఐదెకరాల కంటే తక్కువ భూమి కలిగి ఉండాలి. అంతేకాకుండా ఇతర ఆదాయం పొంది ఉండకూడదు. ఆ గుడి విశిష్టత, ఆలయ చరిత్ర కలిగి ఉండాలి. అప్పుడే ఆ ఆలయం దూప దీప నైవేద్యం పథకం పరిధిలోకి వస్తుంది. దీనిని ఎంపిక చేయాలంటే ఎండోమెంట్ ఇన్స్పెక్టర్ నివేదిక, ఈవో(ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్) ధ్రువీకరణ, అసిస్టెంట్ కమిషన్ ప్రతిపాదన అనంతరం అడిషనల్ కలెక్టర్ ఎంపిక చేస్తారు. ఎంపిక చేసిన ఈ జాబితాను ఎండోమెంట్ కమిషనర్ ధ్రువీకరించి దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆమోదం కోసం పంపిస్తారు. అనంతరం ప్రభుత్వం గెజిట్ విడుదల చేస్తుంది. అప్పటి నుంచి ఆ ఆలయాలు దూప దీప నైవేద్యం పథకం పరిధిలోకి వస్తాయి నెలనెలా రూ.10 వేల చొప్పున ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుంది.

## ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాళ్ల పదోన్నతులకు నేడు కౌన్సెలింగ్

### ఇంటర్ విద్య కమిషనరేట్‌లో నిర్వహణ

### 81 మందికి కౌన్సెలింగ్ నిర్వహించనున్న అధికారులు

**హైదరాబాద్, జూలై 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న జూనియర్ లెక్చరర్లకి ప్రిన్సిపాల్స్‌గా పదోన్నతులు కల్పించనున్నారు. జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న సీనియర్ మోస్టు జూనియర్ లెక్చరర్లకి ప్రిన్సిపాల్స్‌గా పదోన్నతులు ఇవ్వాలని ఇంటర్ విద్య శాఖ నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన కౌన్సెలింగ్‌ను నేడు(సోమవారం) హైదరాబాద్‌లోని నాంపల్లిలో గల ఇంటర్ విద్య కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించనున్నారు. ప్రిన్సిపాల్స్‌గా పదోన్నతి పొందనున్న 81 మంది జూనియర్ లెక్చరర్ల పదోన్నతికి కౌన్సెలింగ్ నేడు నిర్వహించనున్నారు. తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యాశాఖ రాష్ట్రవ్యాప్తంగా 81 మంది అర్హులైన జూనియర్ లెక్చరర్లకి ప్రిన్సిపాల్‌లుగా పదోన్నతి ఇవ్వడం కోసం నేడు కౌన్సెలింగ్ నిర్వహించనున్నది. పదోన్నతికి ఎంపికైన జూనియర్ లెక్చరర్లు తప్పనిసరిగా కౌన్సెలింగ్‌కు సమయానికి హాజరుకావాలని ఇంటర్ విద్య డైరక్టర్ సూచించారు. ఈ కౌన్సెలింగ్ ద్వారా రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలలో అకడమిక్‌తోపాటు అడ్మినిస్ట్రేటివ్ విధులను సమర్థవంతంగా నిర్వహించేందుకు పదోన్నతులను కల్పించనున్నారు. పదోన్నతుల అనంతరం రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కాలేజీలకు రెగ్యులర్ ప్రిన్సిపాల్స్ కొనసాగనున్నారు.

## గాంధీభవన్‌లో వరంగల్ కాంగ్రెస్ నేతల సమావేశం

### పరస్పరం ఫిర్యాదు చేసుకోవడం మామూలే: మంత్రి కొండా సురేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై 13:** ఆదివారం గాంధీ భవన్‌లో వరంగల్ జిల్లా కాంగ్రెస్ ముఖ్య నాయకులు సమావేశం అయ్యారు. ఈ సమావేశానికి ఇంచార్జ్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి మంత్రులు కొండా సురేఖ, సీతక్క, వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్యనాయకులు హాజరయ్యారు. సంస్థాగత పార్టీ నిర్మాణం, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై సమగ్రంగా చర్చించారు. కాగా, సమావేశం ప్రశాంత వాతావరణంలో ముగిసింది. ఈ సందర్భంగా కొండా సురేఖ మాట్లాడుతూ ఇది పార్టీకి సంబంధించిన సమావే శమని అన్నారు. ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోవడం మామూలేనని కానీ పార్టీ కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాల్సిందేనని వ్యాఖ్యానించారు. ఇదిలా ఉంటే ఇటీవల వరంగల్ కాంగ్రెస్‌లో రాజకీయాలు తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీ బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన నాయకులపై తీవ్ర విమర్శలు చేశారు. దీంతో వరంగల్ రాజకీయాలు వేడెక్కాయి. వరంగల్ జిల్లా నేతలు పార్టీ క్రమశిక్షణా కమిటీకి ఫిర్యాదు చేశారు. దీంతో కొండా మురళి కమిటీ ముందు హాజరై వివరణ ఇవ్వాల్సి వచ్చింది.

## ప్రభుత్వ కాలేజీ హాస్టళ్లల్లో 20 శాతం సీట్లు పెంచాలి

### కొత్తగా 100 బిసి హాస్టళ్ల మంజూరు కోరుతూ సిఎం రేవంత్‌రెడ్డికి ఎంపి ఆర్.కృష్ణయ్య లేఖ

**హైదరాబాద్, జూలై 13 ప్రభాతవార్త:** ప్రభుత్వ కాలేజీ హాస్టల్లో 20 శాతం చొప్పున సీట్లు పెంచాలని, కొత్తగా 100 బిసి హాస్టళ్లను మంజూరు చేయాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. కాలేజీ హాస్టళ్లలో సీట్లు దొరకక బీసీ విద్యార్థులు అష్టకష్టాలు పడుతూ రైల్వే స్టేషన్లలో, నిద్ర, స్నానాలు చేయాల్సిన పరిస్థి తులు నెలకొన్నాయి. హైదరాబాదుతో సహా జిల్లాలలో బీసీ కాలేజీ హాస్టల్‌లో సీట్లు లభించక బీసీ విద్యార్థులు అష్టకష్టాలు పడుతున్నారు. వెంటనే కొత్తగా హాస్టళ్లు మంజూరు చేసి బీసి విధ్యార్థులను ఆదుకోవాలని తగుచర్యలు తీసుకోవాలని కోరారు. హైదరాబాదులో హాస్టల్ సీట్లు లభించక విద్యార్థులు కాచిగూడ రైల్వే స్టేషన్లలో సికిందరాబాద్ రైల్వే స్టేషన్లలో నిద్రపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేద విద్యార్థులు సీట్ల కోసం మహబూబ్‌నగర్, నల్గొండ, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, మెదక్ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున దరఖాస్తులు పెట్టుకుంటున్నారు. ముఖ్యమంత్రి వెంటనే జోక్యం చేసుకొని ప్రస్తుతం కొనసాగుతున్న హాస్టల్లో 20 శాతం చొప్పున సీట్లు పెంచాలని కోరారు.

## ‘బచ్చా.. ఆగయా భాయ్స్

### గంజాయ్ కోడ్‌తో కస్టమర్లు పట్టివేత

### ఈగల్ టీం డెకాయ్ ఆపరేషన్

**హైదరాబాద్, జూలై 13, ప్రభాతవార్త:** గంజాయ్ కస్టమర్లను గుర్తించేందకు రాష్ట్ర‘ఈగల్ టీమ్’ సరికొత్త పథకాన్ని అమలుచేసింది. ఇటీవల మహారాష్ట్రకు చెందిన గంజాయ్ సరఫరాదారుడు సందీప్‌ను అరెస్ట్ చేశారు. అయితే ఆదివారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో గంజాయి వినియోగించేవారు ఉన్నారని భావించి తన ఫోన్‌లో ఉన్న కాంటాక్ట్ నెంబర్లకు వాట్సాప్‌లో కోడ్ అయిన ‘బచ్చా ఆగయా భాయ్స్’ అంటూ ఈగల్ టీం పోలీసులే మెస్సెజ్‌ను చేసి ఓ ప్రదేశానికి రావాలని పంపించారు. వెంటనే ఆగమేఘాలపై స్పందించిన ఐటీఉద్యోగులు, రిలేషన్‌షిప్ మేనేజర్లు, ఆన్‌లైన్ ట్రేడర్లు, విద్యార్థులు, డెంటిస్టులు, టెక్నిషియన్లు కలిపి 14మంది అక్కడికి రాగానే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఒకరు భార్య, కుమారుడితో కలిసి చేరుకోవడంతో పోలీసులు కంగుతిన్నారు. వీరందరికి యూరిన్ పరిక్ష చేయడంతో పాజిటివ్ రావడంతో డీఅడిక్షన్ సెంటర్‌కు పంపించినట్లు ఈగల్‌టీం పోలీసులు పేర్కొన్నారు.

## సిపిఐ 4వ రాష్ట్ర మహాసభలు.. లోగో ఆవిష్కరణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై 13:** ప్రభుత్వ భూములను పేదలకు పంచడానికి ఉద్యమం కొనసాగిస్తామని సీపీఐ మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. సీపీఐ జాతీయ సమితి సభ్యులు, మాజీ ఎంఎల్సి పల్లా వెంకట్ రెడ్డితో కలిసి ఆదివారం సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో ఆయన సీపీఐ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభల లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర మహాసభల సందర్భంగా సీపీఐ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి పార్టీ లక్ష్యాలను వివరించాలన్నారు. ఈ మహాసభల జయప్రదం కోసం ప్రతి ఒక్కరు పని చేయాలని కార్యకర్తలను కోరారు. మేడ్చల్ జిల్లాలో పార్టీ అనేక బస్తిలలో వేలాది మందికి గుడిసెలను వేసి భములను పంచిన చరిత్ర ఉందన్నారు. ప్రజలకు ఈ విషయాన్ని చెబుతూ పీపీఐ పార్టీని మరింత ముందుకు తీసుకెళ్లాలన్నారు.

# సింగరేణి నిధులు ఇక్కడే ఖర్చు చేస్తాం

## త్వరలో చట్టం తీసుకుని వస్తాం

### మంత్రి వివేక్ వెంకటస్వామి



**హైదరాబాద్, జూలై 13, ప్రభాతవార్త :** సింగరేణి సంస్థకు సంబంధించి డిఎంఎఫ్‌టి నిధులను సింగరేణి ప్రాంతాల్లోనే ఖర్చు చేసేలా త్వరలో చట్టం తీసుకొస్తామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. ఆదివారం మంచిర్యాల జిల్లా మంచమర్రి, క్యాతనపల్లి మున్సిపాలిటీల్లో పర్యటించారు. వరుసగా గనులు మూత పడటంతో ఉపాధి అవకాశాలు తగ్గుతున్నాయన్న మంత్రి కొత్త బొగ్గు గనులు రావాల్సిన అవసరం ఉంద న్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవ హరిస్తున్న అధికారులు, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జైపర్లో 850 మెగావాట్ల మూడో యూనిట్‌కు త్వరలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భూమి పూజ చేస్తారని తెలిపారు. ఈ ప్లాంట్ ద్వారా 5 వేల కొత్త ఉద్యోగాలు వస్తాయన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత రాష్ట్రంలో మొదటి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను మందమర్రిలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కోర్టు తీర్పు ఆధారంగా మందమర్రి మున్సిపాలిటీకి ఎన్నికలు జరిపిస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రెడ్ కెటగిరీ పరిశ్రమల్లోని కీలక విభాగాల్లో శిక్షణ పొందిన కార్మికులను నియమించేలా చర్యలు తీసుకుంటామని కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. ఈ విషయమై ఇప్పటికే కార్మిక శాఖ కార్యదర్శిని ఆదేశించినట్లు చెప్పిన మంత్రి త్వరలోనే దీనిపై చట్టం కూడా తీసుకొస్తామన్నారు. పాశమైలారం ఫ్యాక్టరీలో కీలక విభాగాల్లో శిక్షణ పొందిన కార్మికులను నియమించలేదని గుర్తించామన్నారు.

# ఆగస్టు 4 నుంచి కామన్ పిజి ఎంట్రన్స్ పరీక్షలు

### ఇప్పటి వరకు 36వేల దరఖాస్తులు

### 17 వరకు దరఖాస్తుల స్వీకరణ

### అపరాధ రుసుంతో 28 వరకు అవకాశం

**హైదరాబాద్, జూలై 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల్లో పిజి కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే తెలంగాణ కామన్ పిజి ఎంట్రన్స్ టెస్ట్(టిజిసిపిజిఈటి)-2025 పరీక్షలను ఆగస్టు 4 నుంచి నిర్వహించ నున్నారు. ఇందుకు సంబంధించి సబ్జెక్టు వారీ పరీక్షల షెడ్యూల్‌ను త్వరలోనే వెల్లడించానున్నారు. ఇందుకు సంబంధించిన దరఖాస్తులను జూన్ 18 నుంచి స్వీకరిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటి వరకు సుమారు 36 వేల మంది దరఖాస్తు చేసుకున్నట్టు తెలిసింది. పిజి కోర్సులైన ఎంఏ, ఎంఎస్సీ, ఎంకామ్, ఎంఈడి, ఎంపిఈడి వంటి పోస్ట్ గ్రాడ్యుయేట్ (పిజి) ప్రోగ్రామ్‌లతో పాటు 5 సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి సిపిజెట్ పరీక్షను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. రాష్ట్రంలోని ఉస్మానియా విశ్వ విద్యాలయం, కాకతీయ విశ్వవిద్యాలయం, శాతవాహన విశ్వ విద్యాలయం, తెలంగాణ విశ్వవిద్యాలయం, మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం, పాలమూరు విశ్వవిద్యాలయం, వీరనారి చాకలి ఇలమ్మ మహిళా విశ్వవిద్యాలయం, జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం హైదరాబాద్ (జెఎన్‌టియుహెచ్)లో ప్రవేశాల కోసం సిపిజెట్‌ను నిర్వహించనున్నారు. జూన్ 18 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించడం ప్రారంభించగా.. ఈ నెల 17 వరకు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా దరఖాస్తులను స్వీక రించనున్నారు. రూ. 500 అపరాధ రుసుంతో జులై 24 వరకు, రూ. 2000తో ఈ నెల 28 వరకు దరఖాస్తులను స్వీకరిం చనున్నారు. రాష్ట్రం లో 297 కాలేజీల్లో సుమారు 50వేల సీట్లు అందుబాటులో ఉన్నాయి. మొత్తం 45 సబ్జెక్టులలో ప్రవేశాల కోసం కంప్యూటర్ బేస్ట్ ఎగ్జామి నేషన్(సిబిటి) విధానంలో పరీక్షలను నిర్వహించనున్నారు.

# కోట శ్రీనివాసరావు సినీప్రతిభ బహుముఖీనం

### ప్రధాని మోడీ సంతాపం

### పార్టీకి తీరనిలోటు: కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, బిజెపి రాష్ట్ర చీఫ్ రాంచందర్‌రావు

**హైదరాబాద్, జూలై 13, ప్రభాతవార్త:** టాలీవుడ్ సీనియర్‌నటుడు కోట శ్రీనివాసరావు మృతి పట్ల ప్రధాని నరేంద్ర మోడీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. కోట మరణం పట్ల ప్రగాఢ సంతాపం ప్రకటించారు. ఈ మేరకు సోషల్ మీడియాలో స్పందించారు. కోట శ్రీనివాసరావు మరణం బాధాకరం. ఆయన సినీ ప్రతిభ, బహుముఖ ప్రజ్ఞకు గుర్తుండిపోతారు అన్నారు. తరతరాలుగా ప్రేక్షకులను తన అద్భుతమైన ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. సామాజిక సేవలో కూడా ఆయన ముందంజలో ఉన్నారని, పేదలు, అణగారిన వర్గాలకు సాధికారత కల్పించడానికి కృషి చేశారన్నారు.

ఆయన కుటుంబానికి, అసంఖ్యాక అభిమానులకు నా సంతాపం. ఓం శాంతి అంటూ మోడీ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు మాజీ శాసనసభ్యులు సినీ నటులు కోట శ్రీనివాస రావు మరణిం చారన్న వార్త తీవ్రంగా బాధించిందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు అన్నారు. అనేక సినిమాలలో విలక్షణ నటుడగా, అనేక పాత్రలు పోషించి ప్రజా జీవితంలో శాసనసభ్యుడిగా పని చేసిన వ్యక్తి వారి మరణం భారతీయ జనతా పార్టీకి వారి అభిమానులకు తీరని లోటు అని అన్నారు. అనారోగ్యంతో ఉన్న పార్టీ కార్యక్రమాలకు వచ్చేవారు కోట శ్రీనివాసరావు మరణం పట్ల వారి కుటుంబ సభ్యులకు అభిమానులకు ప్రగాఢ సంతాపం సానుభూతి తెలియజేస్తూ వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తున్నాం అన్నారు.

ప్రముఖ నటుడు కోట శ్రీనివాస్‌రావు మృతిపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. సనాతన ధర్మం, సామాజిక విలువలు, భాషా పరిరక్షణ తదితర విషయలపై సమాజంలో మరి ముఖ్యంగా యువతలో చైతన్యం నింపేందుకు ఎంతో కృషి చేశారని, నాలుగు దశాబ్దాల సినీ ప్రయాణంలో 750కి పైగా చిత్రాల్లో విభిన్న పాత్రలను పోషించి తెలుగు సినీ రంగంలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును చాటుకున్నారు. 1999లో విజయవాడ ఈస్ట్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు వారి సేవలను గుర్తించి 2015లో కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారంతో గౌరవించుకుందన్నారు. సినిమా రంగంలో ఎప్పటికీ గుర్తుండిపోయేలా అన్ని రకాల పాత్రలు వేస్తూ తనదైన ముద్ర వేసిన విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావుఅని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు.

ఎన్నో జాతీయ, నంది అవార్డులు, రివార్డులు అందుకున్న గొప్ప నటుడు కోట అన్నారు. కోట శ్రీనివాసరావు మృతిపై ఎంపి డా.లక్ష్మణ్, ఏపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ సంతాపాన్ని ప్రకటించారు. త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడులు కోట శ్రీనివాసరావు మృతికి సంతాపాన్ని తెలియజేశారు.

# పబ్‌లలో ఆగని డ్రగ్స్ దందాలు

### వరుసగా పట్టుబడుతున్న స్మగ్లర్లు, వినియోగదారులు

**హైదరాబాద్, జూలై 13, ప్రభాతవార్త:** గ్రేటర్ పరిధిలో డ్రగ్స్ దందాలు ఆగడం లేదు. పబ్‌లలో మాదకద్రవ్యాల వాడకంపై సర్కారు ఓవైపు కఠినం గా వున్నా మరోవైపు స్మగ్లర్ల ఆగడాలు యధేచ్చగా కొనసాగుతూనే వున్నాయి. పోలీసులు, ఈగల్ బృందం, అబ్కారీ అధికారులు దాడులు చేసిన సం దర్భాలు మినహాయించి మిగతా వేళల్లో నిర్వాహకులది ఆడింది ఆట పాడింది పాట అన్నట్లుగా వుంది. శివార్లలోని కొంపల్లిలో ఓ రెస్టారెంట్‌లో డ్రగ్ స్ తో పట్టుబడ్డ స్మగ్లర్లు నగరంలోని అనేక పబ్‌లకు సరఫరాదారులు కావడం పోలీసులను విస్మయపరిచింది. పబ్‌లు.. కొన్నేళ్లుగా వీటి గురించి నిత్యం వార్తలు వస్తున్నాయి. విశ్వనగరంగా హైదరాబాద్ రూపాంతరం చెందుతున్న తరుణంలో ఆధునిక పోకడలు అలవరచుకున్న కొందరు యువతీ యువకులు పబ్‌లకు రావడం, మద్యం తాగడం, ఆహారం తీసుకోవడం, సంగీతాన్ని ఆస్వాధించడం ఆనవా యితీగా మారింది. ఇంతవరకు బాగానే వున్నా కొన్ని పబ్‌లలో అసాంఘీక చర్యలు వెలుగు చూస్తుండడం పోలీసులతో పాటు సర్కారుకు కూడా తలనొప్పి వ్యవహారంగా మారిందని చెప్పాలి. పబ్‌లలో వచ్చే యువతకు హుషారు ఇచ్చేందుకు వీనులవిందైన సంగీతం ఏర్పాటు చేస్తుంటారు. అయితే ఇందులో పాటలు పాడే కొందరు యువతుల వేషధారణ అశ్లీలంగా వుండడం, వీరిని మద్యం సేవించిన కొందరు అసభ్యకరంగా తాకుతుం డడం, ఈ సందర్భంగా కొన్నిసార్లు గొడవలు జరుగు తుండడం సాధారణంగా మారుతోంది. ఈ తరహా ఘటనలు గతంలో బేగంపేట్ ప్రాంతంలో గల రెండు పబ్‌లలో వెలుగు చూశాయి. పబ్‌లలో పాటలు పాడిన అమ్మాయిలను కిడ్నాప్ చేసేందుకు కొందరు యత్నించిన ఘటనలు కూడా జరిగాయి. ఇక పబ్‌లకు వచ్చే జంటలలో కొందరు కూడా అశ్లీల దుస్తులతో రావడం అనేకసార్లు గొడవలకు దారితీస్తోంది. గచ్చిబౌలిలో ఓ ప్రముఖ గాయకుడు తన స్నేహితురాలితో కలిసి కొంతమేర అసభ్యంగా వుండే దుస్తులతో రావడం, ఈ సందర్భంగా అక్కడ వున్న కొందరు యువకులు సదరు యువతితో అ సభ్యంగా ప్రవర్తించడంతో గొడవ జరిగింది. దీంతో ఆ గాయకుడు తన స్నేహితురాలితో అసభ్యంగా ప్రవర్తించిన వారితో గొడవపడగా వారు ఇతగాడి ని తీవ్రంగా కొట్టారు. దీంతో ఈ వ్యవహారం పోలీసుల వరకు వెళ్లింది. ఇక మూడేళ్ల క్రితం బేగంపేట్‌లో లిబ్సన్ పబ్‌లో వెలుగుచూసిన అశ్లీల బాగోతం సంచలనం రేపింది. పాటలు పాడిన అమ్మాయిలు, వారితో పాటు వున్న అబ్బాయిలు ఒళ్లంగా కనిపించే విధంగా చినిగిపోయిన దుస్తులు వేసు కోగా, పబ్‌లకు వచ్చిన యువకులు కూడా తమ దుస్తులను కొంతమేర చింపుకుని మరీ తప్పతాగి మద్యం మత్తులో అమ్మాయిలతో కలిసి చిందులు వేశారు. దీనిపై పక్కా సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు అర్థరాత్రి వేళ దాడులు చేసి అందరిని అరెస్టు చేసి కటకటాల్లో నెట్టారు. దీం తో ఆ పబ్‌ను మూసివేశారు. ఇక వివిఐపిలు వుండే బంజారాహిల్స్‌లో గల ఫుడింగ్ అండ్ మింక్ పబ్‌లో వెలుగుచూసిన డ్రగ్స్ బాగోతం అందరికి తెలిసిందే. 24 గంటల పాటు హోటల్ కోసం అనుమతులు తీసుకుని దానిని పబ్ కోసం వాడుకున్న నిర్వాహకులు చివరకు మాదకద్రవ్యాలను సర ఫరా చేసేవరకు వెళ్లారు. ఈ పబ్‌కు వచ్చేవారు అంతా బడాబాబుల పిల్లలే అవడంతో వీరికోసం రహస్యంగా డ్రగ్స్‌ను సరఫరా చేయసాగారు. వారాం తరాల్లో కొకైన్ సహా ఇంకొన్ని రకాల మాదకద్రవ్యాలను కోరుకున్న వారికి అందించసాగారు. దీనిపైనా పక్కాగా వ్యవహరించిన టాస్క్‌ఫోర్స్ పోలీసు లు తెల్లవారుజామున రెండున్నర గంటల సమయంలో దాడులు చేసి గోల్‌మాల్ వ్యవహారాన్ని రట్టు చేశారు. ఈ సందర్భంగా ఐదు గ్రాముల కొకైన్ ను జప్తు చేసి ఇద్దరిని అరెస్టు చేశారు. ఇక తాజాగా కొంపల్లిలో ఓ రెస్టారెంట్‌లో కొందరు డ్రగ్స్‌తో పట్టుబడడం సంచలనం రేపింది. వీరంతా నగర ంలోని పలు పబ్ నిర్వాహకులకు డ్రగ్స్ సరఫరాదారులుగా తేలడంతో ఈగల్ బృందం షాక్‌కు గురయ్యింది. దీనిపై వెంటనే రంగంలో దిగి ఏఏ పబ్ లకు డ్రగ్స్ సరఫరా అవుతుందనే దానిపై ఆరా తీస్తున్నారు. రెండు మూడు రోజుల్లో దీనికి సంబంధించి ఇంకొందరు అరెస్టయ్యే వీలుంది. తాజాగా ఆదివారం నాడు రాయదుర్గం పరిధిలో ఓ పబ్‌లో డ్రగ్స్ సేవించి ఒకతను దొరికిపోయాడు. ఇదే సమయంలో గంజాయి కోసం వచ్చిన మరో 14 మంది పట్టుబడ్డారు. కాగా గ్రేటర్ పరిధిలో 30కి పైగా పబ్‌లు వుండగా మెజారిటీ వాటిల్లో అక్రమాలు జరుగున్నాయని పోలీసులకు పక్కా సమాచారం వుంది. అయితే ఆయా ప్రాంతాల పోలీసులు అనేకానేక కారణాల వల్ల మౌనంగా వుంటున్నారని బలమైన ఆరోపణలు వున్నాయి. ఇలా ఎందు కు జరుగుతుందనే దానికి స మాధానం కరువయ్యింది. చాలా వరకు పబ్‌లలో వారంతరాలలో డ్రగ్స్ సరఫరా అవుతుందని పోలీసులకు సమాచారం వుంది. ఇక పబ్‌లలో జరుగు తున్న మరో న్యూసెన్స్ పబ్‌లు మూసివేసిన తరువాత వీటి నుంచి బయటకు వస్తున్న వారు ఆయా ప్రాంతాల్లోని రహదారులపై చేసే అడ్డగోలు హంగామా. మద్యం మత్తులో వున్న వారు వాహనాలు నడిపేందుకు వీల్లేకున్నా చాలా మంది తమ కార్లను లేదా ద్విచక్ర వాహనాలను ఇష్టారీతిన నడుపుతూ అర్ధరాత్రి వేళ విపరీతమైన సౌండ్‌తో హారన్ మోగిస్తూ అక్కడి ప్రజలకు నిద్రలేకుండా చేస్తున్నారు. దీనిపై బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మాదాపూర్ ప్రాంతాల లోని బస్తీల ప్రజలు పలుమార్లు పోలీసులకు ఫిర్యాదులు కూడా చేశారు.. కొన్నిసార్లు మద్యం మ త్తులో వాహనాలు నడుపుతూ అల్లరి చేస్తున్న వారిని నిలదీసిన ఉదంతాలు కూడా వున్నాయి. మొత్తంమీద పబ్‌ల వల్ల జరుగుతున్న అనర్థాలు, గోల్‌మాల్ వ్యవహారాలు అనేకం వున్నాయనడంలో అతిశయోక్తిలేదు. ఈ విషయంలో సర్కారు పూర్తిగా కట్టుదిట్టంగా ఉండాల్సిన అవసరం వుంది. ఎప్పుడైనా ఏదైనా హల్‌చల్ జరిగినపుడు సమావేశాలు నిర్వహించి, మిగతా సమయాలలో చూసీచూడకుండా సర్కారుకు చెడ్డపేరు రావడం ఖాయంగా చెప్పాలి.

14-7pg10exV.qxd:14-7pg10exV.qxd 01/01/01 10:24 AM Page 1






## షూటింగ్ ప్రపంచ కప్‌లో..
# తొలిసారి ఫైనల్‌కు నీరు

**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ షూటింగ్ స్పోర్ట్ ఫెడరేషన్ ప్రపంచ కప్ షాట్‌గన్ స్టేజ్ చివరి రోజున జాతీయ క్రీడల ఛాంపియన్ భారత్ షూటర్ నీరు దండా మహిళల ట్రాప్‌లో తొలిసారిగా ప్రపంచ కప్ ఫైనల్‌కు చేరుకుని నాల్గవ స్థానంలో నిలిచింది. ఇటలీలోని లోనాటోలో జరుగుతున్న నాల్గవ, చివరి అంతర్జాతీయ స్పోర్ట్స్ టోర్నీలో 50 షాట్‌ల ఫైనల్‌లో ఆమె తన మొదటి 35 లక్ష్యాలలో 30 వాటిల్లో ఆధిక్యం కనపరచింది. గత సంవత్సరం న్యూఢిల్లీ ప్రపంచ కప్ ఫైనల్ విజేత అలెస్సియా ఇజ్జీ (ఇటలీ)పై షూట్ ఆఫ్‌లో (21) గెలిచి ఆరవ మరియు చివరి అర్హత స్థానాన్ని పొందిన నీరు, ఆ ఎలిమినేషన్ దశలో ప్రపంచ కప్ స్టేజ్ విజేత, పారిస్ ఒలింపిక్స్ రజత పతక విజేత సిల్వానా మరియా స్టాంకో (ఇటలీ)తో సమంగా నిలిచిన తర్వాత, అధిక బిబ్ సంఖ్య కారణంగా చివరికి నిష్క్రమించింది.

ట్రాప్ కాన్యావర్దే శ్రేణిలో, నీరు 25 మరియు 24 రౌండ్లు షాట్ చేసి తన 66 (21,23,22) పాయింట్లకు జోడించింది, ఇజ్జీ సాధించిన స్కోరుకు సమానమైన 115 స్కోరును సాధించింది. ప్రీతి రాజక్ (114) కూడా ఆ రోజు 23 మరియు 25 రౌండ్లతో బాగా కోలుకుని 66 (20, 24, 22) పాయింట్లను జోడించింది, కానీ ఒకటి తక్కువ చేసి ఎనిమిదో స్థానంలో నిలిచింది. ప్రగతి దూబే (18, 18, 21, 19, 24) సరిగ్గా 100 పాయింట్లతో వెనక్కి తగ్గింది.

ఇక పురుషుల ట్రాప్‌లో జోరావర్ సింగ్ సంధు (24, 25, 24, 24, 24) తన చివరి రెండు అర్హత రౌండ్లలో ఒక్కొక్కటి పడగొట్టాడు, 121 పాయింట్లతో, చివరి రెండు స్లాట్‌ల కోసం ఇద్దరు మాజీ ఒలింపిక్ ఛాంపియన్‌లతో ఐదుమార్గాల షూట్‌ఆఫ్‌లో తన రెండవ షాట్‌ను కోల్పోయి ఔట్ అయ్యాడు. జోరావర్ సహచరులు లక్షయ్ షెరాన్ (24, 22, 24, 23, 23) మరియు జస్వీందర్ సింగ్ (23, 24, 22, 23, 24) ఒక్కొక్కరు 116 పాయింట్లు సాధించి లీడర్‌బోర్డ్‌లో మరింత వెనుకబడిపోయారు.



## వన్డే కెప్టెన్ నుండి
# రోహిత్ ఔట్!
### గిల్‌కు అప్పగించే యత్నాలు
### రేస్‌లో శ్రేయాస్ అయ్యర్



**న్యూఢిల్లీ:** భారత్ స్టార్ క్రికెటర్, ట్రబుల్ షూటర్ రోహిత్ శర్మకు మరో బిగ్ షాక్ ఇచ్చేందుకు రంగం సిద్ధమైంది. భారత్ కెప్టెన్ రోహిత్ టెస్టులకు ఇప్పటికే గుడ్ బై చెప్పాడు. దీంతో టెస్ట్ కెప్టెన్సీ బాధ్యతలు యువ ఆటగాడు శుభమన్ గిల్‌కు అప్పగించారు. అయితే వన్డే కెప్టెన్‌గా రోహిత్ శర్మ కొనసాగుతున్నాడు. కాని ఇప్పుడు వన్డే కెప్టెన్‌గా రోహిత్‌ను తప్పించి ఆ బాధ్యతలు కూడా గిల్‌కు అప్పగించే ప్రయత్నాలు జరుగుతుండటం క్రికెట్ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారాయి. టెస్ట్ కెప్టెన్‌గా సాధించిన అద్భుతమైన విజయం, రోహిత్ స్థానంలో భారత వన్డే కెప్టెన్‌గా గిల్ పగ్గాలు తీసుకునే దిశగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. 2027 ప్రపంచ కప్, రాబోయే వన్డేలకు గిల్ నాయకత్వం వహించే అవకాశం ఉన్నట్లు సమాచారం. వరల్డ్‌కప్‌కు ముందు భారత జట్టులో మరో పెద్ద మార్పు జరగబోతుందని ఇప్పటికే భారత్ క్రికెట్ బోర్డు సంకేతాలు ఇచ్చింది. దీని పర్యవసానమే ప్రపంచ కప్‌తో పాటు, తదుపరి ఆడే వన్డేలకు గిల్ నాయకత్వం తెర ముందుకొచ్చింది. అక్టోబర్‌లో ఆస్ట్రేలియాతో జరిగే మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇది జరగొచ్చని అంటున్నారు. కాగా 2024లో బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ ఐదవ టెస్ట్‌లో రోహిత్ టెస్ట్ కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఆ తర్వాత టెస్టులకు గుడ్ బై చెప్పాడు. అప్పటి నుంచి వన్డే కెప్టెన్ గా రోహిత్‌ను తప్పిస్తారనే ప్రచారం మొదలైంది. అయితే 2025 ఛాంపియన్స్ ట్రోఫీలో జట్టుకు నాయకత్వం వహించేందుకు, భారత్ తరపున వన్డే, టెస్టులు ఆడటానికి రోహిత్ సంసిద్ధతను తెలిపాడు. కానీ ఇంగ్లాండ్‌తో టెస్ట్‌లకు జట్టును ప్రకటించడానికి ముందే సెలెక్టర్లు రోహిత్‌ను టెస్ట్ కెప్టెన్సీ నుండి తొలగించాలని నిర్ణయించినట్లు నివేదికలు ఉన్నాయి. దాంతో టెస్ట్ ఫార్మాట్ నుండి రోహిత్ రిటైర్మెంట్ ప్రకటించాడు.



టెస్ట్‌లకు ముందు వన్డేల్లో గిల్ తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నాడు. 2023, 2024లో ఓపెనర్‌గా అద్భుతంగా రాణించి పరుగుల వరద పారించాడు. ఇక ఇంగ్లాండ్‌లో వ్యూహాత్మక నిర్ణయాలతో అతని కెప్టెన్సీ ఆకట్టుకునేలా ఉంది. సహచరులను కలుపుకుని ముందుకెళ్తున్నాడు. కాగా వన్డే కెప్టెన్ రేసులో వినిపిస్తున్న మరో పేరు శ్రేయాస్ అయ్యర్. అతను కూడా నాల్గవ స్థానంలో స్థిరపడ్డాడు. మరోవైపు ఇండియన్ ప్రీమియర్‌లో కెప్టెన్ గా అయ్యర్ చూపిన టాలెంట్ తో ఉత్తమ వైట్‌బాల్ కెప్టెన్లలో ఒకడిగా గుర్తింపు పొందాడు. ఈ నేపథ్యంలో వన్డే సిరీస్‌లకు భారత్ కెప్టెన్‌గా శ్రేయస్ పేరు కూడా పరిశీలనలో ఉన్నట్లు వెల్లడవుతోంది.

# భారత్‌కే మహిళల టి20 సిరీస్
### చివరి మ్యాచ్‌లో 5 వికెట్ల తేడాతో ఇంగ్లండ్ విక్టరీ

**న్యూఢిల్లీ:** అతిథ్య ఇంగ్లంతో జరిగిన ఐదవ మరియు చివరి మహిళల టీ20 లో భారత్ ఓటమి పాలైంది. ఈ మ్యాచ్‌లో 5 వికెట్ల తేడాతో ఓడిపోవడంతో ఓపెనర్ షఫాలి వర్మ దూకుడు అర్ధ సెంచరీ వృధా అయింది. దీంతో 3-2 తేడాతో టీమిండియా టీ20 సిరీస్‌ను కైవసం చేసుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ ఓపెనర్ షఫాలి 41 బంతుల్లో 75 పరుగులు చేసి మహిళల జట్టును ఆదుకుంది. దీంతో భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు నష్టానికి 167 పరుగులకు పరిమితమైంది.. వర్మ ఇన్నింగ్స్ 14వ ఓవర్లో చార్లీ డీన్ బౌలింగ్‌కు బలైపోయే ముందు 13 బౌండరీలు, ఒక సిక్స్‌తో తన ఇన్నింగ్స్‌ను ముగించింది, దీంతో భారత్ 111/5 వద్ద నిలిచింది. మిగిలిన భారత బ్యాట్స్‌మెన్లు పేలవ ప్రదర్శనతో నిరాశపరిచారు హర్మన్‌ప్రీత్ కౌర్, రిచా ఘోష్,. రాధా యాదవ్ మాత్రమే ఇన్నింగ్స్‌లో రెండంకెల మార్కును చేరుకున్నారు. వారిలో కూడా, ఘోష్ మాత్రమే మధ్యలో ఒకింత రాణించింది ఆమె 16 బంతుల్లో మూడు బౌండరీలతో 24 పరుగులు చేసింది, ఇంగ్లాండ్ బౌలర్లు భారత్ ప్లేయర్ల పరుగుల ప్రవాహాన్ని అద్భుతంగా తగ్గించారు. ఇంగ్లాండ్ తరపున డీన్ 3/23 ప్రదర్శనలో స్టార్‌గా నిలిచింది. సోఫీ ఎక్లెస్టోన్ కూడా 2/28తో ముగించింది. ఫలితంగా భారత్ 167 పరుగులు చేసింది. ఇక 168 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆతిథ్య ఇంగ్లండ్‌కు మరోసారి అద్భుతమైన ఆరంభం లభించింది, ఓపెనర్లు సోఫియా డంక్లీ మరియు డేనియల్ వ్యాట్‌హాడ్జ్ తొలి వికెట్‌కు 11 ఓవర్లలోపు 101 పరుగులు జోడించారు. డంక్లీ 30 బంతుల్లో 46 పరుగులు చేసి మూడు బౌండరీలు, ఒక సిక్సర్ తో రాణించి యాదవ్ ఎడమచేతి వాటం బౌలింగ్ లో ఔటైంది. వ్యాట్‌హాడ్జ్ 37 బంతుల్లో 56 పరుగులు చేసి తొమ్మిది బౌండరీలు సాధించింది. ఆ తర్వాత దీప్తి శర్మ ఆ ధాటికి వెంటనే వికెట్ కోల్పోయి ఇంగ్లాండ్ స్కోరు 107/2 వద్ద నిలిచింది. మైయా బౌచర్ (16), టామీ బ్యూమాంట్ (30), మరియు అమీ జోన్స్ (10) ఆతిథ్య జట్టు తమ మార్గాన్ని కోల్పోకుండా చూసుకుని ఔటయ్యారు. తదుపరి పైజ్ స్కోఫీల్డ్ మరియు ఎక్లెస్టోన్ ఇన్నింగ్స్ చివరి బంతికి ఇంగ్లాండ్ చివరికి లక్ష్యాన్ని చేరుకునేలా చేశారు. ఫలితంగా భారత్ ఈ మ్యాచ్‌లో ఓటమి పాలైనా 3 -2 తేడాతో సిరీస్‌ను దక్కించుకుంది.

# యూరప్ టూర్‌లో ఇండియా మూడో విక్టరీ

**న్యూఢిల్లీ:** ఫ్రాన్స్‌ను ఓడించి, యూరప్ టూర్‌లో వరుసగా ఇండియా పురుషుల హాకీ జట్టు మూడో మ్యాచ్‌ను గెలిచింది. ఐండ్‌హోవెన్‌లోని హాకీ క్లబ్ ఆరంజేరూడ్‌లో జరిగిన పర్యటనలోని మూడో మ్యాచ్‌లో ఫ్రాన్స్‌ను 3-2 తేడాతో ఓడించింది. ఇండియా హాకీ జట్టు తరపున ఆదిత్య అర్జున్ లాల్గే, బాబీ సింగ్ ధామి గోల్స్ చేశారు. ఆదిత్య అర్జున్ లాల్గే రెండు గోల్స్ సాధించగా, అతని సహచరుడు బాబీ కూడా స్కోరు షీట్‌లోకి ప్రవేశించాడు.

ఆదిత్య అర్జున్ లాల్గే మొదటి గోల్ చేశాడు, ఆ తర్వాత అతను పిసిని కూడా గోల్‌గా మార్చాడు. బాబీ సింగ్ ధామి భారతదేశం తరపున మూడవ గోల్ సాధించగా తద్వారా విజయం సాధించారు. ఇంతలో,




ఫ్రాన్స్ తరపున, రెండు గోల్స్‌ను క్లెమెంట్ సాధించాడు. ఈ యూరప్ పర్యటనలో ఇండియా పురుషుల హాకీ జట్టు ఇంకా మొత్తం ఐదు ఆటలు ఆడాల్సి ఉంది. కెప్టెన్ సంజయ్ మరియు వైస్‌కెప్టెన్ మోయిరంగ్థెమ్ రబీచంద్ర సింగ్ నేతృత్వంలో, ఇండియా యూరప్‌లోని మూడు నగరాల్లో మొత్తం ఎనిమిది మ్యాచ్‌లు ఆడనుంది. ఇండియా ఐండ్‌హోవెన్ (నెదర్లాండ్స్)లో ఐర్లాండ్, ఫ్రాన్స్ మరియు నెదర్లాండ్స్‌తో చెరో రెండు మ్యాచ్‌లు ఆడనుండగా, వారు వరుసగా ఆమ్స్టెల్వీన్ (నెదర్లాండ్స్) మరియు ఆంట్వెర్ప్ (బెల్జియం)లో ఇంగ్లాండ్ మరియు బెల్జియంతో చెరో మ్యాచ్ ఆడనున్నారు.

జాతీయ సెటప్ భారత సీనియర్ జట్టు కోసం బలమైన ప్రతిభ గల బృందాన్ని నిర్మించాలని చూస్తున్నందున ఈ మ్యాచ్‌లు ఆటగాళ్ల లోతు మరియు సంసిద్ధతను పరీక్షిస్తాయని భావిస్తున్నారు.

## వాణిజ్యం

# ఐదేళ్లలో 20 లక్షల టన్నులకు రబ్బర్ టర్నోవర్

**న్యూఢిల్లీ, జులై 13:** భారతదేశంలో సహజ రబ్బరు (ఎన్ఆర్) వినియోగం 2030 నాటికి 20 లక్షల టన్నులకు చేరుకుంటుందని అంచనా వేయబడింది మరియు దేశీయ ఉత్పత్తిని వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని ఆటోమోటివ్ టైర్ తయారీదారుల సంఘం చైర్మన్ అరుణ్ మామెన్ అన్నారు. 2025లో, దేశీయ ఎన్ఆర్ ఉత్పత్తి 8.7 లక్షల టన్నులుగా ఉంది, అయితే విని యోగం 14.1 లక్షల టన్నులు, ఫలితంగా 5 లక్షల



టన్నులకు పైగా లోటు ఏర్పడింది అని ఆయన ఒక ఇంటర్వ్యూలో అన్నారు. భారత దేశంలో సహజ రబ్బరు (ఎన్ఆర్) వినియోగం 2030 నాటికి 20 లక్షల టన్నులకు చేరుకుం టుందని అంచనా వేయబడింది మరియు దేశీయ ఉత్పత్తిని వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని ఆటోమోటివ్ టైర్ తయారీదారుల సంఘం చైర్మన్ అరుణ్ మామెన్ అన్నారు. బహుళ రంగాలకు, ముఖ్యంగా టైర్ పరిశ్రమకు ఎన్ఆర్ యొక్క వ్యూహాత్మక ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని, దేశీయ సహజ రబ్బరు (ఎన్ఆర్) ఉత్పత్తిని వేగవంతం చేయడం జాతీయ ప్రాధాన్యత. రబ్బరు సాగు కింద అదనపు ప్రాంతాన్ని తీసుకురావడం ముఖ్యంగా ఈశాన్య ప్రాంతాలు వంటి సాంప్రదాయేతర ప్రాంతాలలో కీలకం. అనేక ఈశాన్య రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ఎజెండాకు ముందస్తుగా మద్దతు ఇస్తున్నా యని ఆయన అన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంలో తొలిసారిగా ఐఎన్ఆర్ఓఏడి (ఇండియన్ నేచురల్ రబ్బరు ఆపరేషన్స్ ఫర్ అసిస్టెడ్ డెవలప్‌మెంట్) ప్రాజెక్టును ఎటిఎంఎ సభ్య కంపెనీలు (అపోలో, సియోట్, జెకె టైర్, మరియు ఎంఆర్ఎఫ్) రబ్బరు బోర్డు ఆఫ్ ఇండియా సహకారంతో ప్రారంభించాయని శ్రీ మామెన్ ఎత్తిచూపారు. ఈ ప్రాజెక్టు ఈశాన్య మరియు పశ్చిమ బెంగాల్ అంతటా రెండు లక్షల హెక్టార్లలో కొత్త రబ్బరు తోటలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. మొదటి నాలుగు సంవత్స రాలలో 1.25 లక్షల హెక్టార్ల కు పైగా సాగులోకి వచ్చాయి. ఎటిఎంఎ సభ్య కంపెనీలు ఈ ప్రాజెక్టుకు రూ.1,100 కోట్లు కేటాయించాయని ఆయన అన్నారు. కేరళలో మాత్రమే 1 లక్ష హెక్టార్ల తో సహా దాదాపు 2 లక్షల హెక్టార్లలో ఉపయోగించని రబ్బరు తోటలను నొక్కడం ద్వారా ఉత్పత్తిని మెరుగుపరచడంలో ఒక ముఖ్యమైన అవకాశంఉంది. కేంద్ర వాణిజ్య అండ్ పరిశ్రమల మంత్రి ఇటీవల కేరళలో వాటాదారుల సంప్రదింపుల సందర్భంగా ఈ అవకాశాన్ని నొక్కి చెప్పారని శ్రీ మామెన్ అన్నారు. రబ్బరు చెట్లు నాటడం నుండి నొక్కడం వరకు దాదాపు ఆరు నుండి ఏడు సంవత్స రాలు పడుతుందని శ్రీ మామెన్ అన్నారు.

# బంగారం కొనాలా, నిఫ్టీలో ఇన్వెస్ట్ చేయాలా?

**ముంబై, జులై 13:** ఐదేళ్ల కిందట రూ.5 లక్షలు పెడితే బంగారం కొనుంటేనా, లేక నిఫ్టీ 50లో పెట్టుబడి పెట్టి ఉంటేనా.. ఏది అధిక లాభాన్ని ఇచ్చి ఉండేది? ద్రవ్యోల్బణానికి రక్షణగా బంగారాన్ని చూస్తారు. కానీ, ఈక్విటీ దీర్ఘకాలంలో అద్భుత వృద్ధిని నమోదు చేసింది. ఈ రెండింటిలో ఏది ఇన్వెస్టర్ల సొమ్మును వేగంగా పెంచిందో తెలుసుకోండి. ఐదేళ్ల కాలంలో భౌతిక బంగారం, నిఫ్టీ 50 సూచీ రెండూ 90 శాతానికి పైగా అబ్సల్యూట్ రిటర్న్ ఇచ్చాయి. ఈక్విటీలో పెట్టుబడి ఐదేళ్లలో ఎంతో మందికి సంపదను పెంచింది. ఇది ఐదేళ్ల కాలంలో స్థిరమైన వృద్ధిని సాధించింది. మీరు ఐదేళ్ల కిందట రూ.5 లక్షలు ఈ రెండింటిలో ఏది పెట్టుబడిగా పెట్టి ఉంటే అధిక లాభం వచ్చేది? పోలికల ద్వారా, ఐదేళ్లలో ఏది ఇన్వెస్టర్ల సంపదను వేగంగా పెంచిందో తెలుసుకోండి. ఐదేళ్ల క్రితం, ముంబైలో 22 క్యారెట్ల బంగారం ధరలను తీసుకుంటున్నాం. 2020 జులై 7న ముంబైలో బంగారం ధర గ్రాముకు రూ.4,626. నేడు అదే నగరంలో అదే నాణ్యత గల బంగారం ధర గ్రాముకు రూ.8,861. శాతంలో చెప్పాలంటే, ఐదేళ్ల ధరల పెరు గుదల

సామాన్యుడిని కోటీశ్వరుడిగా చేసింది. బంగారం, నిఫ్టీ 50లో పెట్టుబడులు పెట్టిన వారు అధిక రాబడిని కోరుకుంటారు. ఈ రెండు పెట్టుబడులు ఒకదానికొకటి సంబంధం లేనివి.



స్వల్ప, దీర్ఘకాలంలో విభిన్న ఫలితాలు ఇవ్వగలవు. గత కొన్ని సంవత్సరాలుగా ప్రపంచ అనిశ్చితి మధ్య బంగారం విలువ పెరిగింది. మరోవైపు, భారత్‌లో మార్కెట్ కేపిటలైజేషన్ అధికంగా గల 50 అతిపెద్ద కంపెనీలకు ప్రాతినిధ్యం వహించే నిఫ్టీ 50, ఒక సంవత్సరంలో కేవలం 4.68 శాతం రాబడిని ఇచ్చింది. కానీ 91.54 శాతం. బంగారంపై రూ.5 లక్షల పెట్టు బడి విలువ నేడు ఐదేళ్ల కిందట భౌతిక బంగారంపై పెట్టిన రూ. 5 లక్షల పెట్టుబడి అంచనా విలువ నేడు రూ. 9,57,700. నిఫ్టీ 50 సూచీ పనితీరు 5ఏళ్లలో నిఫ్టీ 50 సూచీ 25,461.30 వద్ద ముగిసింది. ఐదేళ్లలో సూచీ వృద్ధి 135.76 శాతం. నిఫ్టీలో రూ. 5 లక్షల పెట్టుబడి విలువ ఐదేళ్ల కాలంలో 135.76 శాతం అబ్సల్యూట్ రిటర్న్ తో, నిఫ్టీ 50 సూచీలో పెట్టిన రూ. 5 లక్షల పెట్టుబడి రూ.11,78,800గా మారింది. ఒక సంవత్సర కాలంలో నిఫ్టీ 50 సూచీని బంగారం అధిగమించినప్పటికీ, ఐదేళ్ల కాలంలో మాత్రం నిఫ్టీ50 రాబడి కంటే బంగారం బాగా వెనుకబడి ఉందని ఇది చూపిస్తుంది.

# ఆర్థిక భద్రతకు వెండి ఆసరా..

**ముంబై, జులై 13:** మీరు నాణేలు, కడ్డీలు లేదా ఆభరణాల రూపంలో వెండిని కొనుగోలు చేయవచ్చు. వెండి నాణేలు విస్తృతంగా లభిస్తాయి, సులభంగా నిల్వ చేయవచ్చు లేదా విక్రయించవచ్చు. వెండి కడ్డీలు వివిధ పరిమాణాల్లో వస్తాయి, గ్రాముకు మెరుగైన విలువను అందిస్తాయి. మీరు చాలా సంవత్సరాలు వెండిని కొని దాచుకోవాలని అనుకుంటే దానిని సురక్షి తమైన లాకర్ లేదా బ్యాంకు వాల్ట్‌లో నిల్వ చేయడం మంచిది. సిల్వర్ ఇటిఎఫ్‌లు అంటే వెండిని భౌతికంగా సొంతం చేసుకోకుం డానే పెట్టుబడి పెట్టవచ్చు. ఈ ఫండ్స్ వెండి మార్కెట్ ధరను ట్రాక్ చేస్తాయి. సాధారణ షేర్ల వలె స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో వర్త కం అవుతాయి. భారతదేశం లో, అనేక మ్యూచువల్ ఫండ్ సంస్థలు సిల్వర్ ఇటిఎఫ్‌లను అందిస్తున్నాయి. ఇది చిన్న మొత్తాలతో ఇన్వెస్టర్లు పెట్టుబడి పెట్టడాన్ని సులభతరం చేస్తుంది. డిజిటల్ ప్లాట్ ఫామ్‌లతో, మీరు ఇప్పుడు ఆన్‌లైన్‌లో చిన్న మొత్తాల్లో (ఒక గ్రాము కూడా) వెండిని కొనవచ్చు. మీ వెండిని విక్రేత సురక్షితంగా నిల్వ చేస్తారు. మీరు తర్వాత విక్రయించడానికి లేదా భౌతిక డెలివరీ అడగడానికి ఎంచుకోవచ్చు. ఇది సౌకర్యవంతంగా ఉంటుంది, కాగిత రహిత పెట్టుబడిని ఇష్టపడేవారికి అనుకూలంగా ఉంటుంది. వెండిని తవ్వే కంపెనీలలో పెట్టుబడి పెట్టడం అధిక రాబడిని ఇవ్వగలదు, కానీ అధిక నష్టాలు ఉంటాయి. ఈ స్టాక్స్ వెండి ధరలు మాత్రమేకాకుండా, కంపెనీ పనితీరు, మార్కెట్ పోకడలు, నిర్వహణ సమస్యల వల్ల ప్రభావితమవుతాయి. అనుభవజ్ఞులైన ఇన్వెస్టర్లకు, సిల్వర్ ఫ్యూచర్స్ మరో ఎంపిక. ఇవి నిర్ణీత ధరకు తర్వాత తేదీలో వెండిని కొనడానికి లేదా విక్రయించడానికి ఒప్పందాలు. అయితే, వీటికి లోతైన మార్కెట్ అవగాహన, అధిక స్థాయి నష్టం ఉంటాయి. కరెన్సీ విలువ తగ్గినప్పుడు వెండి మీ సంపదను



రక్షి స్తుంది. బంగారం కన్నా వెండి చౌక. ఎక్కువ మందికి అందుబాటులో ఉంటుంది. ఎలక్ట్రానిక్స్, సోలార్ ప్యానెల్స్ వంటి పరిశ్రమల్లో దీనిని ఉపయోగిస్తారు. ఇది దీర్ఘకాల డిమాండ్‌ను పెంచుతుంది. స్టాక్స్, బాండ్లు లేదా రియల్ ఎస్టేట్ పోర్ట్‌ఫోలియోకు వెండిని చేర్చడం సమతుల్యతను ఇస్తుంది. సులభంగా వెండిని ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లో సులభంగా కొనవచ్చు, అమ్మవచ్చు. వెండిలో పెట్టుబడి పెట్టడం దీర్ఘకాలం పాటు మీ సంపదను పెంచుకోవడానికి, భద్రపరచు కోవడానికి ఆచరణాత్మక మార్గం.

# ఐఐఎఫ్ఎల్ హోంఫైనాన్స్‌కు రూ.858 కోట్ల రుణం

**న్యూఢిల్లీ, జులై 13:** ఐఐఎఫ్ఎల్ హోం ఫైనాన్స్ కంపెనీ తాజాగా 100 మిలియన్ డాలర్ల నిధులను సేకరించింది. ఏసియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్‌బ్యాంకు (ఎఐఐబి)నుంచి భారత కరెన్సీలోసుమారు 858 కోట్లమేర రుణసాయం సేకరించింది. అందుబాటుధరల్లో హౌసింగ్‌ఫైనాన్స్‌చేసే సంస్థ ఆర్థికంగా వెనుకబడిన తరగతులు, అల్పాదాయ వర్గాలకు ఇళ్లను నిర్మించి అందిస్తోంది. గ్రీన్‌బిల్డింగ్ ప్రమాణాలను అనుసరించి హౌసింగ్‌రంగంలో కంపెనీ మరింత ముందుకువెళుతోంది. ఇడబ్ల్యుఎస్, ఎల్ఐజి సెగ్మెంట్లలో ఇళ్లను నిర్మించి విక్రయిస్తుంది. పట్టణ, సెమీ అర్బన్ ప్రాంతాల్లో కూడా ఈ ఇళ్లనిర్మాణం చేపడుతోంది. సుస్థిర వాతావరణ పరిరక్షణ లక్ష్యాలు




చేరుకుంటూనే భారత్‌లో ఒకమోస్తరు పట్టణాలు, అర్బన్‌ప్రాంతాల్లో మరింత విస్తరించేందుకు ఈ నిధులు వినియోగిస్తామని కంపెనీ ప్రకటించింది. ఎఐఐబి డైరెక్టర్ జనరల్ గ్రెరీ లియూ మాట్లాడుతూ, ఐఐఎఫ్ఎల్, హెచ్ఎఫ్ఎల్, ఎఐఐబిలు భాగస్వామ్యంతో అందుబాటు ధరల్లో అందరికీ పక్కాగృహాలు అందించేందుకు మరింత వీలు కలుగుతుందని, అలాగే అల్పాదాయ వర్గాలకు పక్కాఇళ్లను కూడా అందుబాటు లోకి తెచ్చేవిధంగా ఐఐఎఫ్ఎల్ ముందుకు వెళుతుందని ధీమా వ్యక్తంచేసారు. భారత్‌లోని 18 రాష్ట్రాల్లో 376 శాఖలు పనిచేస్తున్నాయి. ఐఐఎఫ్ఎల్, హెచ్ఎఫ్ఎల్ సంస్థలు ఇప్పటి వరకూ అందుబాటులోకి రాని కేంద్రాలు, పట్టణాలు సెమీ అర్బన్‌ప్రాంతాలపై ఫోకస్ పెంచింది.

# రెండు బ్యాంకులపై ఆర్‌బిఐ చర్యలు!

**ముంబై, జులై 12:** దేశంలో అతిపెద్ద ప్రైవేట్ బ్యాంకు అయిన హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకుపై రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా చర్యలు చేపట్టింది. రూ.4.88 లక్షలు జరిమానా విధించినట్లు ప్రకటించింది. తన క్లయింట్‌కు టర్మ్ లోన్ మంజూరు చేసేటప్పుడు 'మాస్టర్ డైరెక్షన్-ఫారిన్ ఇన్వెస్ట్ మెంట్ ఇన్ ఇండియా' నిబంధనలను విస్మరించిందని, అందుకు గానూ విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టం (ఫెమా) సెక్షన్ 11 నిబంధనల ప్రకారం హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకుపై జరిమానా విధించినట్లు రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఒక ప్రకటనలో తెలిపింది. నిబంధనల ఉల్లంఘనలపై ఆర్‌బిఐ షోకాజ్ నోటీసు జారీ చేయగా హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు లిఖిత పూర్వక సమాధానం ఇచ్చిందని, మౌఖిక సమర్పణలో కూడా చేసిందని రిజర్వ్ బ్యాంకు తెలిపింది. కేసు వాస్తవాలు, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు స్పందనను పరిగణనలోకి తీసుకుని జరిమానా విధించాలని ఆర్‌బిఐ నిర్ణయించింది.

**శ్రీరామ్ ఫైనాన్స్‌కూ పెనాల్టీ** డిజిటల్ లెండింగ్ సంబంధిత నిబంధనలను పాటించ నందుకు బ్యాంకింగేతర ఫైనాన్స్ కార్పొరేషన్ (ఎన్‌బిఎఫ్‌సి) అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌పైనా రిజర్వ్ బ్యాంకు జరిమానా విధించింది. ఆర్‌బిఐ జారీ చేసిన రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా (డిజిటల్ లెండింగ్) ఆదేశాలు, 2025 లోని కొన్ని నిబంధనలను పాటించనందుకు ఆర్‌బిఐ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌పై రూ.2.70 లక్షల జరిమానా విధించింది.




2024 మార్చి 31 నాటికి శ్రీరామ్ ఫైనాన్స్ ఆర్థిక పరిస్థితికి సంబంధించి ఆర్‌బిఐ చట్టబద్ధమైన తనిఖీని నిర్వహించింది. ఆర్‌బిఐ ఆదేశాలను పాటించకపోవడం, సంబంధిత ఉత్తరప్రత్యుత్తరాల ఆధారంగా, ఆ ఆదేశాలను పాటించడంలో విఫలమైనందుకు జరిమానా ఎందుకు విధించకూడదో కారణం చూపాలని కంపెనీకి నోటీసులు జారీ చేసినట్లు బ్యాంకు తెలిపింది. రుణగ్రహీతలు నేరుగా రుణ చెల్లింపులను కంపెనీ ఖాతాలో జమ చేయడానికి బదులుగా థర్డ్ పార్టీ ఖాతా ద్వారా రుణ చెల్లింపులను కంపెనీ మళ్లించిందని ఆర్‌బిఐ తన తనిఖీలో గుర్తించింది. దీంతో శ్రీరామ్ ఫైనాన్స్‌కు జరిమానా విధిస్తూ ఉత్తర్వులు జారీచేసినట్లు రిజర్వ్ బ్యాంకు తెలిపింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14